PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 351 | విజయవాడ, మంగళవారం 22 జులై 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Tuesday 22 July 2025 | Rs



అచ్యుతానందన్ కన్నుమూత



అచ్యుతానందన్ మృతి వార్త తెలియడంతో నివాళులర్పించడానికి అప్పటికప్పుడు తరలివచ్చిన ప్రజానీకం. ఇన్‌సెట్‌లో భౌతిక కాయం

ఎకెజి రీసెర్చ్ సెంటర్‌లో భౌతిక కాయం

ప్రియతమ నేతకు ప్రజల ఘన నివాళి

తిరువనంతపురం : కమ్యూనిస్టు యోధుడు, కేరళ మాజీ ముఖ్యమంత్రి, కేరళ రాష్ట్రాన్ని ఆధునిక రాష్ట్ర స్థాయికి అభివృద్ధిపరిచిన అనేక మహత్తర పోరాటాలకు మారుపేరుగా నిలిచిన కామ్రేడ్ వి.ఎస్ అచ్యుతానందన్ సోమవారం మధ్యాహ్నం 3.20 గంటలకు తిరువనంతపురంలో తుదిశ్వాస విడిచారు. తీవ్రంగా గుండెపోటు రావడంతో ఆయనను జూన్ 23న తిరువనంతపురంలోని ఎస్‌యుటి ఆస్పత్రిలో చేర్చారు. అప్పటి నుండి ఆయనకు ఆస్పత్రిలో చికిత్స కొనసాగుతోంది.

23న అధికారలాంఛనాలతో అంత్యక్రియలు

మూడు రోజులు సంతాప దినాలు

మాజీ ముఖ్యమంత్రి విఎస్ మృతికి సంతాప సూచకంగా కేరళ ప్రభుత్వం మంగళవారం నుండి మూడు రోజుల పాటు సంతాపదినాలను ప్రకటించింది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలపై గల జాతీయపతాకాన్ని సగం కిందకు దింపారు. మంగళవారం అన్ని రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ రంగ సంస్థలు, విద్యా సంస్థలతో సహా మొత్తంగా అన్ని కార్యాలయాలు, సంస్థలను మూసివేస్తారు. రాష్ట్రప్రభుత్వ పూర్తి స్థాయి అధికార లాంఛనాలతో 23న అలప్పుజలో అంత్యక్రియలు జరగనున్నాయి.

తిరువనంతపురం న్యాయ కళాశాల సమీపంలోని తన నివాసంలో (వెళిక్కకథ) పడిపోయిన తర్వాత గత రెండేళ్ళకు పైగా ఆయన పక్షవాతంతో బాధపడుతూ చికిత్స తీసుకుంటున్నారు. ఆయన భౌతికకాయాన్ని ఎకెజి అధ్యయన, పరిశోధనా కేంద్రంలో వుంచారు. వివిధ వర్గాలకు మిగతా 8లో

బాధాకరం : రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

వి.ఎస్ అచ్యుతానందన్ మృతి పట్ల భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సంతాపం ప్రకటించారు. అచ్యుతానందన్ మృతి చాలా బాధాకరం. ఆయన తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో ప్రజల సంక్షేమం కోసం ముఖ్యంగా పేదలు, అణగారిన వర్గాల కోసం అవిశ్రాంతంగా పనిచేశారని పేర్కొన్నారు.

ప్రజాసేవకే జీవితం అంకితం ! : మోడీ

అచ్యుతానందన్ మృతికి ప్రధాని మోడీ తీవ్ర సంతాపం తెలిపారు. ఆయనతో కలిసి వున్న ఫోటోను ఎక్స్‌లో పంచుకున్నారు. అచ్యుతానందన్ మృతి వార్త వినగానే తామిద్దరం ముఖ్యమంత్రులుగా వున్నపుడు ఆయనను కలుసుకున్న క్షణాలు, మాట్లాడిన సందర్భాలు అన్నీ గుర్తుకు వచ్చాయని ప్రధాని పేర్కొన్నారు. తన జీవితాన్ని ప్రజల సేవలోనే తరింపచేశారన్నారు.

ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్ రాజీనామా

అనారోగ్యంతో తప్పకుంటున్నానని ప్రకటన



న్యూఢిల్లీ : ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ సోమవారం తన పదవికి రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖను రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు అందజేశారు. అనారోగ్య కారణాలతో రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 67 (ఎ) ప్రకారం తక్షణమే అమల్లోకి వచ్చేలా భారత ఉపరాష్ట్రపతి పదవికి తాను రాజీనామా చేస్తున్నట్లు సోషల్ మీడియాలో చేసిన ఒక పోస్టులో ఆయన పేర్కొన్నారు. తన పదవీకాలంలో పూర్తి మద్దతు ఇచ్చినందుకు రాష్ట్రపతికి, ప్రధానమంత్రికి, మంత్రి మండలికి కృతజ్ఞతలు తెలిపారు. తన పదవీ కాలంలో చాలా నేర్చుకున్నట్లు చెప్పారు. పార్లమెంట్ వర్షకాల సమావేశాల ప్రారంభం రోజునే ధన్‌ఖడ్ తన పదవికి రాజీనామా చేయడం గమనార్హం. ఉపరాష్ట్రపతి రాజ్యసభ చైర్మన్‌గానూ బాధ్యతలు నిర్వహిస్తారనే విషయం తెలిసిందే. 2022 ఆగస్టు 11న భారత ఉపరాష్ట్రపతిగా ధన్‌ఖడ్ ప్రమాణస్వీకారం చేశారు. అంతకుముందు ఆగస్టు 6న జరిగిన ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ప్రతిపక్షాల ఉమ్మడి అభ్యర్థి మార్గరెట్ అల్వాపై 528 ఓట్ల తేడాతో గెలిచిన ధన్‌ఖడ్ ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఉపరాష్ట్రపతి పదవికి ముందు పశ్చిమ బెంగాల్ గవర్నర్‌గా ధన్‌ఖడ్ బాధ్యతలు నిర్వహించారు. ఆ సమయంలో అక్కడి రాష్ట్ర ప్రభుత్వంతో తరచూ వివాదాలను కొనసాగించేవారు. రాజస్థాన్ హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో సుదీర్ఘ న్యాయవాద వృత్తిని కొనసాగించిన ధన్‌ఖడ్ 2008లో బిజెపిలో చేరారు. 1969లో ఉపరాష్ట్రపతిగా ఉన్న వివి గిరి తన పదవికి రాజీనామా చేశారు. అప్పట్లో రాష్ట్రపతి జకీర్‌హుస్సేన్ మరణించడంతో వివి గిరి ఆ బాధ్యతలు స్వీకరించాల్సివచ్చింది. 2002లో కృష్ణకాంత్ ఉపరాష్ట్రపతిగా ఉంటూ మృతి చెందారు. మిగిలిన ఉపరాష్ట్రపతులందరూ పూర్తికాలం పదవీ బాధ్యతల్లో కొనసాగారు.

కేరళ చరిత్ర నుండి వేరు చేసి చూడలేం : పినరయి విజయన్ ఘన నివాళి

పోరాటాల వారసత్వానికి అచ్యుతానందన్ ఒక అద్భుతమైన చిహ్నమని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ పేర్కొన్నారు. కేరళ చరిత్రలో ఆయన జీవితం ఒక ముఖ్యమైన అధ్యాయమని అభివర్ణించారు. అచ్యుతానందన్ అసాధారణమైన పట్టుదల కలవారని, తన రాజకీయ వైఖరిలో ఎన్నడూ రాజీ పడలేదని చెప్పారు. 'శతాబ్ద కాలపు జీవితంలో ఆయన ప్రజల పక్షానే నిలిచారు. వారి సమస్యలపై గళం విప్పారు. కేరళ ఆధునిక చరిత్రలో ఆయనది విడదీయరాని భాగం' అని కొనియాడారు.

కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటు : సిపిఎం పొలిట్ బ్యూరో

విఎస్ నేరుగా ప్రజలతో మాట్లాడడంలో దిట్ట. నిరాడంబరమైన జీవనశైలికి, సామాజిక న్యాయం పట్ల అచంచలమైన నిబద్ధతకు పేరొందిన విఎస్ కేరళ రాజకీయాల్లో తనదైన చెరగని ముద్ర వేశారు. ఆయన మృతి, పార్టీకి, కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటు." అని సిపిఎం పొలిట్‌బ్యూరో పేర్కొంది. విఎస్ అచ్యుతానందన్ మృతికి సంతాపసూచకంగా పొలిట్‌బ్యూరో అరుణ పతాకాన్ని అవనతం చేసింది. విఎస్ భార్య, కుమారుడు, కుమార్తెలకు సానుభూతిని తెలియజేసింది.

4 రోజులపాటు భారీ వర్షాలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా మరో నాలుగు రోజులపాటు పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది. ఈ మేరకు ఆ సంస్థ ఎమ్‌డి ప్రఖర్‌జైన్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 22న అల్లూరి సీతారామరాజు, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్‌టిఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో కొన్నిచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. మిగతా జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. ఈ నెల 23న అల్లూరి సీతారామరాజు, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్‌టిఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో కొన్నిచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. 24న అల్లూరి సీతారామ రాజు, విశాఖపట్నం, అనకాపల్లి, అంబేద్కర్ కోనసీమ, కాకినాడ, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల్లో కొన్నిచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. 25న శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ జిల్లాల్లో కొన్నిచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. రిజర్వాయర్లలోకి వర్షపు నీరు భారీగా చేరుతోందని, లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రఖర్‌జైన్ సూచించారు.

ప్రతిపక్షాల నిరసనలతో

అట్టుడికిన పార్లమెంటు

- నేటికి వాయిదా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పార్లమెంటు వర్షాకాల సమావేశాలు తొలిరోజే వాడివేడిగా జరిగాయి. ఇటు అధికార పక్షం, అటు ప్రతిపక్షాల ప్రతినిధులు పరస్పర నినాదాలతో హోరెత్తించారు. 'ఆపరేషన్ సిందూర్', ఎయిరిండియా విమాన ప్రమాదంపై ప్రతిపక్ష ఎంపిలు ప్రధాని నరేంద్ర మోడీ స్పందించాలని పట్టుబట్టారు. సోమవారం లోక్‌సభ మొదలైన కాసేపటికే ఆపరేషన్ సిందూర్‌పై అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యలపై ప్రధాని నరేంద్ర మోడీ సమాధానం చెప్పాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. భారత్, పాక్‌ల మధ్య కాల్పులను తాను ఆపాను అంటూ ట్రంప్ ప్రగల్భాలు పలకడంపై మోడీ సభా వేదికగా వివరించాలని ప్రతిపక్ష ఎంపిలు పట్టుబట్టారు. స్పీకరు ఓం బిర్లా తరువాత చర్చల్లో అందుకు అనుమతిస్తానంటూ చెప్పారు. కాంగ్రెస్, డిఎంకె, టిఎంసి, ఎస్‌పి, సిపిఎం, సిపిఐ, ఎన్‌సిపి తదితర ఇండియా బ్లాక్ పార్టీల ఎంపిలు ప్రధాని మాట్లాడాల్సిందేనని పట్టుబట్టారు. సభ మొదలైన కాసేపటికే మధ్యాహ్నం 2 గంటల వరకూ వాయిదా పడింది. తిరిగి ప్రారంభమైన సభలో కూడా ప్రతిపక్షాలు పట్టువీడకపోవడంతో సభ సాయంత్రం 4 గంటలకు వాయిదా పడింది. తరువాత ప్రారంభమైన సభలో అదే పరిస్థితి కొనసాగడంతో మంగళవారానికి సభ వాయిదా పడింది. ప్రతిపక్ష సభ్యుల ఆందోళన మధ్య రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ.. ఏ అంశంపై అయినా చర్చించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కిరణ్ రిజిజు మాట్లాడుతూ మధ్యాహ్నం 2:30 గంటలకు బిజినెస్ అడ్వయిజరీ కమిటీ సమావేశం ఉందని, ప్రభుత్వం చర్చించడానికి సిద్ధంగా మిగతా 7లో



రోడ్డు ప్రమాదంలో నలుగురు దుర్మరణం

ప్రజాశక్తి - వినుకొండ (పల్నాడు జిల్లా)

ఘర్షణలో గాయపడిన వారిని వాహనంలో ఆస్పత్రికి తరలిస్తుండగా మరో వాహనం వచ్చి ఢీ కొట్టడంతో నలుగురు మరణించారు. ఈ సంఘటన పల్నాడు జిల్లా శావల్యాపురం మండలంలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు...కారుమంచి గ్రామానికి చెందిన బత్తుల శ్రీను, వెంకట్రావు సోదరులు. ఆస్తి విషయమై వీరి మధ్య గొడవ జరిగింది. ఘర్షణలో శ్రీను, అతని భార్యకు గాయలయ్యాయి. దీంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు శావల్యాపురం స్టేషన్‌కు వెళ్లారు. ముందు ఆస్పత్రికి వెళ్లి వైద్యం చేయించుకోవాలని పోలీసులు సూచించారు. తమ బంధువులను వెంటబెట్టుకుని ఆటోలో వినుకొండ ప్రభుత్వాస్పత్రికి బయలుదేరారు.


కనుమల్లపూడి వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న వాహనం ఆటోను ఢీ కొట్టింది. బత్తుల బ్రహ్మయ్య (33), నాగఅంజమ్మ (40), బత్తుల రమణమ్మ (60) అక్కడికక్కడే మరణించారు. యశోదరావు, ముత్యాలమ్మ (42) రాంబాబు గాయపడ్డారు. వినుకొండ ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ ముత్యాలమ్మ మరణించారు. మిగతా ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండటంతో గుంటూరుకు తరలించారు. ప్రమాదానికి కారణమైన వాహన డ్రైవర్, క్లీనర్ పరారయ్యారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ధర్మస్థల దారుణాలపై 'సిట్'

బెంగళూరు : దేశవ్యాప్తంగా సంచలనం రేపుతున్న ధర్మస్థల మహిళల హత్యల కేసుపై ఎట్టకేలకు కర్ణాటక ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే స్థానిక పోలీసులతో ప్రాథమిక విచారణకు ఆదేశించిన ప్రభుత్వం ప్రజా సంఘాలు, బాధితుల డిమాండ్ల మేరకు ప్రత్యేక విచారణ బృందాన్ని (ఎస్‌ఐటి)ని నియమించింది. ప్రాథమిక విచారణ కొనసాగుతున్న వేళ సిట్ అవసరం ఏముందని హోంమంత్రి డా.జి.పరమేశ్వర్ శనివారం వ్యాఖ్యానించిన 24 గంటల్లోపే సిట్ ఏర్పాటుచేస్తూ ఆదేశాలు జారీ చేయటం గమనార్హం. ఈ దురాగతాల నిగ్గు తేల్చేందుకు ఏర్పాటైన సిట్‌కు డిజిపి (అంతర్గత భద్రతా విభాగం) ప్రణవ్ మహంతి అధ్యక్షత వహిస్తుండగా డిఐజి (నియామకాలు) ఎం.ఎన్.అనుచేత్, నగర రిజర్వ్ పోలీసు డిసిపి సౌమ్యలత, అంతర్గత భద్రత విభాగం ఎస్పీ జీతేంద్ర కుమార్ దయామ ఇతర సభ్యులుగా వ్యవహరిస్తారు. 20 ఏళ్ల నుంచి ధర్మస్థల దేవాలయ పరిసర ప్రాంతాల్లో కొంత మంది మహిళలు ఉన్నపళంగా కనిపించకపోవటం, వారిలో అత్యధికులు విద్యార్థినులుండటం, పోలీసుల రికార్డుల్లో వీరి ఆచూకీ కోసం ఫిర్యాదులు నమోదయ్యాయి.

మహిళలకు 'జీరో టికెట్'

- ఆగస్టు 15 నుండి ఇవ్వండి
- రాయితీ వివరాలను ముద్రించండి
- ఆర్‌టిసి ఉచిత బస్సు పథకంపై సమీక్షలో సిఎం ఆదేశం



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆగస్టు 15 నుండి మహిళలకు 'జీరో ఫేర్ టికెట్' ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం పై సోమవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎక్కడి నుండి ఎక్కడకు ప్రయాణం చేస్తున్నారు? ఉచిత ప్రయాణంతో మహిళలకు ఎంత మేర ఆదా అయ్యింది? రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న రాయితీకి సంబంధించిన పూర్తి వివరాలను టికెట్‌పై ముద్రించాలని చెప్పారు. ఈ పథకం అమలు కారణంగా వివిధ రాష్ట్ర ప్రభుత్వాలపై పడిన భారం, రాష్ట్రంలో అయ్యే ఖర్చు తదితర అంశాలను చర్చించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఆగస్టు 15 నుంచి ఈ పథకాన్ని అమలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని, దానిని దృష్టిలో ఉంచుకుని పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. ఉచిత బస్సు ప్రయాణ పథకానికి సంబంధించి సాఫ్ట్‌వేర్‌ను సిద్ధం చేయాలని చెప్పారు. ఈపథకం అమలు కారణంగా ఆర్‌టిసికి భారం కాకుండా ఇతర ఆదాయ మార్గాలను పెంపొం దించుకోవాలని, నిర్వహణ వ్యయాన్ని తగ్గించు కోవాలని చెప్పారు. లాభాల ఆర్జనకు ఎలాంటి మార్గాలున్నాయి? ఎటువంటి విధానాలు తీసుకు రావాలి?అనే అంశంపై ఒక కార్యాచరణ రూపొందించాలన్నారు.

ఇక నుండి ఎసి ఎలక్ట్రానిక్ బస్సులే ..

ఇకపై ఎసి ఎలక్ట్రానిక్ బస్సులు మాత్రమే కొనుగోలు చేయాలని అధికారులకు సిఎం నిర్దేశించారు. ప్రస్తుతం ఉన్న వాటిని ఎలక్ట్రికల్ బస్సులు గా మారిస్తే నిర్వహణా వ్యయం తగ్గుతుందని అందుకు అవసరమయ్యే విద్యుత్తును సొంతంగా ఉత్పత్తి చేసుకోవాలని సిఎం సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ఆర్‌టిసి డిపోల్లోనూ చార్జింగ్‌స్టేషన్లు ఏర్పాటు చేసే అంశంపై అధ్యయనం చేయాలని చెప్పారు.

పారదర్శకతకు సెబీ పాతర

- జెన్ స్ట్రీట్‌పై నిషేధం ఎత్తివేత
- వేల కోట్లు కొల్లగొట్టిన అమెరికా సంస్థకు మళ్లీ అనుమతులు

ముంబయి : దేశీయ స్టాక్ మార్కెట్‌లో అక్రమ పద్ధతుల ద్వారా వేల కోట్ల రూపాయలు కొల్లగొట్టిన అమెరికా హెడ్జ్ ఫండ్ జెన్ స్ట్రీట్‌పై విధించిన నిషేధాన్ని సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజీ బోర్డు (సెబీ) ఎత్తివేసింది. తాము విధించిన రూ.4,800 కోట్ల జరిమానాను ఆ సంస్థ ఎస్క్రో ఖాతాలో డిపాజిట్ చేసిన నేపథ్యంలో స్టాక్ మార్కెట్‌లోకి మళ్లీ ప్రవేశిం చేందుకు అనుమతిచ్చినట్లు సెబీ సంబంధిత వర్గాలు వెల్లడించాయి. దీంతో మార్కెట్ రెగ్యూలేటర్ సెబీ పారదర్శకతపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. హైఫ్రీక్వెన్సీ ట్రేడింగ్ ద్వారా నిఫ్టీ, బ్యాంక్ నిఫ్టీ ఇండెక్స్‌ల్లో తప్పుడు పద్ధతుల్లో రూ.43,289 కోట్ల అక్రమ లాభాలు ఆర్జించినట్లు సెబీ గుర్తించింది. ఈ నేపథ్యంలోనే జులై తొలివారంలో జెన్ స్ట్రీట్‌పై నిషేధం విధించింది. ఈ అక్రమార్జనపై విచారణ పూర్తి కాకుండానే, రిటైల్ ఇన్వెస్టర్లను నిండా ముంచిన ఆ సంస్థపై ఆంక్షలు ఎత్తివేయడం ఆందోళకరం. జులై 13న రూ.4,800 కోట్లు ఎస్క్రో ఖాతాలో జమ చేయడంతో జెన్ స్ట్రీట్‌పై సెబీ నిషేధాన్ని ఎత్తివేశాయని.. అయితే.. ఆప్షన్స్ ట్రేడింగ్‌పై నిషేధం కొనసాగుతోందని సెబీ వర్గాలు పేర్కొన్నాయి.

మన పిల్లలను

నేలపై పడుకోబెడతామా?

- హాస్టళ్ల దుస్థితిపై సిఎస్‌కు హైకోర్టు ప్రశ్న
- తక్షణమే వసతులు కల్పించాలని ఆదేశం

ప్రజాశక్తి-అమరావతి

సాంఘిక సంక్షేమ, బిసి, గురుకుల హాస్టల్స్‌లో వసతుల లేమిపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. హాస్టల్స్‌లో పరిస్థితులు చక్కదిద్దలేదంటూ అధికారులను నిలదీసింది. ఏమీ తెలియనట్లు ఎలా మిన్నకుండిపోతున్నారని ప్రశ్నించింది. ఏటా ప్రభుత్వం చేసే కోట్లాది రూపాయల ఖర్చులు ఎక్కడికి వెళుతున్నాయనే సందేహాన్ని వ్యక్తం చేసింది. కాంట్రాక్టర్ల లబ్ధి కోసమే పనులు జరుగుతున్నాయా? అని నిలదీసింది. మన ఇంట్లో పిల్లలను నేలపై పడుకోబెడతామా? అని నిప్పులు చెరిగింది. జిల్లా స్థాయిలో అధికారులు విధిగా హాస్టల్స్ సందర్శిం చాలని ఆదేశించింది. నేషనల్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ (ఎన్‌సిపిసిఆర్) గైడ్‌లైన్స్ ప్రకారం అన్ని మౌలిక వసతులను ప్రభుత్వమే కల్పించాలన్న నిబంధనలను గుర్తు చేసింది. తాగునీరు, పౌష్టికాహారం, బెడ్లు, బెడ్ షీట్లు, యోగ్యమైన మరుగుదొడ్లు, బాత్ రూమ్స్ ఉండి తీరాలని తేల్చి చెప్పింది. వసతుల కల్పన అంశంపై నిర్లక్ష్యం వహిస్తే, సాంఘిక, బిసి, గురుకుల సంక్షేమశాఖల ముఖ్యకార్యదర్శులను బాధ్యులను చేస్తామని హెచ్చరించింది. మీరే కనుక (సిఎస్) దృష్టి పెట్టి ఉంటే ఈ విధంగా ఉండవని వ్యాఖ్యానించింది. హాస్టల్స్ పరిస్థితులు మార్చాలన్న సంకల్పంతోనే స్వయంగా కోర్టుకు పిలిచామని చెప్పింది. ఇప్పటికైనా ఆ గైడ్‌లైన్స్ ప్రకారం చర్యలు తీసుకోవాలని సిఎస్‌ను ఆదేశించింది. జిల్లా స్థాయిలో సీనియర్ అధికారులు క్రమం తప్పకుండా హాస్టళ్లను తనిఖీ చేయాలంది. ఇకపై నెలవారీ నివేదికలను అందజేసేలా చర్యలు తీసుకోవాలని సిఎస్‌ను ఆదేశించింది. ఈ మేరకు చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన డివిజన్ బెంచ్ సోమవారం ఆదేశించింది. రాష్ట్రంలోని హాస్టళ్లలో నేషనల్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ మార్గదర్శకాల మేరకు వసతుల కల్పన లేవంటూ కాకినాడకు చెందిన కీతినీడి అఖిల్ శ్రీగురు తేజ వేసిన పిల్‌పై విచారణను 4 వారాలకు వాయిదా వేసింది. గతంలో న్యాయ సేవాధికార సంస్థ జిల్లా అధికారులతో హాస్టల్స్‌లోని పరిస్థితులపై నివేదిక తెప్పించుకున్న హైకోర్టు వాటిని పరిశీలించి విస్తుపోయింది. సంక్షేమ హాస్టళ్లలో దుస్థితి వర్ణణాతీతమని వ్యాఖ్యానించింది. ఈ పరిస్థితుల్లో మార్పులు చేసేందుకు మిగతా 7లో



నెల్లూరులో కార్మికులను అడ్డుకుంటున్న పోలీసులు



విజయవాడలోని ధర్నాచౌక్ వద్ద కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

కంటితుడుపు చర్యలు మానుకోండి

- జిఓ 36 ప్రకారం వేతనాలు చెల్లించాలి
- కొనసాగిన మున్సిపల్ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి - యంత్రాంగం

నాన్ పిహెచ్ వర్కర్ల రెమ్యునరేషన్ పెంచుతూ పట్టణాభివృద్ధిశాఖ జారీ చేసిన జిఓ కంటితుడుపు చర్య అని, జిఓ 36 ప్రకారం వేతనాలు చెల్లించాలని మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు తేల్చి చెప్పారు. సంక్షేమ పథకాలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్, ఎక్స్‌గ్రేషియా కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె సోమవారమూ కొనసాగింది. మున్సిపల్ కార్యాలయాల ఎదుట అర్ధనగ్న ప్రదర్శన, కళ్లకు గంతలు, మోకాళ్లపై నిల్చుని నిరసన తెలిపారు. వీరికి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం సంఘీభావం తెలిపాయి.

విజయవాడలో కార్మికుల సమ్మెకు ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ఉమామహేశ్వరరావు సంఘీభావం తెలిపి మాట్లాడారు. సుమారు నెల రోజుల నుంచి రాష్ట్ర వ్యాప్తంగా వేలాది మంది కార్మికులు రోడ్లపైకి వచ్చి వివిధ రూపాల్లో ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోవడం దారుణమన్నారు. పెరిగిన ధరలకనుగుణంగా జిఓ నంబర్ 36 ప్రకారం వేతనాలు రూ. 21,000, రూ. 24,500 పెంచాల్సి ఉండగా కంటితుడుపు చర్యగా రూ. మూడు వేల చొప్పున పెంచుతున్నట్లు ప్రకటనలు చేయడం,యూనియన్ నేతలతో కనీసం చర్చించకుండా ఒంటెద్దుపోకడలతో ప్రభుత్వ ప్రకటనలు చేయడం సరికాదన్నారు. కంటితుడుపు చర్యల వల్ల ఒరిగిందేమీ లేదని, ఉద్యమాన్ని కొనసాగించాలని కార్మికులతో పాటు యూనియన్ నేతలు చెబుతున్నారని తెలిపారు.

ఏలూరు జిల్లా నూజివీడులో మున్సిపల్ కార్యాలయం వద్ద మోకాళ్లపై నిల్చుని నిరసన తెలిపారు. చింతలపూడిలో కార్మికుల సమ్మెకు అంగన్‌వాడీలు, వ్యవసాయ కార్మికులు సంఘీభావం తెలిపాయి. చింతలపూడి మున్సిపల్ కార్యాలయం ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. అనంతరం కమిషనర్ ఎ.రాంబాబుకు వినతిపత్రం అందించారు. పశ్చిమగోదావరి జిల్లా తణుకు మున్సిపల్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. తిరుపతి జిల్లా గూడూరు, సూళ్లూరుపేట, నాయుడుపేటలో మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమ్మెకు అంగన్‌వాడీలు సంఘీభావం ప్రకటించారు. నాయుడుపేటలో మున్సిపల్ కార్మికులు అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. శ్రీకాకుళం నగర కార్పొరేషన్, ఆముదాలవలస, కాశీబుగ్గ మున్సిపల్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఇచ్ఛాపురం మున్సిపల్ కార్యాలయం వద్ద అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. అనంతపురం, రాయదుర్గంలో భిక్షాటన చేశారు. శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం, హిందూపురం, పుట్టపర్తి ప్రాంతాల్లో నిరసన ప్రదర్శనలు చేశారు. ఒంగోలు మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు.

నెల్లూరులో కార్మికులకు, పోలీసులకు మధ్య తోపులాట

నెల్లూరులో గాంధీ బొమ్మ సెంటర్ నుంచి కలెక్టరేట్ వరకు మున్సిపల్ కార్మికులు నిరసన ర్యాలీ నిర్వహించారు. అక్కడే ధర్నా చేశారు. కలెక్టర్ వచ్చి తమ వినతిపత్రాన్ని స్వీకరించి, సమస్యలు పరిష్కరించాలని కార్మికులు డిమాండ్ చేశారు. అధికారులు నుంచి ఏ సమాధానమూ రాకపోవడంతో కలెక్టర్‌ను కలిసేందుకు లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. కార్యాలయం గేట్లు మూసివేసి కార్మికులను లోపలికి రానివ్వకుండా అడ్డుకున్నారు. దీంతో, తోపులాట చోటు చేసుకుంది. ఈ క్రమంలో ఇద్దరు మహిళా కార్మికులు అస్వస్థతకు లోనయ్యారు.

పలువురికి గాయాలయ్యాయి. తోటి కార్మికులు వీరిని ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో కలెక్టర్ వద్దకు మున్సిపల్ కార్మికులను, యూనియన్ నాయకులను పోలీసులు తీసుకువెళ్లారు. నాయకులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం మోహన్‌రావు మాట్లాడుతూ...పారిశుధ్య పనులను కాంట్రాక్టర్లకు అప్పగించేందుకు ఆహ్వానించిన టెండర్లను రద్దు చేయాలని, ఈ వ్యవహారంపై తక్షణమే ప్రభుత్వం స్పందించాలని, లేనిపక్షంలో సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. 60 సంవత్సరాలు నిండిన వారికి రిటైర్మెంట్ బెనిఫిట్స్ లేకుండా వారిని నిలిపివేయడం తగదన్నారు. జిఓ నంబర్ 36 ప్రకారం ఇంజనీరింగ్ కార్మికుల జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు.

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల వేతనాలు పెంపు

- ఫెడరేషన్ అసంతృప్తి
- నేడు సమ్మె కొనసాగింపు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న నాన్ పిహెచ్ వర్కర్ల (ఇంజినీరింగ్ కార్మికుల) వేతనాలు పెంచుతూ పట్టణాభివృద్ధిశాఖ సోమవారం ఆదేశాలు జారీచేసింది. మున్సిపాలిటీల్లో ఇంజినీరింగ్ కార్మికులు సమ్మె నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది. సమ్మెకు దిగిన యూనియన్ నాయకులు కొన్ని డిమాండ్లు సమర్పించారని, వాటిల్లో వేతనాల పెంపు ఉందని, దీనిపై నియమించిన మంత్రివర్గ ఉపసంఘం చేసిన సూచనల మేరకు నిర్ణయం తీసుకున్నట్లు వివరించింది. కొత్తగా పెంచిన వేతనాల ప్రకారం కేటగిరి-1 సిబ్బందికి ఇప్పటి వరకూ రూ.21,500 ఇస్తుండగా దాన్ని రూ.24,500కు పెంచారు. కేటగిరి-2 సిబ్బంది వేతనాలను రూ.18,500 నుండి రూ.21,500కు, కేటగిరి-3 కార్మికులకు రూ.15,000 నుండి రూ.18,500కు పెంచారు. అయితే, ఈ వేతనాలు ఎప్పుడు నుండి అమలు చేస్తారు అనే అంశాన్ని జిఓలో పేర్కొనలేదు. మరోవైపు ఈ పెంపుదల కార్మికులను సంతృప్తి పరిచేదిగా లేదని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్(సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు తెలిపారు. ఇదే విషయాన్ని తెలియచేస్తూ పురపాలక శాఖ మంత్రి నారాయణకు ఆయన లేఖ రాశారు. ఇంజినీరింగ్ కార్మికుల విజ్ఞప్తి మేరకు పెంపుదల లేదని,కేటగిరీల నిర్ణయంలో జరిగిన పొరపాటును సరిదిద్దలేదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికులకు గతంలో ఇచ్చిన హామీలు రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.75 వేలు, ఎక్స్‌గ్రేషియా రూ.5 లక్షల నుండి రూ.7 లక్షలకు పెంపు, దహన ఖర్చులు రూ.15 వేల నుండి రూ.20 వేలకు పెంపు వంటి వాటిపై దాటవేత ధోరణి అవలంభించిందని విమర్శించారు. దీనిపై తాము తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో కార్మికుల అభిప్రాయాలు తీసుకుని భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకోవడం కోసం మంగళవారం నాడు కూడా సమ్మె కొనసాగిస్తున్నట్లు ఉమామహేశ్వరరావు తెలిపారు. గత కాలపు సమ్మె ఒప్పందాలు, సంక్షేమ పథకాల అమలు విషయంలో ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోతే కార్మికుల సంసిద్ధతను బట్టి పోరాటాన్ని నిర్వహిస్తామని వివరించారు. అలాగే జీతాల పెంపులో ప్రభుత్వం స్పందన కార్మికుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని 12వ పిఆర్సి జీతాలు, కరువు భత్యం, మధ్యంతర భృతి అమలు చేయాలని డిమాండు చేశారు.

బిజెపి ఒత్తిడికి లొంగి సామాన్య కార్మికులు, ఉద్యోగుల పొట్టకొట్టొద్దు

- టిటిడిలో ఉద్యోగుల సస్పెన్షన్‌పై సిపిఎం విజ్ఞప్తి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

తిరుమల తిరుపతి దేవస్థానం యాజమాన్యంలో నిర్వహిస్తున్న విద్యాలయాలు, ఆసుపత్రులు తదితర లౌకిక సంస్థల్లో పనిచేస్తున్న హిందూయేతరులను తొలగించడం రాజ్యాంగ విరుద్ధమని, వారికి రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2025 జనవరి 24న రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మెమో (ఎండోమెంట్స్)కు ఈ చర్య భిన్నంగా ఉందని ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. హిందూ దేవాలయాల నిర్వహణ, ఆ దేవాలయాల సౌజన్యంతో నడిచే విద్య వైద్యం వంటి సంస్థల నిర్వహణ వేర్వేరుగా చూడాలని విజ్ఞప్తి చేశారు. దేవాలయాల్లో అర్చకులు తదితర ఆధ్యాత్మిక స్థానాల్లో తప్ప వాటి ఆధ్వర్యంలో నడిచే సంస్థల్లో ప్రభుత్వ సాధారణ నిబంధనల కనుగుణంగా ఉద్యోగులను తీసుకోవాలని కోరారు. విద్యా వైద్య తదితర లౌకిక సంస్థల్లో పనిచేసే ఉద్యోగులను మత ప్రాతిపదికన తొలగించకూడదని, యజమాని కులం, మతాన్ని బట్టి ఉద్యోగులు ఉండాలనడం సరైనది కాదని పేర్కొన్నారు. అది రాజ్యాంగ విరుద్ధమని, చట్టవ్యతిరేకమని తెలిపారు. దీర్ఘకాలంగా పనిచేస్తున్న వారిని హఠాత్తుగా తొలగించడం అమానవీయమన్నారు. వారు ఉద్యోగంలో చేరిన సమయంలో ఇలాంటి నిబంధనలు లేవని, కోర్టు కూడా ఇలాంటి వారిని తొలగించడానికి వ్యతిరేకంగా గతంలో తీర్పులు, స్టేలు ఇచ్చిందని వివరించారు. వాటిని పక్కన పెట్టి ఇప్పుడు మరలా కొత్త వివాదాలకు తావు ఇవ్వడం సమాజంలో అశాంతిని సృష్టిస్తుందని, మతవిద్వేషాలు రగిలించి అశాంతిని సృష్టించడం ఆర్‌ఎస్‌ఎస్ లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. వారి ఒత్తిడికి లొంగకుండా రాష్ట్ర ప్రభుత్వం తక్షణం సస్పెన్షన్ తొలగించి వారికి ఉద్యోగ భద్రత కల్పించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలని కోరారు. మతం పేరుతో రాజకీయాలు చేస్తున్న బిజెపి అదే మతంలో ఉన్న దళితులు, మహిళలు, బలహీనవర్గాల వారు, ఆదివాసీల పట్ల వివక్షతకు వ్యతిరేకంగా ముందుకు రావడం లేదని వివరించారు. మనుధర్మం పేరుతో కుల వ్యవస్థకు గౌరవాన్ని ఆపాదించి బలపరుస్తోందని, దేవాలయాల్లో కులాలకు అతీతంగా పురోహితులను నియమించడం లేదని, అనేక దేవాలయాల్లో, ఆధ్యాత్మిక కార్యకలాపాల్లో కులవివక్షత అమలవుతోందని పేర్కొన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ బిజెపిలు నిజంగా హిందూమత విశ్వాసకులైతే కుల, లింగవివక్షతకు వ్యతిరేకంగా పోరాడి అన్ని కులాలకు దేవాలయాల్లో సమాన అవకాశాలు కల్పించాలని, అన్ని కులాల వారికి మహిళలకు దేవాలయాల్లో సమానంగా ప్రవేశ అర్హత కల్పించాలని పేర్కొన్నారు. కానీ కులవ్యవస్థను కొనసాగిస్తూ అస్పృశ్యతను, అంటరానితనాన్ని పాటిస్తూ మరోవైపు మత విద్వేషాలు పెంచేందుకు టిటిడిని వాడుకోవడం దుర్మార్గమని శ్రీనివాసరావు తెలిపారు. బిజెపికి లొంగి రాష్ట్ర ప్రభుత్వం తప్పుడు నిర్ణయాలు చేయడాన్ని ఖండించారు.

పలు జిల్లాల్లో భారీ వర్షాలు

- ఊపందుకున్న వరి నాట్లు

ప్రజాశక్తి - యంత్రాంగం

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు పడుతున్నాయి. దీంతో పంట సాగు పనులు ఊపందుకున్నాయి. పశ్చిమగోదావరి జిల్లా ఆచంటలో ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షంతో ఎట్టకేలకు సార్వా సాగుకు రైతులు శ్రీకారం చుట్టారు. మొగల్తూరు మండలంలో చిరుజల్లులు కురుస్తున్నాయి. పెనుమంట్రలో ఆదివారం అర్ధరాత్రి జోరుగా, సోమవారం ఉదయం నుండి చిరుజల్లులు పడ్డాయి. వాతావరణం చల్లబడడంతో జనం ఉపశమనం పొందారు.

ఏలూరు జిల్లాలోనూ విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. నగరంలోని పలు వీధులు జలమయమయ్యాయి. అమీనాపేట, అశోక్‌నగర్, ఆర్ఆర్‌పేట, పవర్‌పేట, పత్తేబాద్ ప్రాంతాల్లో రోడ్లపై నీరు నిలిచింది. ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షం వరి చేలకు జీవం పోసింది. 20 రోజులుగా వర్షాలు పడకపోవడంతో నాట్లు వేసిన పొలాలు, వెదజల్లిన చేలు, నారుమళ్లు ఎండిపోయాయి. చాలా గ్రామాల్లో రైతులు ఎండిపోతున్న పైరును కాపాడుకునేందుకు నానాపాట్లు పడ్డారు. ఈ పరిస్థితుల్లో ఆది, సోమవారాల్లో కురిసిన వర్షంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గుంటూరు, పల్నాడు జిల్లాల్లో గత మూడ్రోజుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. సోమవారం పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిశాయి. మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు పల్నాడు జిల్లా సత్తెనపల్లి, గుంటూరు జిల్లా ప్రత్తిపాడులో భారీ వర్షం కురిసింది. గుంటూరులో సగటున 110 మిల్లీ మీటర్లు, పల్నాడులో 80 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదు అయింది. వర్షాల వల్ల లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. గుంటూరు జిల్లాలో కొండవీటి వాగు, పాల వాగు, కోటెళ్ల వాగుకు భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో పొలాల్లోకి నీరు చేరడం, రహదారులు, చప్టాలపై నీరు వచ్చి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉమ్మడి విశాఖలో పలుచోట్ల వర్షం పడింది. విశాఖ నగరంలోని గాజువాక, కూర్మన్నపాలెం ప్రాంతంలో ఏకధాటిగా రెండు గంటలపాటు కురిసిన వర్షానికి డ్రెయినేజీల్లోని మురుగునీరు రోడ్లపైకి చేరింది. అనకాపల్లి జిల్లాలోని కె కోటపాడు, దేవరాపల్లి మండలాల్లో జోరు వాన కురిసింది.

పిఆర్‌సి కమిటీని వెంటనే నియమించాలి

- పెండింగ్ డిఎలు మంజూరు చేయాలి
- సిఎస్‌కు ఎపిజెఎసి వినతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఉద్యోగులకు సంబంధించి పిఆర్‌సి కమిటీని వెంటనే నియమించాలని, తక్షణమే వేతన సవరణ కమిషనరును నియమించి వేతన సవరణ ప్రక్రియను ప్రారంభించాలని ఎపిజెఎసి నేతలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఎపిజెఎసి ఛైర్మన్ విద్యాసాగర్, సెక్రటరీ జనరల్, యుటిఎఫ్ నేత కెఎస్‌ఎస్ ప్రసాద్ నేతృత్వంలోని పలు ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్స్, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ఫెడరేషన్, ఆర్‌టిసి ఎన్‌ఎంయు నేతలు సోమవారం సిఎస్ విజయానంద్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులకు సంబంధించి మూడు డిఎలు పెండింగ్‌లో ఉన్నాయని, కనీసం రెండు డిఎ లైనా తక్షణమే మంజూరు చేయాలని కోరారు. ఉద్యోగుల సరెండర్ లీవు బకాయిలపై ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. 2019-24 మధ్య వివిధ ఆందోళనల్లో నమోదైన పెండింగ్ కేసులన్నీ ఎత్తి వేయాలని, ఇంటీరియల్ రిలీఫ్ చెల్లించాలని, ఉద్యోగుల సివిల్ సర్వీసెస్ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ మీటింగ్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. ఉద్యోగుల హెల్త్‌కార్డుల విషయంలో ఇహెచ్‌ఎస్ మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారని, ఇహెచ్‌ఎస్ స్టీరింగ్ కమిటీ మీటింగ్‌ను కూడా ఏర్పాటు చేయాలని అన్నారు.

కరేడులో సిపిఎం నేతలు అరెస్ట్

ప్రజాశక్తి-కందుకూరు

కరేడు ఉద్యమంలో చురుగ్గా పాల్గొంటున్న సిపిఎం నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సోమవారం రామకృష్ణాపురం గ్రామానికి వెళ్లారు. ఈ సమయంలో ఆ గ్రామానికి వెళ్తున్న సిఐటియు జిల్లా కార్యదర్శి జి. వెంకటేశ్వర్లు, సిపిఎం ఉలవపాడు మండల కార్యదర్శి జివిబి కుమార్, సిపిఎం కందుకూరు పట్టణ కార్యదర్శి ఎస్‌ఎ గౌస్‌ను పోలీసులు అడ్డుకున్నారు. తాము గ్రామానికి వెళ్తున్నామని చెప్పగా... మీ పై కేసులున్నాయని, అందుకు అరెస్ట్ చేస్తున్నామని పోలీసులు చెప్పారు. వారందరిని ఉలవపాడు పోలీసు స్టేషన్‌కు తరలించారు. గత నెల 29న జాతీయ రహదారి దిగ్బంధనం చేసిన కేసులో అరెస్టు చేస్తున్నట్లు పోలీసులు చెబుతుండగా....ఉద్యమాన్ని బలహీన పర్చడానికి అధికారపార్టీ నేతల ఎత్తుగడలుగా స్థానికులు చర్చించుకుంటున్నారు.

సాంకేతిక ఇంజనీరింగ్ విద్యార్థుల సమస్యలపై ధర్నా

- 11 మంది ఎస్‌ఎఫ్‌ఐ నాయకుల అరెస్టు

ప్రజాశక్తి - మధురవాడ (విశాఖపట్నం)

విశాఖలోని సాంకేతిక ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలంటూ ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యాన ఆ కళాశాల ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భారీగా విద్యార్థులు తరలివచ్చే అవకాశముందన్న అంచనాతో కళాశాల యాజమాన్యం ముందే గేట్లు మూసివేయించింది. అయినప్పటికీ విద్యార్థులు పోరాటాన్ని ఆపలేదు. కళాశాల లోపల సుమారు 700 మంది విద్యార్థులు, బయట ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు ధర్నాలు, నిరసనలతో హోరెత్తించారు. కార్యక్రమానుద్దేశించి ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ఎల్‌జె.నాయుడు మాట్లాడుతూ... కాలేజీ యాజమాన్యం విద్యార్థులపై విధించిన అదనపు ఫీజులను రద్దు చేయాలని, కాండినేషన్ పేరుతో ఒక్కో విద్యార్థి నుంచి రూ.12 వేలు వసూలు చేయడాన్ని నిలిపివేయాలని, నూతనంగా పెంచిన రూ.20 వేల కాలేజీ బస్సు ఫీజును తగ్గించాలని డిమాండ్ చేశారు. కాలేజీ సీనియర్ విద్యార్థులతో తరగతులు చెప్పించడాన్ని ఆపి అధ్యాపకులను నియమించాలన్నారు. బిల్డింగ్ ఫీజు, వివిధ రకాల ఫైన్ ఫీజులను రద్దు చేయాలన్నారు. ల్యాబ్ పరికరాలు ఏర్పాటు చేయాలని, మార్పు చేసిన కాలేజీ టైమింగ్స్‌ను విద్యార్థులందరికీ అనువుగా మార్చాలని డిమాండ్ చేశారు. పై సమస్యలపై గురువారం కాలేజీ విద్యార్థులు ఆందోళనకు



ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ఎల్‌జె.నాయుడును అరెస్టు చేస్తున్న పోలీసులు

దిగిన విషయాన్ని గుర్తుచేశారు. ఆ సమయంలో యాజమాన్యం స్పందిస్తూ సోమవారానికి సమస్యలు పరిష్కరిస్తామని చెప్పిందన్నారు.

ఆ విషయమై అడిగేందుకు వస్తే తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగించడం దారుణమన్నారు. చర్చల కోసం తాము వస్తే పోలీసులు అడ్డుకొని కళాశాలలోకి అనుమతించలేదన్నారు. ఆందోళన చేస్తున్న విద్యార్థులను బెదిరించడం తగదన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు జి.అజయ్, జిల్లా నాయకులు మౌనిక, ఎం.శశి, నిఖిల్, కుసుమాంజలి, నరేష్, సూర్య కిరణ్, ప్రగతి, భరత్ పాల్గొన్నారు.

విద్యార్థులపై పిడి గుద్దులు

తమ సమస్యలు పరిష్కరించాలంటూ ఆందోళనకు దిగిన సాంకేతిక ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థులపై పోలీసులు దాడికి పాల్పడ్డారు. పిడిగుద్దులు గుద్దినట్లు విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులు తెలిపారు. ధర్నా చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులను విచక్షణారహితంగా ఈడ్చుకెళ్లారు. 11 మందిని అరెస్టు చేసి పిఎం.పాలెం పోలీసు స్టేషన్‌కు తరలించారు. కొద్దిసేపటి తరువాత విడిచిపెట్టారు.

ప్రకాశం బ్యారేజీ గేట్లు ఎత్తివేత

ప్రజాశక్తి - విజయవాడ :



ప్రకాశం బ్యారేజికి వరద ప్రవాహం కొనసాగుతుంది. గత రెండు రోజుల నుంచి కృష్ణానది పరీవాహక ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు మునేరు, వైరా నుంచి వరద నీరు వచ్చి చేరుతోంది. ఈ నేపథ్యంలో బ్యారేజీకి చెందిన పది గేట్లను ఒక అడుగు పైకెత్తి 7,250 క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడుదల చేశారు. కాల్వలకు 11,078 క్యూసెక్కులు, డెల్టా పరిధిలోని కెఇ మెయిన్ కెనాల్‌కు 3,312 క్యూసెక్కులు, కెడబ్ల్యు మెయిన్ కెనాల్‌కు 516 క్యూసెక్కులు, ఇతర కాల్వలకు 3,828 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం బ్యారేజీ నీటి మట్టం 12 అడుగులు నమోదైంది.

రెండోదశ ల్యాండ్ పూలింగుపై చర్చిస్తాం

- కేబినెట్ సబ్ కమిటీలో మాట్లాడాలని సిఎం సూచించారు
- మంత్రి నారాయణ
- మూడేళ్లలో అమరావతిని పూర్తి చేస్తాం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రెండోదశ ల్యాండ్ పూలింగుపై కేబినెట్ సబ్ కమిటీలో చర్చించాల్సి ఉందని పట్టణాభివృద్ధిశాఖ మంత్రి నారాయణ తెలిపారు. గత సమావేశంలో ఎజెండా వచ్చిన సమయంలో సబ్ కమిటీలోనూ చర్చించాలని సిఎం సూచించారని మంత్రి పేర్కొన్నారు. ఎలా చేస్తే బావుంటుందనే అంశంపై సబ్ కమిటీలో చర్చించి వచ్చే కేబినెట్లోనూ సమగ్ర నిర్ణయం తీసుకుంటామన్నారు. రాజధాని అమరావతి పరిధిలో చేపడుతున్న పనులను సోమవారం మంత్రి క్షేత్రస్థాయిలో పర్యటించి పర్యవేక్షించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. అమరావతి నిర్మాణాన్ని మూడేళ్లలో కచ్చితంగా పూర్తి చేసి తీరుతామని పేర్కొన్నారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ భవనాలను వచ్చే మార్చి నాటికి పూర్తి చేస్తామన్నారు. ఎల్‌పిఎస్ లేఅవుట్లలో పనులకూ టెండర్లు పూర్తయ్యాయని, 2014-19లోనే అధికారుల కోసం 4 వేల ఇళ్ల నిర్మాణానికి టెండర్లు కూడా పూర్తి చేస్తూ నిర్మాణాలు ప్రారంభించామని తెలిపారు. గత ప్రభుత్వం అన్ని పనులూ నిలిపేసిందని, తిరిగి పాత టెండర్లు రద్దు చేసి న్యాయపరమైన చిక్కులు రాకుండా జాగ్రత్తలు తీసుకుని కొత్తగా టెండర్లు పిలిచేందుకు ఆలస్యమైందని పేర్కొన్నారు. ప్రస్తుతం రాజధానిలో అన్ని పనులూ వేగంగా జరుగుతున్నాయని వివరించారు. వర్షాలు కారణంగా కొన్నిచోట్ల ఇబ్బందులు ఉన్నాయని తెలిపారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ క్వార్టర్లు 12 టవర్లలో 288, ఎఐఎస్ (ఆలిండియా సర్వీసు) అధికారులకు సంబంధించి ఆరు టవర్లలో 144 ప్లాట్లు నిర్మిస్తున్నామన్నారు. ప్రిన్సిపల్ సెక్రటరీల కోసం 25 బంగ్లాలు, సెక్రటరీల కోసం 90 బంగ్లాలు, మంత్రుల కోసం 35, జడ్జిల కోసం 36, ఎన్‌జిఓల కోసం 21 టవర్లలో 1,968 ప్లాట్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. గెజిట్ ఆఫీసర్స్ టైప్-1 అధికారుల కోసం నాలుగు టవర్లలో 384 ప్లాట్లు, టైప్-2 అధికారుల కోసం నాలుగు టవర్లలో 336 ప్లాట్లు, గ్రూప్-డి ఉద్యోగుల కోసం ఆరు టవర్లలో 720 ప్లాట్లు నిర్మిస్తున్నట్లు మంత్రి వివరించారు. హ్యాపినెస్ట్‌లో మొత్తం ఆరు టవర్లలో 1,200 ప్లాట్లను నిర్మిస్తున్నట్లు వివరించారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎఐఎస్ అధికారుల క్వార్టర్లు ఈ డిసెంబర్ నాటికి పూర్తి చేస్తామని వివరించారు. ఐకానిక్ భవనాల నిర్మాణంపై కాంట్రాక్టు సంస్థల ప్రతినిధులు, నార్మన్ ఫోస్టర్స్ సంస్థ ప్రతినిధుల మధ్య తుది చర్చలు జరుగుతున్నాయని వివరించారు. త్వరలోనే వాటి నిర్మాణం కూడా ప్రారంభిస్తామని పేర్కొన్నారు. అమరావతివలో ఇప్పటి వరకూ 72 సంస్థలకు భూ కేటాయింపులు చేసినట్లు మంత్రి నారాయణ తెలిపారు. ఆయా సంస్థల ప్రతినిధులతో స్వయంగా సిఎం మాట్లాడారని, అగ్రిమెంట్లు కూడా చేసుకున్నామని మంత్రి చెప్పారు. డిసెంబర్ నాటికి మెజార్టీ సంస్థలు పనులు ప్రారంభిస్తాయని వివరించారు.

కదంతొక్కిన అంగన్‌వాడీలు

- సమస్యలపై ఐసిడిఎస్ కార్యాలయాల వద్ద ధర్నాలు
- అధికారులకు వినతులు

ప్రజాశక్తి- యంత్రాంగం

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీలు సోమవారం కదంతొక్కారు. ఐసిడిఎస్ కార్యాలయాల వద్ద ధర్నా చేశారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన ఈ కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీలో చదువుతున్న పిల్లలకు ఫేస్ రికగ్నైజేషన్ యాప్ (ఎఫ్ఆర్ఎస్) రద్దు చేయాలని, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సరుకులు అందించేందుకు విధించిన ఆన్‌లైన్ షరతులు తొలగించి పాత పద్ధతినే అమలు చేయాలని, 42 రోజుల సమ్మె విరమణ సందర్భంగా ఇచ్చిన జిఓలను, హామీలను అమలు చేయాలని, పనిభారాన్ని తగ్గించాలని, ప్రీ స్కూల్స్ బలోపేతానికి చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు అందరికీ సంక్షేమ పథకాలు అమలు చేయాలని, అన్ని యాప్‌లనూ కలిపి ఒకే యాప్‌గా చేయాలని, కొత్త 5జి ఫోన్లు ఇవ్వాలని నినాదాలు చేశారు. అధికారులకు ఈ మేరకు వినతిపత్రాలు అందజేశారు. ధర్నాల్లో అంగన్‌వాడీలు, అంగన్‌వాడీ కేంద్రాల లబ్ధిదారులు, బాలింతలు, గర్భిణులు, చిన్నారులు, సిఐటియు నాయకులు పాల్గొని మద్దతు తెలిపారు. కాకినాడ జిల్లా పెద్దాపురంలో ఐసిడిఎస్ కార్యాలయం వద్ద ధర్నాకు అంగన్‌వాడీలు భారీగా తరలివచ్చారు. పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరులో అంగన్‌వాడీలు, బాలింతలు నిరసన ప్రదర్శన చేశారు. తణుకులో సిడిపిఒ కార్యాలయం వద్ద మహాధర్నా నిర్వహించారు. ఒంగోలులోనూ, విశాఖలోనూ స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు కార్యాలయం వద్ద ధర్నాలు చేశారు. తిరుపతి ఆర్‌డిఒ కార్యాలయం వద్ద, సూళ్లూరుపేట, నాగలాపురం, తొట్టంబేడు, పిచ్చాటూరు, గూడూరు, పుత్తూరుల్లో ఐసిడిఎస్ సిడిపిఒ కార్యాలయాల వద్ద నిరసనలు హోరెత్తాయి. కృష్ణా, విజయనగరం, నంద్యాల, కర్నూలు, పార్వతీపురం మన్యం, ఏలూరు, నంద్యాల, కర్నూలు, నెల్లూరు, శ్రీకాకుళం, అనకాపల్లి , అల్లూరి, తూర్పుగోదావరి, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లో అంగన్‌వాడీలు ధర్నా చేశారు.



కాకినాడ జిల్లా పెద్దాపురంలో ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు, లబ్ధిదారులు



స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి వినతిపత్రం అందజేస్తున్న కె.సుబ్బరావమ్మ తదితరులు

స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి వినతి

స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు), ఎపి అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ అసోసియేషన్ (ఎఐటియుసి), ఎపి ప్రగతిశీల అంగన్‌వాడీ వర్కర్, హెల్పర్స్ యూనియన్ (ఐఎఫ్‌టియు) వినతిపత్రం అందజేశాయి. అంగన్‌వాడీ కేంద్రాలకు సరుకులన్నీ ఒకేసారి రావడంలేదని తెలిపారు. ఒటిపి ద్వారా ఇకెవైసి చేసి ఫొటో క్యాప్షర్ చేస్తేనే సరుకులు ఇవ్వాలని అధికారులు ఒత్తిడి చేస్తున్నారని పేర్కొన్నారు. నెట్ సిగ్నల్ లేకపోవడం, సర్వర్ పనిచేయకపోవడంతో అంగన్‌వాడీలు, లబ్ధిదారులు తీవ్ర మానసిక ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. యాప్‌లను నిర్వహించడానికి కావాల్సిన నెట్ స్పీడ్ ఇవ్వలేదని పేర్కొన్నారు. మారుమూల గ్రామాల్లో, గిరిజన ప్రాంతాల్లో సెల్ సిగ్నల్ అందడం లేదని తెలిపారు. కానీ, లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్, సరుకుల పంపిణీ మొత్తం ఆన్‌లైన్ ద్వారానే జరగాలని అధికారులు పెట్టే ఒత్తిడితో ప్రీస్కూల్ దెబ్బతింటోందని పేర్కొన్నారు. లబ్ధిదారులకు గతంలో మాదిరిగానే సంతకం పెట్టించుకొని సరుకులు ఇవ్వాలని, అంగన్‌వాడీలు, గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు ఎఫ్ఆర్ఎస్ రద్దు చేయాలని ఈ వినతిపత్రంలో కోరారు. వినతిపత్రం అందించిన వారిలో అంగన్‌వాడీ వర్కర్క్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్‌సిహెచ్ సుప్రజ, ఎపి అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ అసోసియేషన్ (ఎఐటియుసి) ప్రధాన కార్యదర్శి జె.లలితమ్మ, ఎపి ప్రగతిశీల అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (ఐఎఫ్‌టియు) ప్రధాన కార్యదర్శి వి.ఆర్.జ్యోతి తదితరులు ఉన్నారు.

మహిళా, శిశుసంక్షేమ శాఖ ఇన్‌ఛార్జి డైరెక్టరుగా సూర్యకుమారి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమశాఖ (డబ్ల్యుడి అండ్ సిడబ్ల్యు) ఇన్‌ఛార్జి డైరెక్టరుగా ఆ శాఖ కార్యదర్శి ఎ సూర్యకుమారికి ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగించింది. డైరెక్టరుగా ఉన్న వేణుగోపాలరెడ్డి మిడ్ కెరీర్ ట్రైనింగ్ కోసం ఈ నెల 21 నుంచి వచ్చే నెల 16 వరకూ ముస్సోరి వెల్లడంతో తదుపరి ఆదేశాలు జారీ చేసే వరకూ ఇన్‌ఛార్జి డైరెక్టరుగా సూర్యకుమారి కొనసాగుతారని సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

బలహీన వర్గాల సంక్షేమశాఖకు రూ.617.54 కోట్లు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ పథకంలో భాగంగా జులై నెల పెన్షన్ల పంపిణీ కోసం రూ.617.54 కోట్లను బలహీన వర్గాల సంక్షేమశాఖకు ప్రభుత్వం కేటాయించింది. ఈ మేరకు పరిపాలనా అనుమతి మంజూరు చేస్తూ ఆ శాఖ ముఖ్యకార్యదర్శి కె సునీత సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏడు కార్పొరేషన్ల సిఇఒ, పర్సన్ ఇన్‌ఛార్జుల పీడీ ఖాతాలకు ఈ మొత్తాన్ని జమ చేశారు. ఎపి స్టేట్ ఇబిసి కార్పొరేషన్‌కు రూ.28.73 కోట్లు, ఎపి కాపు కార్పొరేషన్‌కు రూ.292.37 కోట్లు, ఎపి రెడ్డి కార్పొరేషన్‌కు రూ.120.84 కోట్లు, ఎపి కమ్మ కార్పొరేషన్‌కు రూ.104.73 కోట్లు, ఎపి క్షత్రియ కార్పొరేషన్‌కు రూ.16.95 కోట్లు, ఎపి బ్రాహ్మణ్ కార్పొరేషన్‌కు రూ.18.48 కోట్లు, ఎపి వైశ్య కార్పొరేషన్‌కు రూ.35.41 కోట్లు మంజూరు చేశారు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ప్రతిపాదనల మేరకు ఈ నిధులు కేటాయించినట్లు, వీటిని సూచించిన ప్రయోజనాలకే వినియోగించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఆరు కిలోల గంజాయి పట్టివేత

- ఇద్దరు నిందితుల అరెస్టు

ప్రజాశక్తి-నెల్లూరు

నెల్లూరు జిల్లా ఆర్‌టిసి బస్టాండ్ ఆవరణలో అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఎన్‌ఫోర్సుమెంట్ అధికారుల తనిఖీల్లో ఆరు కిలోల గంజాయి పట్టుబడింది. ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. అధికారులు సోమవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ నేపథ్యంలో టి సతీష్ అనే వ్యక్తి నుంచి గంజాయిని కొనుగోలు చేసి దుండిగంలో అమ్మేందుకు కన్నదశన్, రాజేశ్వరన్ ఇద్దరు వ్యక్తులు తీసుకెళ్తున్నట్లు సమాచారం వచ్చింది. దీంతో జిల్లాలో ని ఆర్‌టిసి బస్టాండ్ ఆవరణలో అకస్మిక తనిఖీలలో నిందితులిద్దరు వద్ద నుంచి ఆరు కిలోల గంజాయిని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వారిని అరెస్టు చేశారు. ఈ తనిఖీల్లో ఎన్‌ఫోర్సుమెంట్ అసిస్టెంట్ సూపరిటెండెంట్ ఆర్‌జ గదీశ్వరరెడ్డి, ఎస్‌ఐ ఎస్‌డి కాలేషావలి, కానిస్టేబుల్ ఎం కిరణ్‌సింగ్, డి గిరిబాబు, జివి రమణయ్య పాల్గొన్నారు.

కిరాణా వ్యాపారి ఆత్మహత్య

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఆర్థిక ఇబ్బందులతో కిరాణా దుకాణం వ్యాపారి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన ఏలూరులోని రెండో పట్టణ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని వెంకటరావుపేట ప్రాంతానికి చెందిన వేముల శ్రీనివాస్ (54) దంపతులు ఉంటున్నారు. వీరికి ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ముగ్గురికీ వివాహాలు అయ్యాయి. కుమారుడు వివాహం అనంతరం వేరుగా ఉంటున్నారు. శ్రీనివాస్ ప్రస్తుతం కొత్తపేట సమీపంలో కిరాణా దుకాణాన్ని నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఆయన కొంతకాలం నుంచి పలు రకాల ఫైనాన్స్ కంపెనీల వద్ద ఆర్థిక అవసరాల నిమిత్తం దాదాపు రూ.15 లక్షల వరకు అప్పు చేశారు. సమయానికి అప్పు తిరిగి చెల్లించలేకపోయారు. అప్పు చెల్లించే మార్గం లేకపోవడంతో ఇంట్లోనే యాసిడ్ తాగారు. గమనించిన కుటుంసభ్యులు వెంటనే ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శ్రీనివాస్ మరణించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు సర్వజన ఆసుపత్రి మార్చురీకి పోలీసులు తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నారు.



500 కొత్త టచ్ పాయింట్లను తెరుస్తాం

- మారుతి సుజుకి సిఇఒ వెల్లడి

గూర్‌గావ్ : దేశంలోనే అతిపెద్ద కార్ల తయారీ కంపెనీ మారుతి సుజుకి ఇండియా లిమిటెడ్ (ఎంఎస్‌ఐఎల్) ఉదయ్‌పూర్‌లో తన 5,500వ సర్వీస్ టచ్ పాయింట్‌ను ప్రారంభించింది. దేశవ్యాప్తంగా 2,764 నగరాల్లో 40,000 సర్వీస్ బేలతో సేవలు అందిస్తోన్నట్లు పేర్కొంది. ఆర్థిక సంవత్సరం 2024-25లో 2.7 కోట్ల వాహనాలకు సర్వీస్‌ను అందించినట్లు ఆ కంపెనీ ఎండి, సిఇఒ హిసాషి తకేచి తెలిపారు. 2025-26లో కొత్తగా 500 టచ్‌పాయింట్లను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఇప్పటికే 91 కొత్త టచ్ పాయింట్లను అందుబాటులోకి తెచ్చామన్నారు. తమ వినియోగదారులకు సమీపంలో సౌకర్యవంతమైన, విశ్వసనీయమైన సర్వీస్ అందించడమే తమ లక్ష్యమని హిసాషి తకేచి తెలిపారు.

ఆదివాసీ ప్రత్యేక డిఎస్‌సి ప్రకటించాల్సిందే

- పాడేరు ఐటిడిఎ ఎదుట 48 గంటల ధర్నా ప్రారంభం

ప్రజాశక్తి - పాడేరు టౌన్ (అల్లూరి జిల్లా)

ఆదివాసీ ప్రత్యేక డిఎస్‌సి ప్రకటించాలని, జిఒ నెంబర్ 3 స్థాయిలో ఆదివాసీలకు షెడ్యూల్డ్ ప్రాంతంలో ఉద్యోగ నియామకాల్లో శతశాతం రిజర్వేషన్ కల్పించేలా చట్టం చేయాలని డిమాండ్ చేస్తూ అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు ఐటిడిఎ కార్యాలయం గేటు ఎదుట సోమవారం 48 గంటల మహా ధర్నా చేపట్టారు. ఆదివాసీ నిరుద్యోగుల సంఘం, ఆదివాసీ స్పెషల్ డిఎస్‌సి సాధన కమిటీ ఆధ్వర్యాలో జరిగిన ఈ ధర్నాలో ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ జాతీయ కార్యవర్గ సభ్యులు పి అప్పలనర్స మాట్లాడారు. గతంలో చేపట్టిన పోరాటాలకు ప్రభుత్వం స్పందించి సమస్యలను పరిష్కరిస్తామని చెప్పిన మాటలు నీటి మూటలుగానే మిగిలాయన్నారు. అరకులో జరిగిన ఎన్నికల ప్రచార సభలో తాము అధికారంలోకి వస్తే జిఒ 3కి ప్రత్యామ్నాయంగా మరో జిఒ తీసుకువస్తామన్న చంద్రబాబు హామీ అమలుకు నోచుకోలేదన్నారు. ఇచ్చిన హామీని తక్షణమే నెరవేర్చి గిరిజన నిరుద్యోగులకు మేలు చేయాలని కోరారు. స్పెషల్ డిఎస్‌సి సాధన కమిటీ జిల్లా కన్వీనర్ ఎస్ ధర్మన్న పడాల్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన మెగా డిఎస్‌సిలోని ఆదివాసీ ప్రాంత పోస్టులను మినహాయించి, ప్రత్యేక డిఎస్‌సి ద్వారా ఆదివాసీ నిరుద్యోగులకు ఉద్యోగ నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. వంద శాతం రిజర్వేషన్‌కు ప్రభుత్వం చూపించే ప్రత్యామ్నాయానికి ఎటువంటి సమస్యలూ తలెత్తకుండా ఉండేలా న్యాయపరమైన కసరత్తును ప్రభుత్వం పక్కాగా చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆదివాసీ నిరుద్యోగుల సంఘం జిల్లా కన్వీనర్ ఎస్ సత్యనారాయణ, ఆదివాసీ స్పెషల్ డిఎస్‌సి సాధన కమిటీ జిల్లా కో-కన్వీనర్ రాధాకృష్ణ, భాను, సిహెచ్ రావు, డివైఎఫ్ఐ నాయకులు కె కొత్తయ్య, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు కార్తీక్, నాయకులు చిన్నారావు, గిరిజన మహిళా సంఘం నాయకులు హైమావతి, స్వరూప, డిఎస్‌సి అభ్యర్థులు, నిరుద్యోగ యువత పాల్గొన్నారు.



ధర్నాను ప్రారంభించి మాట్లాడుతున్న అప్పలనర్స



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న రైతులు, రైతు సంఘం నాయకులు

ఎరువులు అందుబాటులో ఉంచాలని ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఎరువులను అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేస్తూ ఎపి రైతు సంఘం ఆధ్వర్యాన విజయనగరం కలెక్టరేట్ వద్ద రైతులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.రాంబాబు మాట్లాడుతూ.. ట్రాన్స్‌పోర్టు సమస్య పేరుతో ఇప్పటికీ అధికారులు ఇండెంట్ పెట్టకపోవడం దారుణమన్నారు. ఎరువుల కొరత వల్ల వ్యాపారులు అధిక ధరకు విక్రయిస్తున్నారని ఆరోపించారు. అధికారులు స్పందించి ఎరువుల కొరత లేకుండా చూడాలని కోరారు.

వ్యవసాయ సంఘ జిల్లా కార్యదర్శి గాడి అప్పారావు మాట్లాడుతూ రైతుసేవా కేంద్రాల ద్వారా ఎరువులు అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎపి రైతు సంఘం నాయకులు, రైతులు పాల్గొన్నారు.

'వివేకా' హత్య కేసులో తదుపరి దర్యాప్తు అవసరమా?

- సిబిఐ అభిప్రాయాన్ని కోరిన సుప్రీంకోర్టు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మాజీ మంత్రి వివేకానంద రెడ్డి హత్య కేసులో మూడు అంశాలపై సిబిఐ అభిప్రాయాన్ని సుప్రీంకోర్టు ధర్మాసనం కోరింది. సిబిఐ అభిప్రాయం చెప్పిన తరువాతనే ఎంపి అవినాష్ రెడ్డి బెయిల్ రద్దుపై విచారణ చేపడతామని ధర్మాసనం పేర్కొంది. 'వివేకా హత్య కేసులో ఇంకా తదుపరి దర్యాప్తు అవసరమని సిబిఐ భావిస్తుందా? లేదా? కోర్టుకు చెప్పాలి. రాష్ట్ర ప్రభుత్వం కడప సెషన్స్ కోర్టులో దాఖలు చేసిన క్లోజర్ రిపోర్టుపై కూడా సిబిఐ అభిప్రాయాన్ని తెలపాలి. వివేకా హత్య కేసు ట్రయల్, తదుపరి దర్యాప్తు ఏకకాలంలో కొనసాగించే అవకాశం ఉందా? అని కూడా సిబిఐ అభిప్రాయాన్ని స్పష్టం చేయాలి' అని ధర్మాసనం పేర్కొంది. ఈ కేసులో వైఎస్ అవినాష్ రెడ్డితో పాటు పలువురు నిందితులకు తెలంగాణ హైకోర్టు గతంలో బెయిల్ మంజూరు చేసింది. తెలంగాణ హైకోర్టు తీర్పును సిబిఐ, వివేకా కుమార్తె సునీత నర్రెడ్డి సుప్రీంలో సవాలు చేశారు. ఈ పిటిషన్లను సోమవారం జస్టిస్ ఎంఎం సుందరేష్ నేతృత్వంలోని ధర్మాసనం విచారించింది. వైఎస్ అవినాష్ రెడ్డితో పాటు బెయిల్‌పై ఉన్న మిగతా నిందితులంతా సాక్షులను ప్రభావితం చేస్తున్నారని సునీత తరపున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వాదనలు వినిపించారు. సిబిఐ అధికారి రామ్‌సింగ్, సునీత దంపతులపై దాఖలైన కేసులో రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన క్లోజర్ రిపోర్టును పరిగణనలోకి తీసుకోవాలని సిద్ధార్థ లూథ్రా కోరారు. వైఎస్ అవినాష్ రెడ్డి ఆదేశాల మేరకే రామ్‌సింగ్, సునీత దంపతులపై కేసు నమోదు చేసినట్లు క్లోజర్ రిపోర్టులో ఉందని, అవినాష్ రెడ్డి బెయిల్ రద్దు చేయాలని ఆయన కోరారు.

విభజన హామీలు అమలు చేయాలి

- ఎపి భవన్ వద్ద కాంగ్రెస్ ధర్నా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

విభజన హామీలు అమలు చేయాలని కాంగ్రెస్ నేతలు సుంకర పద్మశ్రీ డిమాండ్ చేశారు. సోమవారం నాడిక్కడ ఎపి భవన్‌లోని బిఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద రాష్ట్ర కాంగ్రెస్ నేతలు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ప్లకార్డులు పట్టుకుని మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాల హోరెత్తించారు. ఈ సందర్భంగా సుంకర పద్మశ్రీ మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన ప్రత్యేక హోదా హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే కడపలో స్టీల్‌ప్లాంట్ పెట్టాలని, రైల్వే జోన్, పోర్టులు పెట్టాలని డిమాండ్ చేశారు. పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయాలని, వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించాలని అన్నారు. వెనుకబడిన జిల్లాలకు నిధులు ఇవ్వాలని, రాజధాని అమరావతి నిర్మాణానికి నిధులివ్వాలని కోరారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు జేయాలని డిమాండ్ చేశారు. కరేడును కాపాడాలని, భూమిని కాపాడాలని పేర్కొన్నారు. కేంద్రంలోని మోడీ, రాష్ట్రంలోని బాబు ప్రజలను మోసం చేస్తున్నారని దుయ్యబట్టారు.



ఎపి భవన్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నేతలు

నెల్లూరు 'కుబేర'పై సిట్

- సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి - నెల్లూరు

నెల్లూరు 'కుబేర'పై సిట్ ఏర్పాటు చేసి, గిరిజనులకు న్యాయం చేయాలని సిపిఎం డిమాండ్ చేసింది. ఈ మేరకు నగరంలోని రామచంద్రారెడ్డి భవన్‌లో విలేకరులతో సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ మాట్లాడుతూ.. రూ. 20 కోట్లు మోసం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అమాయకులైన గిరిజనులకు కొందరు మాయమాటలు చెప్పి వారి ఆధార్‌కార్డులు, ఇతర పత్రాలు తీసుకుని బోగస్ కంపెనీలు ఏర్పాటు చేసి బ్యాంకుల నుంచి రుణాలు పొందారని తెలిపారు. రుణాలు చెల్లించాలని గిరిజనులకు బ్యాంకు అధికారులు నోటీసులు పంపడం దారుణమన్నారు. బ్యాంకు అధికారుల సహకారంతో ఈ మోసం చేశారని అర్థమవుతుందని, ఈ వ్యవహారంపై బ్యాంకు అధికారులపై విచారణ చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మాజీ డిప్యూటి మేయర్ మాదాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ..యాక్సిస్ బ్యాంకులో రుణాల పేరుతో భారీ స్థాయిలో చోటు చేసుకున్న కుంభకోణం వ్యవహారం 'కుబేరా' సినిమాను తలపించేలా ఉందని విమర్శించారు. నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు.

యూరియా అక్రమ వినియోగంపై కఠిన చర్యలు

- వ్యవసాయశాఖ డైరెక్టర్ ఢిల్లీరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

యూరియాను వ్యవసాయేతర రంగాల్లో అక్రమంగా వినియోగిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లను వ్యవసాయశాఖ డైరెక్టర్ ఢిల్లీరావు ఆదేశించారు. యూరియా వినియోగం ఏటా 15 నుంచి 20 శాతం పెరుగుతుండటం గమనించినట్లు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతులకు సబ్సిడీపై అందిస్తున్న యూరియా పక్కదారి పడుతున్నట్లు కేంద్ర నిఘా సంస్థలు తెలిపాయని వెల్లడించారు. రైతుల కోసం కేటాయించిన యూరియాను ఆక్వా, చేపల చెరువులకు, పశువుల దాణా పరిశ్రమకు, నాటుసారా తయారీకి, ప్లాస్టిక్, ప్లైవుడ్, రసాయనిక పరిశ్రమలకు, కల్తీ పాల తయారీ, అమ్మోనియం నైట్రేట్ వంటి పేలుడు పదార్థాల తయారీకి వినియోగిస్తున్నట్లు నిఘా సంస్థలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. మరోవైపు రైతులు సిఫార్సు చేసిన మోతాదుకు మించి వినియోగించడం, వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రెండోసారి విత్తనాలు వేసుకోవాల్సి రావడం వల్ల యూరియా వాడకం అధికమవుతుందని చెప్పారు. యూరియా అక్రమ వినియోగం నిరోధించడంపై జిల్లా అధికారులు దృష్టి సారించాలని ఆదేశించారు.

గ్రామీణాభివృద్ధిలో నాబార్డుది కీలకపాత్ర

- సహకార శాఖ కమిషనర్ బాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడంలో నాబార్డు ప్రధాన పాత్ర పోషిస్తోందని సహకారశాఖ కమిషనర్, సహకార సంఘాల రిజిస్ట్రార్ బాబు ఎ తెలిపారు. విజయవాడలోని నాబార్డు ప్రాంతీయ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన నాబార్డు 44వ వ్యవస్థాపక దినోత్సవంలో పాల్గొని ఆయన మాట్లాడారు. దేశాభివృద్ధిలో ప్రతి దశలోనూ నాబార్డు సహకారం ఉందన్నారు. సహకార రంగాన్ని ఆధునీకరించడంలోనూ, డిజిటలైజేషన్ చేయడంలోనూ నాబార్డు కీలకపాత్ర పోషించిందని తెలిపారు. రాజధాని అమరావతిలో నాబార్డు కేంద్ర కార్యాలయానికి అవసరమైన స్థలాన్ని రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిందన్నారు. ఇప్పటికే పిఎసిఎస్‌లను కంప్యూటరీకరించామని, రాబోయే రోజుల్లో ఇ-ఆడిటింగ్ ప్రక్రియ అమలు దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. నాబార్డు ప్రాంతీయ కార్యాలయ జిఎం ఎంఆర్ గోపాల్ మాట్లాడుతూ.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో నాబార్డు రూ.42,842 కోట్ల రుణాలు మంజూరు చేసిందన్నారు. నాబార్డు రాష్ట్ర వ్యాప్తంగా మౌలిక సదుపాయాలు, సంస్థ అభివృద్ధికి మద్దతునిస్తుందన్నారు. తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, నంద్యాల జిల్లాల్లో కొత్తగా డిడిఎం కార్యాలయాలను ప్రారంభించినట్లు చెప్పారు. ఆర్‌బిఐ రీజినల్ డైరెక్టర్ ఎఐ బషీర్, ఎస్‌ఎల్‌బిసి కన్వీనర్ సివిఎన్ భాస్కరరావు, ఆప్‌కాబ్ ఎమ్‌డి ఆర్ శ్రీనాథ్‌రెడ్డి ప్రసంగిస్తూ.. నాబార్డు సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా రూట్స్ ఆఫ్ ఛేంజ్ షార్ట్ డాక్యుమెంటరీ విడుదల చేశారు. నిధి పత్రిక, వాటర్ షెడ్ ప్రాజెక్టుల కేస్ స్టడీస్‌ను విడుదల చేశారు.

టెక్నాలజీపై పట్టు సాధించాలి

- యువ ఐపిఎస్‌లకు డిజిపి సూచన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆధునిక సాంకేతిక టెక్నాలజీపై యువ ఐపిఎస్ అధికారులు మరింత పట్టు సాధించాలని డిజిపి హరీష్‌కుమార్ గుప్తా సూచించారు. పోస్టింగ్ పొందిన ప్రాంతాల్లో స్థానిక భాషలపై అవగాహన ఉండాలన్నారు. ప్రజలతో సన్నిహిత సంబంధాలు నెరపాలంటే భాషే మార్గమన్నారు. మంగళగిరిలోని డిజిపి కార్యాలయాన్ని సర్దార్ వల్లభాయ్ పటేల్ నేషనల్ పోలీస్ అకాడమీ (హైదరాబాద్) 77 ఆర్ఆర్ బ్యాచ్‌కు చెందిన 28 ప్రొబేషనరీ ఐపిఎస్ అధికారులు స్టడీ, కల్చరల్ టూర్‌లో భాగంగా సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా డిజిపి, ఇతర ఉన్నతాధికారులను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డిజిపి పోలీస్‌శాఖలోని పలు కీలక అంశాలపై వారికి అవగాహన కల్పించారు. ముఖ్యంగా పోలీస్ శాఖలో అమలవుతున్న సంస్కరణలు, పోలీసింగ్‌లో టెక్నాలజీ వినియోగం, నేరాల నియంత్రణ, సైబర్ నేరాలను అరికట్టడానికి పోలీస్‌శాఖ తీసుకుంటున్న చర్యల గురించి వివరించారు. తొలుత యువ ప్రొబేషనరీ ఐపిఎస్ అధికారులకు ఎపిసిఆర్‌డిఎ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు ఆ శాఖ కమిషనరు, అడిషనల్ కమిషనర్లు రాజధాని అమరావతిపై పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిజిపి మధుసూదన్‌రెడ్డి, ఆపరేషన్స్ అండ్ టెక్నికల్ సర్వీసెస్ ఐజిపి శ్రీకాంత్, ఈగల్ ఐజిపి ఆకె రవికృష్ణ, పిటిఒ ఆర్ ట్రైనింగ్ డిఐజి సత్య ఏసుబాబు, డిఐజి లా అండ్ ఆర్డర్ ఫకీరప్ప పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు ముద్రగడ

- నిలకడగా ఆరోగ్యం

ప్రజాశక్తి - ప్రత్తిపాడు (కాకినాడ జిల్లా)



మెరుగైన వైద్యం కోసం కాపు ఉద్యమ నేత, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభంను అంబులెన్స్‌లో హైదరాబాద్‌కు తరలించారు. నాలుగు రోజుల నుంచి ఆయన కాకినాడలోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులు సూచించడంతో ఆయనను హైదరాబాద్‌కు తరలించేందుకు కుటుంబసభ్యులు సన్నద్ధమయ్యారు. ఈ క్రమంలో తనను ఒకసారి ఇంటికి తీసుకెళ్లాలని ముద్రగడ కోరడంతో ఆయన్ని కిర్లంపూడిలో స్వగృహానికి తరలించారు. కొంతసేపు కుటుంబ సభ్యులతో గడిపిన అనంతరం నాయకులను, కార్యకర్తలు, అభిమానులను పలకరించారు. ముద్రగడ తనయుడు గిరిబాబుతో మాజీ ముఖ్యమంత్రి, వైసిపి అధినేత వైఎస్ జగన్ ఫోన్‌లో మాట్లాడారు. ఎయిర్‌బస్ ఏర్పాటు చేస్తానని చెప్పగా...అంబులెన్స్‌లో వెళ్తానని జగన్‌కు ముద్రగడ చెప్పారు. అనంతరం ఆయన్ని అంబులెన్స్‌లో హైదరాబాద్‌కు తరలించారు.



'యు' ఆకారంలో కూర్చున్న విద్యార్థులు

టిపి కోటలో 'నో బ్యాక్ బెంచ్'

- కేరళ తరహా వినూత్న ప్రయోగం

ప్రజాశక్తి - నాగలాపురం (తిరుపతి జిల్లా)

'యు' ఆకారంలో బెంచీలను అమర్చి వినూత్నంగా కేరళ తరహా విద్యాబోధనకు తిరుపతి జిల్లా సత్యవేడు నియోజకవర్గం నాగలాపురం మండలం టిపి కోట ప్రభుత్వ మోడల్ ప్రాథమిక పాఠశాల శ్రీకారం చుట్టింది. 'యు' షేప్‌తో విద్యార్థుల్లో సమానత్వ భావన పెంపొందుతుందని, మెరుగైన ఫలితాలు వస్తాయని ప్రధానోపాధ్యాయులు వి వెంకటరమణ 'ప్రజాశక్తి'కి తెలిపారు. ఇటీవల వినేశ్ విశ్వనాథ్ దర్శకత్వంలో వచ్చిన మలయాళ సినిమా 'స్థానార్థి శ్రీకుట్టన్ క్లైమాక్స్' సీన్ స్ఫూర్తితో తొలుత కేరళలోని కొల్లం జిల్లాలోని రామవిలాసం ఒకేషనల్ హయ్యర్ సెకండరీ స్కూల్‌లో అక్కడి అధికారులు ప్రయోగాత్మకంగా ఈ విధానాన్ని ప్రారంభించారు. అదే స్ఫూర్తితోనే టిపి కోట ప్రాథమిక పాఠశాలలోనూ ప్రారంభించినట్లు ప్రధానోపాధ్యాయులు తెలిపారు. పాఠశాలలో మొత్తం 78 మంది విద్యార్థులు ఉండగా, ఐదు తరగతులకు నాలుగు గదులు ఉన్నాయి. మూడు తరగతుల్లో యు టైప్ బెంచి అమరిక సిద్ధం చేసి తరగతులను నిర్వహిస్తున్నారు.

చట్టపరిధిలోనే మిథున్‌రెడ్డి అరెస్టు

- నేరాల నియంత్రణకు రాష్ట్ర వ్యాప్తంగా లక్ష సిసి కెమెరాల ఏర్పాటు : మంత్రి అనిత

ప్రజాశక్తి- మడకశిర టౌన్

చట్ట పరిధిలోనే వైసిపి ఎంపి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి అరెస్టు జరిగిందని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి తెలిపారు. నేరాల నియంత్రణకు రాష్ట్ర వ్యాప్తంగా లక్ష సిసి కెమెరాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. శ్రీసత్యసాయి జిల్లా మడకశిరలో ఎమ్మెల్యే ఎంఎస్.రాజు క్యాంపు కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఏ ఒక్కరిపైనా తప్పుడు కేసులు పెట్టలేదని, తప్పు చేసిన వారిపైనే కేసులు పెడుతున్నామని చెప్పారు. మిథున్‌రెడ్డి అరెస్ట్ అక్రమమా, సక్రమమా అనేది కోర్టు తేలుస్తుందన్నారు. ఆధారాలు ఉంటేనే ఎవరినైనా అరెస్టు చేస్తారని తెలిపారు. ఏమైనా ఉంటే కోర్టులో తేల్చుకోవాలన్నారు. గత వైసిపి ప్రభుత్వం మాదిరిగా తాము కక్ష సాధింపులకు పాల్పడడం లేదని చెప్పారు. రాజకీయ ముసుగులో ఉన్న నేరస్తుడు మాజీ సిఎం, వైసిపి అధినేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అని తీవ్ర స్థాయిలో విమర్శించారు. రాష్ట్రంలో గంజాయి సాగు పూర్తిగా తగ్గిందని చెప్పారు. రాష్ట్రంలో ప్రస్తుతం మూడు సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్లు పనిచేస్తున్నాయని తెలిపారు. జిల్లాకొక సైబర్ పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారన్నారు. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గానికీ రెండు డ్రోన్ కెమెరాలు అందించే ఆలోచన చేస్తున్నామని తెలిపారు. సినిమాలు, సీరియల్స్‌లో అధికంగా హింసను ప్రేరేపించేలా చూపిస్తున్నారని, ఇలాంటి వాటి నివారణకు మేధోమదనం జరుగుతోందని చెప్పారు. వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్లు బిగించం

లిక్కర్ స్కాంలో దోషులెంతటి వారైనా చర్యలు తప్పవు : మంత్రి గొట్టిపాటి

ప్రజాశక్తి- ఒంగోలు కలెక్టరేట్

వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్లు బిగించబోమని, ఈ మీటర్ల వినియోగంలో చిన్న చిన్న ఇబ్బందులు ఎదురైతే.. ప్రభుత్వం బాధ్యత తీసుకుని పరిష్కరిస్తుందని రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ హామీ ఇచ్చారు. ఒంగోలులో సోమవారం జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు- ఇంటింటికీ టిడిపి కార్యక్రమంలో ఒంగోలు, సంతనూతలపాడు శాసనసభ్యులు దామచర్ల జనార్ధనరావు, బిఎన్ విజయ్‌కుమార్‌తో కలిసి మంత్రి పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో ఒంగోలు నగరంలోని 36వ డివిజన్‌లో ఇంటింటికీ వెళ్లి టిడిపి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలు తీరును లబ్ధిదారులకు వివరించారు. లిక్కర్ స్కాంలో దోషులెంతటి వారైనా చర్యలు తప్పవని, నాసిరకం మద్యం అమ్మకాల ద్వారా ప్రజల ప్రాణాలతో చెలగాటమాడిన జగన్ అండ్ కో విషయంలో చట్టం తన పని తాను చేస్తోందని స్పష్టం చేశారు. వైసిపి ప్రభుత్వ హయాంలో తొమ్మిది సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజలపై భారం మోపిందన్నారు. కార్యక్రమంలో ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్, సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

24న భారత్-బ్రిటన్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం



న్యూఢిల్లీ : జులై 24న భారత్, బ్రిటన్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టిఎ) జరగనుంది. లండన్‌లో జరగనున్న ఈ కార్యక్రమానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోడి, వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ హాజరు కానున్నారు. ఈ ఒప్పందంపై ఇరు దేశాల అధికారులు సంతకాలు చేయనున్నారు. దీని ద్వారా 2030 నాటికి 120 బిలియన్ డాలర్ల ద్వైపాక్షిక వాణిజ్యాని చేరాలని లక్ష్యంగా పెట్టుకున్నాయి. ఈ ఒప్పందంలో భారత్‌కు చెందిన తోలు, ఫుట్‌వేర్, దుస్తుల ఎగుమతులపై సుంకాలను తొలగించనుంది. అదే విధంగా బ్రిటన్ నుండి వచ్చే విస్కీ, కార్ల దిగుమతులపై భారత్ టారిఫ్‌లను ఎత్తివేయనుంది. బ్రిటిష్ పార్లమెంట్, భారత కేబినెట్ ఆమోదం తర్వాత ఏడాదిలో అమలులోకి రానుంది. ఈ ఎఫ్‌టిఎకు సంబంధించి మే 6న ఈ ఒప్పంద చర్చలు ముగిశాయి. బుధవారం నుంచి మోడి నాలుగు రోజుల పాటు బ్రిటన్, మాల్దీవ్స్‌ల పర్యటనకు వెళ్లనున్నారు. పలు వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ రంగాల్లో ద్వైపాక్షిక సంబంధాల్లో పాల్గొననున్నారు.

ఆగస్టులో భారత్‌కు అమెరికా బృందం

- వాణిజ్య ఒప్పంద చర్చలు కొనసాగింపు

న్యూఢిల్లీ : ద్వైపాక్షిక వాణిజ్య చర్చల్లో భాగంగా అమెరికా బృందం ఆగస్టులో భారత్‌కు రానుంది. ఇప్పటికే ఐదు దశల్లో చర్చలు జరగ్గా.. తదుపరి రౌండ్ చర్చల కోసం యుఎస్ అధికారులు రానున్నారని సోమవారం ఓ ఉన్నతాధికారి వెల్లడించారు. గత వారం వాషింగ్టన్‌లో భారత్, అమెరికా బృందాలు ఐదో రౌండ్ చర్చలను ముగించాయి. భారత్ తరపున వాణిజ్య శాఖ స్పెషల్ సెక్రటరీ రాజేష్ అగర్వాల్, అమెరికా తరపున అసిస్టెంట్ యుఎస్ ట్రేడ్ రిప్రెజెంటేటివ్ బ్రెండన్ లించ్ చర్చల్లో పాల్గొన్నారు. ఆగస్టు 1వ తేది నాటికే ఇరు దేశాలు తాత్కాలిక వాణిజ్య ఒప్పందాన్ని ఖరారు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ పలు అంశాలపై ఇరు దేశాలు పట్టుబట్టడంతో ఈ ఒప్పందం ఆలస్యం అవుతోంది. భారత్‌లో తమ జన్యు మార్పిడి (జిఎం) విత్తనాలు, పాడి పరిశ్రమలో పాలు, పాల ఉత్పత్తులను అనుమతించాలని అమెరికా తీవ్రంగా డిమాండ్ చేస్తోంది. మరోవైపు భారత్ వాహన, స్టీల్, ఆల్యూమినియం ఉత్పత్తులపై సుంకాలను తగ్గించాలని పట్టుబడుతోంది.

మెరిల్‌లో ఆడియా రూ.1725 కోట్ల పెట్టుబడులు

న్యూఢిల్లీ : ప్రముఖ మెడికల్ పరికరాల ఉత్పత్తుల కంపెనీ మైక్రో లైఫ్ సైన్సెస్ లిమిటెడ్ (మెరిల్)లో అబూ ధాబీ ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ (ఆడియా) 200 మిలియన్ డాలర్లు (దాదాపు రూ.1725) కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు ప్రకటించింది. దీంతో మెరిల్‌లో 3 శాతం వాటాను పొందనుంది. ఈ పెట్టుబడితో మెరిల్ విలువ 6.6 బిలియన్ డాలర్లకు చేరిందని అంచనా. 'ఈ పెట్టుబడి తమ వృద్ధి, టాలెంట్ ఆకర్షణ, ఆర్‌అండ్‌డిని బలోపేతం చేయడంలో సహాయపడుతుంది." అని మెరిల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ సంజీవ్ భట్ పేర్కొన్నారు.

అమెజాన్ ప్రైమ్ డేలో రికార్డ్ అమ్మకాలు

బెంగళూరు : అమెజాన్ ఇండియా ప్రైమ్ డే 2025లో రికార్డ్ అమ్మకాలను నమోదు చేసినట్లు ఆ సంస్థ తెలిపింది. మూడు రోజుల్లో ప్రైమ్ సభ్యులు నిమిషానికి 18,000కు పైగా ఆర్డర్లు చేశారని పేర్కొంది. ఇది 2024తో పోలిస్తే 50 శాతం అధికమని వెల్లడించింది. చిన్న, మధ్యతరహా వ్యాపారాలు అత్యధిక విక్రయాలు సాధించాయని అమెజాన్ ఇండియా ప్రైమ్ హెడ్ అక్షయ్ సాహీ పేర్కొన్నారు. తమ విక్రేతలు, బ్రాండ్‌లు, బ్యాంక్ భాగస్వాముల సహకారంతో భారత్‌లో అతిపెద్ద ప్రైమ్ డే సేల్‌ను నిర్వహించామన్నారు.

సంపాదకీయం

ప్రగతి చక్రం విచ్ఛిన్నం!

రాష్ట్ర రోడ్డు రవాణ సంస్థ (ఆర్‌టిసి) విలువైన స్థలాలపై బడా కార్పొరేట్ల కన్ను పడింది. అంతే, కారు చౌకగా ఆయా సంస్థలు కొట్టేసేందుకు వీలుగా టిడిపి కూటమి ప్రభుత్వంలో చకచక విధానాలు తయారై కేబినెట్‌లో ఆమోదానికి సిద్ధమైపోతున్నాయి. భూముల సంతర్పణకు ప్రభుత్వం ఎలాగూ అనుకూలమే కనుక మంత్రిమండలి గ్రీన్‌సిగ్నల్ లాంఛనమే. విజయవాడ నడిబొడ్డునున్న అత్యంత విలువైన గవర్నర్‌పేట-2, పాతబస్టాండ్ జాగాలను అంతర్జాతీయ వాణిజ్య దిగ్గజం లూలూ గ్రూపునకు ధారాదత్తం చేసేందుకు వడివడిగా అడుగులు పడుతున్నాయి. లూలూ సంస్థ ఆర్‌టిసి నుంచి దక్కించుకునే స్థలాల్లో భారీ షాపింగ్‌మాల్ నిర్మిస్తుందని చెబుతున్నారు. గత టిడిపి ప్రభుత్వ హయాంలో విశాఖలో ఇదే సంస్థకు భూములివ్వగా ప్రభుత్వం మారాక పత్తా లేదు. ఆ సంస్థకే ప్రస్తుత కూటమి సర్కారు ఆర్‌టిసి స్థలాలను హారతిపళ్లెంలో పెట్టి మరీ అందిస్తోంది. కనీసం రూ.400 కోట్ల విలువ చేసే ఆర్‌టిసి జాగాను ప్రజల, ఆర్‌టిసి సంస్థ అవసరాలకు వినియోగించాల్సిందిపోయి బహుళజాతి సంస్థ లూలూకు అర్పించుకోవడం, అందుబాటులో ఉండాల్సిన బస్ డిపోను ఎక్కడో ఊరవతలకు తరలించడం ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల విధానాలకు పరాకాష్ట. ఎప్పుడైతే లూలూకు పాతబస్టాండ్ జాగా ఇస్తారని బయటికి పొక్కిందో ఆ క్షణం నుంచి ప్రజలు, ప్రజాసంఘాలు, ఆర్‌టిసి కార్మికులు ఆందోళనలకు ఉపక్రమించారు. బెజవాడ, పరిసర జనం పాత బస్టాండ్‌ను సెంటిమెంట్‌గా భావించడమే అందుక్కారణం.

మోడీ ప్రభుత్వం ఆర్‌టిసి వ్యవస్థలను ప్రైవేటీకరించేందుకు ప్రత్యేక చట్టాలు చేయగా, ఎప్పటి నుంచో ఆర్‌టిసి ప్రైవేటీకరణ లక్ష్యంతో ఉన్న టిడిపి, ఇదే అదనుగా ముందుకెళుతోంది. ఆర్‌టిసి స్థలాల నగదీకరణ (మోనిటైజేషన్) ప్రాజెక్టు అమలు చేస్తోంది. నీతి-ఆయోగ్ అధికారులు దీనిపై స్వయంగా ఆర్‌టిసి అధికారులతో పర్యవేక్షిస్తున్నారు కూడా. అందులో భాగమే లూలూకు విజయవాడ పాతబస్టాండ్ స్థలాల అప్పగింత. ఆటోనగర్ బస్టాండ్, తిరుపతి బస్టాండ్, విద్యాధరపురం డిపో స్థలాల్లో బహుళ అంతస్తుల భవనాల నిర్మాణానికి పిపిపి విధానం అమలుకు ప్రతిపాదనలు ఉన్నాయి. అందుకు వ్యతిరేకంగా ఆయా ప్రాంతాల్లో ఆందోళనలు కొనసాగుతున్నాయి. లూలూ మాల్ వస్తే చిరు వ్యాపారులేగాక మధ్యతరగతి, ఆ పైస్థాయి వారి వ్యాపారాలు కూడా కుదేలవుతాయి. గతంలో విజయవాడ పాతబస్టాండ్ జాగాను నగర సుందరీకరణకు తీసుకుంటామంటే ప్రజలు, కార్మికులు తిరగబడ్డారు. విద్యాధరపురం జాగాను ఇండో అమెరికన్ ఆస్పత్రికి ఇవ్వదలిస్తే ప్రతిఘటించారు. దాంతో ఆ రెండు ప్రతిపాదనపైనా సర్కారు విరమించుకోవాల్సి వచ్చింది. రాష్ట్రంలో ఇంకా ఇలాంటివి ఎన్నో ఉన్నాయి.

ప్రభుత్వరంగంలోని ప్రజారవాణా వ్యవస్థలను కార్పొరేట్ల చేతిలో పెట్టే విద్యుత్ బస్‌ల పథకాన్ని మోడీ ప్రభుత్వం రూపొందించింది. కొనసాగింపుగా తొలిదశలో రాష్ట్రంలోని 19 డిపోల పరిధిలో 950 ఎలక్ట్రిక్ బస్‌లను కూటమి ప్రభుత్వం ప్రవేశపెడుతోంది. ఆర్‌టిసి భూములను ఎలక్ట్రిక్ బస్ కంపెనీలకు నామమాత్రపు లీజుకు ఇస్తోంది. ఆ భూముల్లో బస్‌ల పార్కింగ్, నిర్వహణ, ఛార్జింగ్ యూనిట్లు, తదితర అవసరాలకు కంపెనీలు వాడుకుంటాయి. ఎలక్ట్రిక్ బస్‌ల నిర్వహణతో ఆర్‌టిసికి ఎటువంటి సంబంధమూ ఉండదు. అదే జరిగితే ఆర్‌టిసి ఆక్యుపెన్సీ తగ్గి నష్టం వస్తుంది. నిర్వహణాలోపాలతో నష్టాల్లోకి చేరిన సంస్థకు ఇది మరింత నష్టం. అందుకే విద్యుత్ బస్‌ల నిర్వహణను ఆర్‌టిసికే అప్పగించాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికే పెద్ద సంఖ్యలో ఆర్‌టిసి బస్‌లు శిధిలావస్థకు చేరాయి. ఏళ్లతరబడి రిక్రూట్‌మెంట్ లేదు. బస్‌స్టాండ్‌లు, డిపోల స్థలాలు ప్రైవేటుకు ఇచ్చేస్తే సంస్థ మనుగడ ప్రశ్నార్థకం. 'ప్రగతి చక్రం' విచ్ఛిన్నమవుతుంది. ఇదే సమయంలో ప్రైవేటు ట్రావెల్స్ రోజు రోజుకు దేదీప్యమానంగా వెలిగిపోతాయి. మోడీ, బాబు ప్రభుత్వాలకు ఇదే కావాలి. రాష్ట్ర వ్యాప్తంగా ఆర్‌టిసికి 20 వేల ఎకరాలకుపైన ఆస్తులున్నాయి. అవి ప్రజల ఆస్తులు. అవి ప్రజావసరాలకే వినియోగించాలి. కార్పొరేట్ల పరం కానీవ్వకుండా పరిరక్షించుకోవడం ఆర్‌టిసి కార్మికులు, సిబ్బందితోపాటు ప్రతిఒక్కరి కర్తవ్యం.

మహనీయుని మాట



అడవులనూ, ఆదివాసీలనూ రక్షించుకోవడం అంటే మానవాళి తనను తాను కాపాడుకోవడమే !

చికో మెండిస్
బ్రెజిల్ పర్యావరణ వేత్త

భారత్‌లో పెరుగుతున్న ఆదాయ అసమానతలు

61 దేశాలకు సంబంధించి ఆ దేశాల్లో ప్రజానీకం చేసే ఖర్చుల తీరు తెన్నులను, కొన్ని దేశాలలో ఆదాయాల తీరు తెన్నులను తెలియజెప్పే గణాంకాలను ఇటీవల ప్రపంచబ్యాంక్ వెల్లడించింది. ఆ వివరాల ప్రకారం అంతరాలు అతి తక్కువగా ఉన్న దేశాల్లో భారతదేశం 2022 లో నాలుగో స్థానంలో ఉంది. దానిని పట్టుకుని మోడీ ప్రభుత్వం ప్రపంచంలోనే సమన్యాయం అమలు జరుగుతున్న దేశాల్లో మన దేశం నాలుగో స్థానంలో ఉందంటూ ప్రచారం మొదలెట్టారు. ఈ విధంగా గొప్పలకు పోవడం ఎంత హాస్యాస్పదమో వేరే చెప్పనక్కర్లేదు. చాలా మంది పరిశోధకులు దీనిని ఇప్పటికే చాలా ఎండగట్టారు. దానిమీద మరింత సమయాన్ని వెచ్చించడం అంటే చచ్చిన పాముని ఇంకా చంపడమే. ఐతే ఒకటి, రెండు అంశాలు వివరించవలసినవి ఉన్నాయి. ఈ లేని గొప్పల గురించిన చర్చ కన్నా, అసలు దేశ ఆర్థిక వ్యవస్థలో వాస్తవంగా ఇప్పుడు ఏం జరుగుతోంది అన్నది తెలియాలి. దానికన్నా ముందు మోడీ ప్రభుత్వం చెప్పుకుంటున్న గొప్పలెంత అర్థం పర్థం లేనివో తెలియజెప్పిన వాదనలను సంక్షిప్తంగా చూద్దాం. 61 దేశాల సమాచారం మాత్రమే పట్టుకుని మొత్తం ప్రపంచం అంతా ఇదేనన్నట్టు మాట్లాడడంలో అర్థం లేదన్నది కనిపిస్తూనేవుంది. రెండవది: ఖర్చు చేసే దానిలో అంతరాల కన్నా ఆదాయాల్లో అంతరాలు ఎక్కువగా ఉంటాయి. ఆదాయం పెరుగుతున్నకొద్దీ, వినిమయం కోసం చేసే ఖర్చు శాతం తగ్గుతూ, పొదుపు చేసే శాతం పెరుగుతూ పోతుంది. అందుచేత ఏ దేశానికైనా ఖర్చు చేసే దానిలో అంతరాలు తక్కువగా ఉంటాయి. ఆదాయాల్లో అంతరాలు ఎక్కువగా ఉంటాయి. అటువంటప్పుడు వివిధ దేశాలలో నెలకొన్న అసమానతలను అంచనా కట్టేటప్పుడు కొన్ని సార్లు ఆదాయాల అంతరాలను, మరికొన్ని సార్లు ఖర్చుల్లో అంతరాలను పరిగణనలోకి తీసుకోవడం చెల్లదు. దాని ప్రాతిపదికన ఎటువంటి నిర్ధారణకూ రావడానికి వీలుపడదు.



ప్రభాత్ పట్నాయక్

ఇక్కడ ఇంకో అంశాన్ని పేర్కొనాలి. ఆదాయాల్లో కనిష్ట స్థాయిలో ఉన్నవారి విషయంలో వారివద్ద పొదుపు చేసేది ఏమీ ఉండదు. నిల్వ ఉండకపోగా కనీస స్థాయిలో తప్పనిసరిగా చేయవలసిన ఖర్చులకోసం వారు అప్పులు చేస్తారు. మరీ ముఖ్యంగా వైద్య అవసరాలు వచ్చినప్పుడు ఇది అనివార్యం. అందుచేత కేవలం చేసిన ఖర్చుల ప్రాతిపదికన అసమానతలను అంచనా వేయడం వల్ల తప్పుడు నిర్ధారణలు వస్తాయి. అట్టడుగుస్థాయిలో ఉండే ప్రజలు రుణ భారంతో ఇబ్బంది పడుతూంటారన్నది జగమెరిగిన సత్యం. కేరళలో ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం వ్యవసాయదారుల రుణ విముక్తి చట్టాన్ని 2006లో తెచ్చింది. రైతాంగ ఆత్మహత్యలను నివారించడం దాని ప్రధాన ఉద్దేశ్యం. ఆ సందర్భంగా ఎక్కువమంది రైతుల ఆత్మహత్యలకు కారణం వారు వైద్య అవసరాల నిమిత్తం చేసిన అప్పులేనని పరిశీలనలో వెల్లడైంది. (దానిని పట్టుకుని కొందరు వ్యవసాయ అవసరాల కోసం అప్పులు చేసినవారికే రుణ విముక్తి వర్తించేలా చట్టాన్ని సవరించాలంటూ వాదించారు కూడా.)

> **వాస్తవంగానే ధనిక, పేద అంతరాలు తగ్గిపోయివుంటే, ఆకలి, పౌష్టికాహార లోపం చాలా తీవ్ర స్థాయిలో ఇంకా ఎందుకు కొనసాగుతున్నట్టు? దీనికి ప్రభుత్వం దగ్గర సమాధానం ఉందా? తక్కిన ప్రధాన దేశాలన్నింటికన్నా మన జిడిపి వృద్ధిరేటు చాలా ఎక్కువగా కొనసాగుతున్నట్టు ప్రభుత్వం చెప్పుకుంటోంది. ఇప్పుడు అసమానతలు కూడా తగ్గిపోయాయని అంటున్నది వాస్తవమే అయితే, అత్యల్ప ఆదాయాలు పొందేవారికి కూడా ఆదాయాల్లో పెరుగుదల ఎంతో కొంత ఉండాలి కదా. అప్పుడు ఆహార ధాన్యాల వినియోగంలో మన దేశం ప్రపంచంలోని 125 దేశాలతో పోల్చినప్పుడు 107వ స్థానంలోనే ఎందుకు ఉన్నట్టు? ఎందుకు భారతీయ మహిళలలో రక్తహీనత పెరుగుతున్నట్టు?**



మరొక అంశం: అత్యున్నత ఆదాయ వర్గాల మొత్తం సంఖ్యకు తగ్గ నిష్పత్తిలో సర్వే నిమిత్తం ఎంచుకున్నవారిలో వారు ఉండరు. ఇది అన్ని సర్వేల్లోనూ కనిపించేదే. దానికి కారణం వారు సంఖ్య రీత్యా చాలా తక్కువ. మామూలుగా పరిశోధకులు ఈ వాస్తవాన్ని దృష్టిలో ఉంచుకుని ఆ లోపాన్ని సరి చేయడానికి పలు పద్ధతులను అవలంభిస్తారు. కానీ ఈ సర్వేలో అటువంటి ప్రయత్నాలేవీ జరగలేదు. ప్రపంచబ్యాంకు జాతీయ శాంపిల్ సర్వే ఇచ్చిన సమాచారం ఆధారంగా తన నివేదిక రూపొందించింది. అందులో పైన పేర్కొన్న లోపాన్ని సవరించే ప్రయత్నమేదీ జరగలేదు. తక్కిన దేశాల విషయంలో కూడా ఇదే మాదిరిగా జరిగింది.

ప్రపంచ బ్యాంకు వినిమయ ఖర్చుల అంతరాలను అంచనా వేసినప్పుడు సంపద పంపిణీని మొత్తంగా అంచనా వేస్తుంది. దాని కారణంగా కూడా పొరపాటు నిర్ధారణలకు వచ్చే అవకాశం ఉంది. ఉదాహరణకు : సంపన్నులలో అత్యంత సంపన్నులైన ఒక శాతం వ్యక్తుల ఆదాయాల వాటా పెరిగిందనుకుందాం. అదే సమయంలో వారికి దిగువన ఉన్న వారిలో (దిగువ నుండి) 5వ దొంతరలో ఉన్నవారి ఆదాయాలు తగ్గి వారంతా (దిగువనుండి) 3వ దొంతరలోకి దిగజారిపోయారనుకుందాం. అప్పుడు అంతరాల సూచిక అంతరాలు తగ్గినట్టు చూపిస్తుంది. నిజానికి తక్కిన తరగతులన్నీ నష్టపోయినందునే ఆ ఒక్క శాతమూ తమ సంపదను మరింత పెంచుకోగలిగారు. కాని అంతరాల సూచిక దానిని సక్రమంగా సూచించజాలదు. ఈ అంతరాల సూచికను బట్టి ఆర్థిక అసమానతలు తగ్గిపోయాయనో, పెరిగిపోయాయనో నిర్ధారించడం అర్థరహితం. ఒకవేళ మన దేశంలో వాస్తవంగానే ధనిక, పేద అంతరాలు తగ్గిపోయివుంటే, ఆకలి, పౌష్టికాహార లోపం చాలా తీవ్ర స్థాయిలో ఇంకా ఎందుకు కొనసాగుతున్నట్టు? దీనికి ప్రభుత్వం దగ్గర సమాధానం ఉందా? తక్కిన ప్రధాన దేశాలన్నింటికన్నా మన జిడిపి వృద్ధిరేటు చాలా ఎక్కువగా కొనసాగుతున్నట్టు ప్రభుత్వం చెప్పుకుంటోంది. ఇప్పుడు అసమానతలు కూడా తగ్గిపోయాయని అంటున్నది వాస్తవమే అయితే, అత్యల్ప ఆదాయాలు పొందేవారికి కూడా ఆదాయాల్లో పెరుగుదల ఎంతో కొంత ఉండాలి కదా. అప్పుడు ఆహార ధాన్యాల వినియోగంలో మన దేశం ప్రపంచంలోని 125 దేశాలతో పోల్చినప్పుడు 107వ స్థానంలోనే ఎందుకు ఉన్నట్టు? ఎందుకు భారతీయ మహిళలలో రక్తహీనత పెరుగుతున్నట్టు? కనీస స్థాయిలో పౌష్టికాహారాన్ని పొందలేకపోతున్న జనాభా శాతం ఎందుకు పెరుగుతున్నట్టు? జిడిపి వృద్ధిరేటు పెరుగుతున్నందువల్ల పెరిగిన సంపదనంతటినీ అత్యంత సంపన్నవర్గాలు చేజిక్కించుకుంటున్నందువల్లే ఇలా జరుగుతోంది. దీనిని ప్రపంచబ్యాంకు తయారు చేసిన అంతరాల సూచిక వెల్లడించలేదు. ప్రపంచబ్యాంక్ అంతరాల సూచికకు ప్రత్యామ్నాయంగా థామస్ పికెటీ, అతని బృందం ప్రపంచ అసమానతల సూచికను తయారు చేయడానికి గణాంకాలను సేకరించారు. వారి నివేదిక ప్రకారం భారతదేశంలో 2023-24 లో అత్యంత సంపన్నులైన 1 శాతం దగ్గర దేశ ఆదాయంలో ఏకంగా 23 శాతం చేరింది. ఇది గత వంద సంవత్సరాలలోకెల్లా అత్యధికం. నయా ఉదారవాద విధానాలను అమలు చేస్తున్న ఫలితంగా అత్యవసర సేవలైన వైద్యం, విద్య వంటివి అంతకంతకూ అధికంగా ప్రైవేటు రంగం చేతుల్లోకి పోతున్నాయి. ఆదాయాల అంతరాలు పెరిగిపోడంలో దీని పాత్ర చాలా ఉంది.

సంపన్నులు ఎప్పుడూ ఖరీదైన ప్రైవేటు వైద్యానికే పోతూంటారు. పేదవారు ప్రభుత్వ వైద్య సంస్థల సేవలను ఉపయోగించుకుంటారు. ఎప్పుడైతే ప్రభుత్వ వైద్య వ్యవస్థ కుదించుకుపోతూవుంటుందో, అప్పుడు ఆ పేదవారు సైతం అనివార్యంగా ప్రైవేటు వైద్య సేవల వైపు మళ్ళవలసివస్తుంది. దాని వల్ల వారి ఖర్చు పెరుగుతుంది. ఒకపక్క ఆదాయాలు తగ్గిపోతున్నా, మరొకవైపు ఖర్చు పెరుగుతుంది. ఈ పెరిగిన ఖర్చును చూపించి ధనిక, పేద వర్గాల మధ్య అంతరాలు తగ్గిపోతున్నట్టు చెప్పుకోవడం కన్నా అసంబద్ధమైనది ఉంటుందా? ఇలా వైద్యం నిమిత్తం ఖర్చు పెరిగిపోయినప్పుడు పేదలు అనివార్యంగా ఇతర ఖర్చులను తగ్గించుకోడానికి ప్రయత్నిస్తారు. అందువల్లే వారి ఆహార ఖర్చు తగ్గుతుంది. అది కాకపోతే వారు అప్పులు చేస్తారు. అందుచేత అంతరాలు తగ్గిపోయాయంటూ ప్రభుత్వం చెప్పుకుంటున్నది వాస్తవ చిత్రానికి పూర్తి విరుద్ధం. ప్రభుత్వ ఆస్పత్రులలో విపరీతమైన రద్దీ కారణంగా సకాలంలో వైద్యం అందకపోవడం, లేదా, అక్కడ ఆలస్యం అవుతున్నందున ప్రైవేటు ఆస్పత్రులకు పోయి అక్కడ బిల్లులు కట్టలేక, వైద్యం పొందలేక బిడ్డల్ని పోగొట్టుకోవడం వంటి సంఘటనలతో వార్తాపత్రికల్లో మనకు ప్రతీరోజూ కనిపిస్తూనేవున్నాయి.

ప్రజలకు అత్యవసరమైన సేవలను ప్రైవేటుపరం చేసి వాటిని ఖరీదైనవిగా మార్చి, పేదలను మరింత కష్టాలపాలు చేయడమే కాకుండా, తమ విధానాల వల్ల సమాజంలో ధనిక, పేద అంతరాలు తగ్గిపోయాయంటూ ప్రచారం చేసుకోవడం ఈ ప్రభుత్వపు బాధ్యతారాహిత్యానికి అద్దం పడుతోంది.

(స్వేచ్ఛానుసరణ)

విశ్లేషణ

కాంట్రాక్టు ఉద్యోగుల సంక్షేమం మరిస్తే ఎలా?

కమలరాణి..కెజిబివి ఒకేషనల్ టీచర్. " మాకు ఎప్పుడు వేతనాలు పెరుగుతాయి" అని రోజూ ఫోన్ చేసేది. ఒక రోజు గ్రూప్ మెసేజ్ వచ్చింది ఆమె ప్రమాదంలో మరణించారు అని. లక్ష్మి ఔట్సోర్సింగ్ ఉద్యోగి. భర్త చనిపోయాడు, ఇద్దరు పిల్లలు, వచ్చే జీతం పదిహేను వేలు, రేషన్ కార్డు, వితంతువు పెన్షన్ రెండూ లేవు, అద్దె ఇంట్లో ఉంటుంది. సూర్యనారాయణ కాంట్రాక్టు ఉద్యోగి 62 ఏళ్ళు. రిటైర్ వయస్సు పెంచుతారని ఆశగా ఎదురుచేస్తూ, ఎలాంటి బెనిఫిట్స్ లేకుండా రిటైర్ అయ్యారు. ఇలాంటి పరిస్థితుల్లో మార్పుల కోసం ఎదురుచూస్తున్న నేపథ్యంలో టిడిపి, జనసేన, బిజెపి కూటమి సర్కార్ ఏడాది పూర్తి చేసుకుంది. మున్సిపల్, పంచాయితీరాజ్, విద్యుత్ రంగం, యూనివర్సిటీలు, సమగ్ర శిక్షా, నేషనల్ హెల్త్, కెజిబివి, ఉపాధి హామీ అన్ని ప్రభుత్వపథకాలు, ప్రభుత్వ సొసైటీలు, టిటిడి తదితర ధార్మికసంస్థలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, ఆప్కాస్ ఉద్యోగులకు, మినిమం టైంస్కేల్ అమలు కోసం కోటి ఆశలతో ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం జీవో నెం.2 విడుదల, ఔట్సోర్సింగ్ కార్పొరేషన్ రద్దుపై లీకులు, నియామకాల బాధ్యత ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పజెప్పడం వంటి నిర్ణయాలు చిరుద్యోగులను అభద్రతాభావంలోకి నెట్టేస్తున్నాయి. ప్రభుత్వాలు మారుతున్నా కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత లేకుండా పని చేయించుకుంటున్న ఈ విధానాలు మార్పు కోసం ఇంకెన్నేళ్లు ఎదురు చూడాలని మదన పడుతున్నారు. సమాన పనికి సమాన వేతనం కల్పించాలన్న సుప్రీం కోర్టు తీర్పును ప్రభుత్వం గౌరవించకుండా, ఉద్యోగుల మధ్య వేతన అసమానతలను పెంచే విధంగా ఈ జీవో నంబర్ 2 ను అమలు చేస్తుంది. ఈ జిఒ కేవలం ఉద్యోగుల ఆర్థిక భద్రతను దెబ్బతీయడమే కాకుండా, రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను ఉల్లంఘిస్తుంది.



బి.కాంతారావు

జీవో నెంబర్ 2 రద్దు చేసి అందరికీ ఎంటీఎస్ అమలు చేయాలి

జీవో నెంబర్ 2తో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలల లోపు కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు షాక్ ఇచ్చింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంలో నడుస్తున్న పథకాలలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు, స్థానిక సంస్థల్లో పని చేస్తున్న ఉద్యోగులకు, ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు మినిమమ్ ఆఫ్ టైం స్కేల్ వర్తింప చేయకూడదని, ప్రభుత్వ శాఖల్లో మంజూరైన ఖాళీ పోస్టుల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు మాత్రమే అర్హులని తేది 06.01.2025న జీవో 2 విడుదల చేసింది. ఈ జీవో రాజ్యాంగం కల్పించిన సమానత్వ హక్కుకు విరుద్ధం. కృత్రిమ ప్రాతిపదికలు సృష్టించి, శ్రమకు తగ్గ వేతనం ఇవ్వకుండా ఉండడమే ఈ జీఓ ఉద్దేశం. ఇతర రాష్ట్రాలతో పోల్చితే, ఆంధ్రప్రదేశ్‌లో కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు సరైన వేతన నిబంధనలు లేకపోవడం బాధాకరం. ప్రభుత్వం ఆదర్శ యజమానిగా వ్యవహరించి, ఉద్యోగుల హక్కులను పరిరక్షించాలి.. ప్రభుత్వం తక్షణమే జీవో 2ను సవరించి, ఉద్యోగులకు మినిమం టైంస్కేల్ అమలు చేయాలి.



రెగ్యులర్ ప్రక్రియను కొనసాగించాలి

ఆంధ్రప్రదేశ్ రెగ్యులరైజేషన్ ఆఫ్ సర్వీసెస్ ఆఫ్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యాక్ట్, 2023 (చట్టం 30/2023) అమలులో ఉంది. జిఓ నెంబర్ 114 తేది 21.10.2023 ప్రకారం, 02.06.2014 లోపు నియమితులై, 20.10.2023 వరకు సర్వీసులో కొనసాగుతున్న సుమారు 10117 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులు రెగ్యులరైజేషన్‌కు అర్హులు అని గత వైసిపి ప్రభుత్వం తేల్చింది. ఆరోగ్య శాఖలో 2543 మంది రెగ్యులరైజ్ అయ్యారు. మిగతా ప్రక్రియ ఆగింది. ఈ ఏడాది కాలంలో ఎలాంటి ముందడుగూ పడలేదు. ఈ రెగ్యులర్ పక్రియ ను కొనసాగించాలి. ప్రస్తుత చట్టానికి సవరణలు చేసి ఐదేళ్ళ సర్వీసు పూర్తి చేసిన అందరినీ రెగ్యులర్ చేయడానికి మార్పులు చేయాలి. డిఎస్సి నియామకాల్లో ప్రస్తుతం పనిచేస్తున్న కాంట్రాక్టు టీచర్స్, అధ్యాపకులకు వెయిటేజీ ఇవ్వాలని కూటమి సర్కార్‌కు అనేక వినతులు చేసినా సానుకూల నిర్ణయం రాలేదు. తమిళనాడు, మధ్యప్రదేశ్, ఒడిషా రాష్ట్రాలు ఇప్పటికే కాంట్రాక్టు ఉద్యోగులకు వెయిటేజీ విధానాన్ని అమలు చేస్తున్నాయి. మధ్యప్రదేశ్ రాష్ట్రంలో గెస్ట్ టీచర్లకు రెగ్యులర్ టీచర్ నియామకాల్లో 40% వెయిటేజీ విధానాన్ని తీసుకువచ్చారు. తెలంగాణ, కర్ణాటక కాంట్రాక్ట్ ఉద్యోగులకు వయస్సు సడలింపు చేసి మరి, అనుభవ వెయిటేజీ ఇచ్చాయి.

సంక్షేమ పథకాలు అమలు చేయాలి

కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు సంక్షేమ పథకాలు అమలు చేస్తామని కూటమి ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చినప్పటికీ ఈ ఏడాది కాలంలో ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. ఇటీవల ఎన్టీఆర్ భరోసా పెన్షన్, నూతన రేషన్ కార్డులు, తల్లికి వందనం పథకం అమలు చేసినప్పటికీ చిరుద్యోగులకు వర్తింప చేయలేదు. నిత్యావసర ధరలు, రవాణా ఖర్చులు, వైద్య ఖర్చులు, ఇంటి అద్దె విపరీతంగా పెరగడంతో ఔట్సోర్సింగ్ ఉద్యోగుల జీతాలు సరిపోవడం లేదు. నెలవారీ ఖర్చుల కోసం అప్పులపాలవుతున్నారు.

మంత్రుల కమిటీ నిర్ణయం త్వరగా ప్రకటించాలి.

ప్రభుత్వాలు ఏర్పడినప్పుడల్లా మంత్రుల కమిటీల ఏర్పాటు సహజం . ఔట్సోర్సింగ్ విధానంలో ఉద్యోగుల నియామకాన్ని సమీక్షించేందుకు, ఉద్యోగుల సంక్షేమంపై సిఫార్సులు చేసేందుకు మంత్రులు పొంగూరు నారాయణ, నారా లోకేశ్, పయ్యావుల కేశవ్ సభ్యులుగా మంత్రుల కమిటీ ఏర్పడి మూడు నెలలైంది. . ఔట్సోర్సింగ్ నియామకాల్లో రాజకీయ ప్రమేయం పూర్తిగా తగ్గాలి, మెరిట్, రూల్ అఫ్ రిజర్వేషన్ అమలు జరగాలి. ఆన్లైన్ ద్వారా అప్లికేషను స్వీకరించి, ప్రభుత్వ శాఖల ద్వారా నియామకాలు చేపట్టాలి. ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం, పిఎఫ్, ఆరోగ్య భద్రత, ఉద్యోగ భద్రత కల్పించాలి. మంత్రుల కమిటి కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ ఉద్యోగ సంఘాలతో కలసి చర్చించాలి. ఔట్సోర్సింగ్ ఉద్యోగుల ప్రయోజనాలు అనుకూల నిర్ణయాలు త్వరగా ప్రకటించాలి.

పని గంటలు పెంపు తగదు.

అభివృద్ధి చెందుతున్న దేశాలు నిరుద్యోగాన్ని తగ్గించేందుకు పని గంటలు తగ్గిస్తూ, నూతన నియామకాలు చేపడుతూ, కార్మిక హక్కులను పరిరక్షించే నూతన విధానాలు అమలుచేస్తున్న తరుణంలో, దీనికి విభిన్నంగా కేంద్ర బిజెపి ప్రభుత్వం తీసుకువచ్చిన కార్మిక చట్టాల సవరణలను అనుసరించి, ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం కూటమి ప్రభుత్వం కూడా పని గంటలు పెంపు, కార్మికుల విరామాల్లో కోత, మహిళలకు రాత్రిపూట పని తదితర మార్పులు చేసింది. ఇవన్నీ యాజమాన్యాల వ్యాపార సౌలభ్యం కోసం తీసుకొచ్చిన చర్యలు. అసంఘటిత రంగాలలో దాదాపు 50 లక్షల కార్మికుల హక్కులను, ఆరోగ్యాన్ని, జీవన ప్రమాణాలను ఇవి దెబ్బతీస్తాయి. ఇప్పటికే కెజిబివి హాస్టళ్లలో అవుట్ సోర్సింగ్ మహిళా నాన్ టీచింగ్ సిబ్బందిని రోజుకు 12 గంటల పని చేయించడం అమానవీయం.

ఐక్యతా పోరాటంతోనే పరిష్కారం

గత 25 సంవత్సరాల నుండి ప్రభుత్వాలు మారుతున్న కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు మెరుగైన జీవనం లభించడం లేదు. పార్టీలు మారుతున్న వారు అనుసరిస్తున్న ఆర్థిక విధానాలు ఒక్కటే. తక్కువ జీతాలతోనే పనిచేయించుకొనే విధానాన్నే కొనసాగిస్తున్నాయి. ప్రభుత్వం తక్షణమే జీవో నెంబర్ 2ను రద్దు చేయడం, రెగ్యులరైజేషన్, వెయిటేజీ, సంక్షేమ పథకాలు, మరియు రిటైర్మెంట్ ప్రయోజనాలను కల్పించడం వంటి చర్యలు తీసుకోవాలి. నియామకాల బాధ్యత ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పజెప్పడం వంటి నిర్ణయాల వల్ల తీవ్రమైన నష్టం జరుగుతోంది. రాజ్యాంగం కల్పించిన సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగ భద్రత కోసం కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ప్రభుత్వం పై ఒత్తిడి పెంచేందుకు ఐక్యంగా ఉద్యమించాలి.. ఐక్య పోరాటాలు నిర్మించాలి.

రాష్ట్ర కో ఛైర్మన్
ఎపి స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్, టీచర్స్ అండ్ వర్కర్స్ జెఎసి

స్పందన

ఢిల్లీ హైకోర్టు తీర్పు 'గోడి మీడియా'కు చెంపపెట్టు

విదేశీయులకు ఆశ్రయం కల్పించారని, ఉద్దేశ్యపూర్వకంగా కరోనా వ్యాప్తి చేశారనే ఆరోపణలతో 70 మంది తబ్లీగీ జమాత్ సభ్యులపై ఢిల్లీ పోలీసులు నమోదు చేసిన ఎఫ్‌ఐఆర్‌లు, దాఖలు చేసిన ఛార్జిషీట్‌లను రద్దు చేస్తూ ఇటీవల ఢిల్లీ హైకోర్టు తీర్పు ఇచ్చింది. పోలీసులు చేసిన నేరారోపణలపై ఎలాంటి ఆధారాలూ లేవని స్పష్టం చేసింది. అందరినీ నిర్దోషులుగా ప్రకటించడమే కాకుండా.. 'వారు లాక్ డౌన్ కారణంగా మర్కజ్ లో చిక్కుకున్న నిస్సహాయులు' అని వ్యాఖ్యానించింది. 2020లో కోవిడ్-19 మహమ్మారి తీవ్ర రూపం దాల్చిన సమయంలో... ఢిల్లీలోని నిజాముద్దీన్ మర్కజ్‌లో జరిగిన సమావేశాన్ని కారణంగా చూపుతూ.. తబ్లీగీ జమాత్ పై పెద్ద ఎత్తున దుష్ప్రచారం చేసిన మీడియా.. ఢిల్లీ హైకోర్టు తీర్పు వార్తను మాత్రం తొక్కిపెట్టింది. జడ్జిమెంట్ వార్తను కొన్ని సెకన్లకు మాత్రమే పరిమితం చేసింది. నాడు ముస్లింలపై విషం చిమ్మిన చానెల్స్.. ఇప్పుడు కోర్టు తీర్పును మాత్రం బ్రేకింగ్ న్యూస్‌గా ప్రసారం చేయడానికి భయపడ్డాయి.

లాక్‌డౌన్‌కు ముందే సమావేశం

కోవిడ్ మహ్మమారి ఇంకా మన దేశంలో అంతగా ప్రభావం చూపని నేపథ్యంలో.. కేంద్ర ప్రభుత్వం 200 మందికి మించి సమావేశాలపై మార్చి 13న నిషేధం విధించింది. ఆ తర్వాత మత సమావేశాలను 50 మందికి పరిమితం చేస్తూ మార్చి 16న ఆదేశాలు జారీ చేసింది. మార్చి 24న దేశవ్యాప్త లాక్‌డౌన్ విధించింది. అయితే అంతకుముందే ఢిల్లీలోని నిజాముద్దీన్ మర్కజ్ లో అంతర్జాతీయ మత సమావేశానికి సంబంధించి షెడ్యూల్ ఖరారైంది. మార్చి 13, 14, 15 తేదీల్లో ఈ సమావేశాన్ని నిర్వహించారు. అంటే కొవిడ్-19 మహమ్మారి గురించి పూర్తి అవగాహన లేని సమయంలో, లాక్‌డౌన్ ప్రకటనకు ముందే ఈ సమావేశం పూర్తయింది. ఒక్కసారిగా లాక్ డౌన్ ప్రకటించడంతో మర్కజ్ లో ఉన్న వందలాది మంది విదేశీయులు భారత్‌లోనే చిక్కుకుపోయారు.

నిరాధార ఆరోపణలన్న ఢిల్లీ హై కోర్టు..

తబ్లీగీ జమాత్ కు చెందిన 70 మంది భారత పౌరులపై పోలీసులు చేసిన ఆరోపణలు నిరాధారమైనవని ఢిల్లీ హై కోర్టు స్పష్టమైన తీర్పు చెప్పింది. వారికి కోవిడ్ పాజిటివ్ ఉన్నదని, లేదా 2020 మార్చి 24 తర్వాత వారు మర్కజ్ నుంచి బయటకు వెళ్లారని, కొవిడ్ వ్యాప్తి చేశారని ఏ ఒక్క ఆధారమూ లేదని జడ్జిమెంట్ లో పేర్కొంది. లాక్ డౌన్ విధించినప్పుడు వారు ఎక్కడికి వెళ్లగలుగుతారని ప్రశ్నించింది. వారంతా లాక్‌డౌన్ కారణంగా మర్కజ్‌లో చిక్కుకుపోయిన నిస్సహాయ వ్యక్తులని వ్యాఖ్యానించింది. మర్కజ్‌లో నివసించడం, విదేశీయులకు ఆశ్రయం కల్పించడం నిషేధ ఆదేశాల ఉల్లంఘన కాదని స్పష్టం చేసింది. ఎఫ్‌ఐఆర్‌లు, ఛార్జిషీట్లను కొనసాగించడం న్యాయ ప్రక్రియ దుర్వినియోగానికి సమానమని అభిప్రాయపడుతూ వాటిని రద్దు చేసింది.

చేసిన తప్పునకు క్షమాపణలు అవసరమే..

తబ్లీగీ జమాత్ ఘటనపై చేసిన రిపోర్టింగ్.. భారత మీడియా బాధ్యతారాహిత్యాన్ని, సంక్షోభ సమయంలో ఒక నిర్దిష్ట సమాజాన్ని లక్ష్యంగా చేసుకునే విధానాన్ని బహిర్గతం చేసింది. కానీ అప్పట్లో ద్వేషాన్ని రెచ్చగొట్టిన మీడియా.. ఢిల్లీ హై కోర్టు తీర్పు తర్వాత మౌనంగా ఉండడం సరికాదు. టీఆర్పీ కోసం, ఒక పార్టీ రాజకీయ లబ్ధి కోసం ముస్లింలపై దుష్ప్రచారం చేసిన మీడియా.. ఢిల్లీ హైకోర్టు తీర్పు తర్వాతైనా క్షమాపణలు చెప్పాల్సిన అవసరమున్నది. ఇప్పుడైనా మీడియా తన తప్పిదాలను సరిదిద్దుకోవాలి. ఇది మీడియాపై విశ్వసనీయతను మరింత పెంచుతుంది.

-ఫిరోజ్ ఖాన్, సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్ట్,
9640466464

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ : editpageps @gmail.com

స్వల్పంగా పెరిగిన గోదావరి నీటిమట్టం

- పోలవరం నుండి 1,10,568 క్యూసెక్కుల నీరు దిగువకు

పోలవరం: ఎగువ రాష్ట్రా ల్లో, ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీవర్షాలకు పోలవరంలో గోదావరి నీటిమట్టం సోమవారం సాయంత్రానికి స్వల్పంగా పెరిగింది. ప్రాజెక్టులోకి వస్తున్న 1,10,568 క్యూసెక్కుల జలాలను స్పిల్వే 48 గేట్ల నుండి దిగువకు విడుదల చేస్తున్నట్లు జలవనరులశాఖ అధికారులు తెలిపారు. స్పిల్వే ఎగువన 27.200 మీటర్లు, స్పిల్వే దిగువన 17.250 మీటర్లు, ఎగువ కాపర్ డ్యామ్ ఎగువన 27.300 మీటర్లు, దిగువ కాపర్ డ్యామ్ దిగువన 16.310 మీటర్లు, ఎగువ, దిగువ కాపర్ డ్యామ్‌ల మధ్య 15.890 మీటర్లు నీటిమట్టం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

నేడు టిటిడి పాలకమండలి సమావేశం

ప్రజాశక్తి -తిరుమల

చైర్మన్ బిఆర్ నాయుడు అధ్యక్షతన అన్నమయ్య భవనంలో ఉదయం 10.30 గంటలకు పాలక మండలి సమావేశం జరగనుంది. నలభై ఐదుకు పైగా అజెండా అంశాలపై చర్చించి తీర్మానాలు చేయనున్నట్టు సమాచారం. టిటిడిలోని కాంట్రాక్ట్ డ్రైవర్లు రెగ్యులరైజ్ అంశంపై చర్చించి...తీర్మానం చేయనున్నారు. తిరుమలలోని పాత భవనాలను నూతన డోనర్ స్కీమ్ కింద పునర్నిర్మించే ఆంశంపై చర్చించనున్నారు. వేదపారాయణదారులకు నిరుద్యోగి భృతి కింద నెలకు మూడు వేలు అందజేయాలని తీర్మానంతో పాటు పలు కీలకాంశాలపై చర్చించనున్నట్లు తెలుస్తోంది.

పెద్దాపురంలో హైటెక్ వ్యభిచారం

- నిర్వాహకులకు పోలీసుల అండదండలు.?

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

కాకినాడ జిల్లా పెద్దాపురంలో హైటెక్ వ్యభిచారం జరుగుతుంది. స్థానిక పోలీసులు, వ్యభిచార ముఠా నాయకులు కలిసి ఈ దందా కొనసాగిస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. పెద్దాపురంలో దర్గా సెంటర్ కేంద్రంగా ఈ వ్యవహారం పెద్ద ఎత్తున నడుస్తుంది. ఒక బాధితురాలి ఉదంతంతో ఈ వ్యవహారం బయటకు పొక్కింది. పెట్రోలు బంకులో పని చేస్తున్న తనకు పెద్దాపురం దర్గా సెంటర్ ప్రాంతానికి చెందిన గొల్లవిల్లి భారతి పరిచయమైందని, తన ఇంట్లో పనిమనిషిగా చేస్తే నెలకు రూ.15 వేలు జీతం ఇస్తానని చెప్పి పనిలో పెట్టుకుందని బాధితురాలు తెలిపారు. నెల తర్వాత వ్యభిచారం చేయమని బలవంతం చేసిందన్నారు. ఒప్పుకోకపోవడంతో కొంతమంది వ్యక్తులతో చిత్రహింసలకు గురి చేసి బలవంతంగా వ్యభిచారం చేయించిందని తెలిపింది. వ్యభిచారంలోకి దిగిన 5వ నెలలోనే తాను గర్భవతిని అయ్యాయని, 8వ నెల వచ్చినా సరే వ్యభిచారం చేయిస్తూనే ఉందని ఆవేదన వెలిబుచ్చింది. ఆడ బిడ్డ పుట్టిన తరువాత తన బిడ్డను భారతి తీసుకెళ్లిపోయిందని, ఖాళీ చెక్కులపై సంతకాలు చేయించుకుని వ్యభిచారం చేయకపోతే తన బిడ్డను చంపేస్తానని చెప్పి బయపెట్టేదని వాపోయారు. ఒక రోజు భారతికి జ్వరం రాగా ఆమెను హాస్పిటల్‌కు తీసుకొని వెళ్లిన సమయంలో తాను పారిపోయి ఎస్‌పికి ఫిర్యాదు చేశానని తెలిపింది. దీంతో తన కుమార్తెను రక్షించి అప్పగించారని, కానీ ఖాళీ చెక్కులు ఆధార్, పాన్ కార్డు, బ్యాంకు పాస్ పుస్తకాలు ఇవ్వలేదన్నారు. వాటిని అడ్డుపెట్టుకుని తనను బెదిరిస్తున్నట్లు తెలిపారు. వారి నుంచి తనకు ప్రాణహాని ఉందని, తనకు రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. తనలాంటి వారు చాలా మంది ఈ కూపంలో ఇరుక్కుపోయారని, వ్యభిచార గృహం నిర్వాహకులు భారతికి కొందరు పోలీసులు పూర్తి స్థాయిలో సహకారం అందిస్తున్నారని తెలిపారు. దీనికి సంబంధించిన కానిస్టేబుల్‌తో భారతితో దిగిన ఫొటోలను ఆమె చూపించారు. భయపెట్టి, బెదిరించి, చిత్రహింసలు పెట్టి నాలుగేళ్ల బలవంతంగా వ్యభిచారం చేయించారని, తనకు న్యాయం చేయాలని కోరుతూ అర్జీలు పెట్టుకున్నా స్పందించడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

41వ కాంటూర్‌లో కలపండి

- పోలవరం నిర్వాసితుల ధర్నా

ప్రజాశక్తి - వేలేరుపాడు రూరల్

పోలవరం ప్రాజెక్టు కోసం సర్వం కోల్పోతున్న నిర్వాసితులకు న్యాయం చేయాలని కోరుతూ అఖిలపక్షం ఆధ్వర్యాన సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. తొలుత అంబేద్కర్ సెంటర్ నుండి తహశీల్దార్ కార్యాలయం వరకు నిర్వాసితులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నానుద్దేశించి నేతలు మాట్లాడారు. ముంపు గ్రామాల సర్వే చేసినప్పుడు అవకతవకలుగా చేశారని, గోదావరి వరద భద్రాచలం వద్ద 40 అడుగులు వస్తే ముంపునకు గురవుతున్న సుద్ధగుంపు, తాట్కూర్‌గొమ్ము కాలనీ, నడిమిగొమ్ము, ఎర్రబోరు, పాతపూచిరాల, మద్దిగట్ల, పడమటిమెట్ట, చాగరపల్లి, కొర్రాజులగూడెం, గీగావారి గుంపు తదితర పల్లపు గ్రామాలు 45 కాంటూరు పరిధిలో ఉన్నాయన్నారు. ఆ గ్రామాలను 41 కాంటూర్లో కలిపి వెంటనే నష్టపరిహారం అందించాలన్నారు. ప్రతియేటా గోదావరి వరదల వల్ల ఆయా గ్రామాలు తీవ్రంగా నష్టపోతున్నాయని తెలిపారు. ఆ గ్రామాలు ప్రస్తుతం 45 కాంటూర్ పరిధిలో ఉన్నాయని, వెంటనే వాటిని మార్చాలని కోరారు. వరదల సమయంలో ఉండేందుకు చోటులేక, ఉపాధి లేక నరకయాతన అనుభవిస్తున్నామని తెలిపారు. మండలం మొత్తాన్ని యూనిట్‌గా తీసుకుని పునరావాసం కల్పించడంతోపాటు ప్యాకేజీ అందించాలని, మిగులు భూములను ప్రభుత్వం తీసుకొని నష్టపరిహారం రైతులకు అందించాలని కోరారు. అర్హులైన ప్రతి కుటుంబానికీ న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. గతంలో గిరిజనులకు భూమికి భూమి ఇచ్చిన అనేకచోట్ల ఆ భూయజమానులతో గొడవలు జరుగుతున్నాయని, వాటిని సరి చేసి నిర్వాసితులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రాజెక్టు కోసం సర్వే చేపట్టిన 2017లో పెట్టిన కటాఫ్ తేదీతో సంబంధం లేకుండా తరలించే నాటికి 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులకు ప్యాకేజీ ఇవ్వాలని, పునరావాస కాలనీల్లో ఇళ్ల కేటాయింపునకు సరైన విధానం అమలు చేయాలని కోరారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ కార్యాలయంలో అందించారు.

స్వీడన్ బ్లేకింగ్ వర్శిటీ పరిధిలో 16 మందికి అడ్మిషన్లు

అనంతపురం : అనంతపురం జెఎన్‌టియు విశ్వవిద్యాలయం, బ్లెకింగ్ వర్శిటి (స్వీడన్) సంయుక్తంగా కలిసి ఇంటి గ్రేటేడ్ కోర్సులను అమలు చేస్తున్న కోర్సులకు సోమవారం 16 మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందినట్లు ఉపకులపతి హెచ్.సుదర్శనరావు తెలిపారు. ఈమేరకు అడ్మిషన్ల పత్రాలను రిజస్ట్రార్ ఎస్.కృష్ణయ్యతో కలిసి విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ ఫారిన్ అఫైర్స్, ఆలూమిని పి.సుజాత, అడ్మిషన్ డైరెక్టర్ ఎ.సురేష్‌బాబు, స్వీడన్ యూనివర్సిటీ అధికారులు వేల్పుల గురుదత్త, ఫణిశేఖర్, సునీల్, విద్యార్థులు పాల్గొన్నారు.

తమిళనాడు

సిఎం స్టాలిన్‌కు అస్వస్థత

చెన్నై : తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ అస్వస్థతకు గురయ్యారు. చికిత్స కోసం కుటుంబసభ్యులు ఆయనను అన్నా సలైలోని గ్రీమ్స్ రోడ్డులోని అపోలో ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వైద్యులు ఆ ఆసుపత్రిలో స్టాలిన్‌కు చికిత్సను అందిస్తున్నారు. 'సోమవారం ఉదయం మార్నింగ్ వాక్ చేస్తున్న సమయంలో సిఎంకు కళ్లు తిరగడంతో ఆసుపత్రికి తీసుకొచ్చారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగానే ఉంది. వైద్యులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. అవసరమైన అన్ని పరీక్షలు చేస్తున్నాం' అని అపోలో ఆసుపత్రి మెడికల్ సర్వీసెస్ డైరెక్టర్ డాక్టర్ అనీల్ బీజీ తెలిపారు. ఈ మేరకు సిఎం ఆరోగ్యంపై హెల్త్ బులెటిన్ విడుదల చేశారు.

అలాస్కా ఎయిర్‌లైన్స్‌లో సాంకేతిక సమస్య

- ఆగిన వందల విమానాలు

అమెరికా : అమెరికాకు చెందిన అలాస్కా ఎయిర్ లైన్స్‌లో సాంకేతిక సమస్య తలెత్తడంతో వందల విమానాలను ల్యాండ్ చేయాల్సి వచ్చింది. ఆదివారం రాత్రి 8 గంటల సమయంలో తొలిసారి ఐటీ సిస్టమ్స్‌లో ఇబ్బందులు ఎదురయ్యాయి. దీంతో ఓ పద్ధతి ప్రకారం అలాస్కా, హారిజోన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానాలను ల్యాండ్ చేసినట్లు ఆ సంస్థ ఓ ప్రకటనలో వెల్లడించింది. సియాటెల్ కేంద్రంగా ఈ ఎయిర్‌లైన్స్ సాంకేతిక సమస్య ప్రభావం సోమవారం సాయంత్రం వరకు ఉండవచ్చునని తెలిపింది.

అంతకుమించి సంస్థ సమాచారం బహిర్గతం చేయలేదు. ఈ ఘటనపై అమెరికా ఎఫ్ఏఏ తక్షణమే స్పందించలేదు. ఈ ఎయిర్‌లైన్స్ నిర్ణయంతో వివిధ గమ్యస్థానాలకు చేరాల్సిన విమానాలు నిలిచిపోయాయి. అలాస్కా గ్రూప్ 238 బోయింగ్ 737లు, 87 ఎంబ్రార్ 175 విమానాలు నిర్వహిస్తోంది. ఈ అంతరాయానికి సదరు ఎయిర్‌లైన్స్ ప్రయాణికులకు క్షమాపణలు చెప్పింది. దాదాపు సంవత్సరం క్రితం ఇదే విమానయాన సంస్థ కొత్తగా కొనుగోలు చేసిన బోయింగ్ 737 మ్యాక్స్ 9 విమానం గాల్లో ఉండగానే డోర్ ఊడిపోయింది. నాడు 171 మంది ప్రయాణికులు, ఆరుగురు సిబ్బంది సురక్షితంగా ల్యాండ్ కావడంతో పెను ప్రమాదం తప్పింది. ఆ తర్వాత మొత్తం 737 మ్యాక్స్ విమానాలను పూర్తిగా పక్కనపెట్టి.. తనిఖీలు నిర్వహించింది. గత నెల దీనిపై నివేదిక వెలువడింది. అందులో బోయింగ్ తన సిబ్బందికి తగినంత శిక్షణ ఇవ్వనట్లు వెల్లడించింది.

దేశ ఆర్థికాభివృద్ధిలో రాష్ట్ర వాటా ఏదీ!

- 12 రంగాలకు రెండింటిలోనే డబుల్ డిజిట్
- పారిశ్రామిక రంగంలో అత్యల్పం
- తాజా టాస్క్‌ఫోర్స్ నివేదికలో వెల్లడి



ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

2047 నాటికి భారీగా వృద్ధి లక్ష్యాన్ని నిర్దేశించుకున్న రాష్ట్రం... వాస్తవ పరిస్థితికి మాత్రం భిన్నంగా ఉన్నట్లు కనిపిస్తోంది. జాతీయ అభివృద్ధిలో రాష్ట్ర వాటాను పరిశీలిస్తే చాలా స్వల్పంగానే ఉంది. 12 రంగాలపై తయారుచేసిన నివేదికలో రెండు రంగాల్లోనే పదికన్నా ఎక్కువ వాటా రాష్ట్రానిది ఉండగా, ఇతర రాష్ట్రాల వాటా ఆంధ్రప్రదేశ్‌కు అందనంత దూరంలో ఉన్నట్లు తేలింది. ఎక్కువ పశ్చిమ రాష్ట్రాలు దేశ అభివృద్ధిలో వాటా పంచుకుంటున్నట్లు ఈ నివేదికలో తేల్చారు.

రాష్ట్రాల్లో జరిగే అభివృద్ధి కారణంగానే దేశాభివృద్ధి దేశ జిఎస్‌డిపిని గణిస్తారు. అందుకే ప్రతి రాష్ట్రం తమ వృద్ధిని పెంచుకునేందుకే ప్రయత్నాలు చేస్తాయి. తాజాగా వెలుగుచూసిన ఒక నివేదికలో దేశాభివృద్ధిలో రాష్ట్ర వాటా నామమాత్రంగానే ఉన్నట్లు తేలింది. అది కూడా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన కొంతమంది ప్రయివేటు నిపుణులతో ఏర్పడిన టాస్క్‌ఫోర్స్‌లోనే ఈ విషయాలు వెలుగుచూడడం గమనార్హం. పరిశ్రమలు, ఫార్మా, మెటల్స్, ఆహార ఉత్పత్తులు, పానీయాలు, వస్త్ర, రసాయనాలు, విద్యుత్ పరికరాలు, వాహనాలు, ఎలక్ట్రానిక్ పరికరాలు వంటి 12 రంగాల్లో రాష్ట్రం, ఇతర రాష్ట్రాల పరిస్థితిని ఈ నివేదికలో పొందుపరిచారు.

నాన్ మెటాలిక్ ఖనిజ ఉత్పత్తుల్లో అత్యధికంగా జాతీయాభివృద్ధిలో 10.5 శాతం వాటాను రాష్ట్రం నమోదుచేసింది. ఈ రంగంలో గుజరాత్ 18 శాతం, రాజస్థాన్ 13.1 శాతంతో తొలి రెండు స్థానాల్లో ఉన్నాయి. ఫార్మా రంగంలో రాష్ట్రం 10.2 శాతం వాటా నమోదుచేయగా, ఈ రంగంలో కూడా గుజరాత్ తొలి స్థానంలో ఉండగా, 15 శాతం వాటాతో తెలంగాణ రెండో స్థానంలో కనిపిస్తోంది.

వస్త్రాల్లో వెనుకంజ

పట్టు వస్త్రాలకు ప్రసిద్ధి చెందిన రాష్ట్రమైనప్పటికీ ఆ రంగంలో వాటా అతి తక్కువగా నమోదుకావడం విశేషం. జాతీయ వృద్ధి వాటాలో రాష్ట్రానికి కేవలం 2.5 శాతమే కావడం గమనార్హం. ఈ రంగంలో గుజరాత్, తమిళనాడు 24 శాతంతో తొలి రెండు స్థానాల్లో ఉన్నాయి. మెటల్, పానీయాలు, రసాయనాలు, ఎలక్ట్రానిక్స్, రిఫైన్డ్ పెట్రోలియం ఉత్పత్తులు, కంప్యూటర్, ఎలక్ట్రానిక్ పరికరాలు, పారిశ్రామిక రంగాల్లో ఐదు కన్నా తక్కువ వాటా కలిగి ఉండడం విశేషం.

పరిశ్రమల్లో తక్కువ వాటా

కీలకమైన పారిశ్రామిక రంగంలో రాష్ట్ర వాటా 4.2 శాతంగా ఉండగా, గుజరాత్, మహారాష్ట్రలే ఆధిపత్యం కొనసాగిస్తున్నాయి. ఖనిజ రంగంలో ఐదు శాతం వాటా కనిపిస్తుండగా, ఒడిషా 15 శాతంతో అగ్రస్థానంలో ఉంది. బెవరేజెస్‌కు సంబంధించి రాష్ట్ర వాటా 4.7 శాతంగా ఉండగా, ఉత్తరప్రదేశ్ 18.6 శాతంతో మెరుగ్గా ఉంది. కంప్యూటర్, ఎలక్ట్రానిక్ పరికరాల విభాగంలో రాష్ట్ర వాటా 4.6 శాతంగా ఉండగా, ఉత్తరప్రదేశ్ ఏకంగా 32.6 శాతంతో అగ్రస్థానంలో ఉండడం విశేషం.

దక్షిణాదిలో ఒకే రాష్ట్రం

మొత్తం మీద ఈ 12 రంగాలకు సంబంధించిన వివరాలు చూస్తే ఆరు రంగాల్లో గుజరాత్, ఉత్తరప్రదేశ్ మూడు రంగాల్లో తొలి స్థానంలో ఉన్నాయి. దక్షిణాది రాష్ట్రాల్లో ఒక్క తమిళనాడు మాత్రమే ఒక రంగంలో అగ్రస్థానంలో నిలవడం విశేషం. రెండో స్థానానికి సంబంధించి మరో తెలుగు రాష్ట్రమైన తెలంగాణ ఒక రంగంలో వాటా కలిగి ఉండగా, తమిళనాడు రెండు స్థానాల్లో వాటా కలిగి ఉంది.



'గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీ - అమరావతి'

- డిక్లరేషన్ విడుదల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీ - అమరావతి డిక్లరేషన్‌ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సచివాలయంలో సోమవారం విడుదల చేశారు. ప్రధాన కార్యదర్శి విజయానంద్, నెడ్ క్యాప్ ఎమ్‌డి కమలాకర్‌బాబు సమక్షంలో విడుదల చేసిన ఈ డిక్లరేషన్‌లో 2030 నాటికి రాష్ట్రాన్ని గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా మార్చేందుకు అవసరమైన కార్యాచరణను పేర్కొన్నారు. ఇటీవల అమరావతిలో గ్రీన్ హైడ్రోజన్‌పై రెండు రోజులపాటు సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో వివిధ సంస్థల సిఇఒలు, సిఒఒలు, ఎమ్‌డిలు, నిపుణులతో చర్చించిన పలు అంశాల ఆధారంగా ఈ డిక్లరేషన్‌ను ప్రభుత్వం రూపొందించింది. దేశంలో స్వచ్ఛమైన ఇంధనాల ఉత్పత్తి, గ్రీన్ హైడ్రోజన్ తయారీ విధి విధానాలు రూపొందించేలా ఈ డిక్లరేషన్‌ను తీర్చిదిద్దినట్లు, 2027 నాటికి 2 గిగావాట్లు, 2029 నాటికి 5 గిగావాట్లు ఎలక్ట్రోలైజర్ల తయారీ లక్ష్యంగా డిక్లరేషన్‌లో పేర్కొన్నారు. 2029 నాటికి ఏడాదికి 1.5 మిలియన్ మెట్రిక్ టన్నుల గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి లక్ష్యంగా నిర్ణయించారు. కిలో హైడ్రోజన్ గ్యాస్ రూ.460 నుంచి 160కి తగ్గించేలా పరిశోధనలు, కార్యాచరణ రూపొందించాలని పేర్కొన్నారు. 2029 నాటికి 25 గిగావాట్ల రెన్యువబుల్ ఎనర్జీ పంపిణీకి మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. గ్రీన్ ఎనర్జీ కారిడార్‌గా తీర్చిదిద్దాలని డిక్లరేషన్‌లో నిర్ణయించారు. ఆవిష్కరణ పరిశోధనల కోసం రూ.500 కోట్లు వ్యయం చేయాలని, 50 స్టార్టప్‌లకు ప్రోత్సాహం కల్పించాలని డిక్లరేషన్‌లో ప్రకటించారు.

అంతర్జాతీయ డిమాండ్ తీర్చే విధంగా ఎలక్ట్రానిక్ పరికరాల ఉత్పత్తి

- రాయలసీమలో ఇప్పటికే మౌలిక సదుపాయాలు
- సమీక్షలో సిఎం చంద్రబాబునాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అంతర్జాతీయ స్థాయిలో ఎలక్ట్రానిక్స్ పరికరాల డిమాండ్‌ను తీర్చేందుకు వీలుగా భారీ స్థాయిలో ఈ పరికరాలు ఉత్పత్తి చేసేలా కార్యాచరణ చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. సచివాలయంలో 'ఎలక్ట్రానిక్స్ కాంపొనెంట్స్ మాన్యుఫ్యాక్టరింగ్ పాలసీ 4.0'పై సోమవారం సమీక్షా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ.. రాయలసీమ శ్రీ సిటీ, హిందుపూర్, కొప్పర్తి వంటి చోట్ల ఎలక్ట్రానిక్స్ పరికరాల ఉత్పత్తికి విస్తృతమైన అవకాశాలు ఉన్నాయని తెలిపారు. 2025-30ల మధ్య ఎలక్ట్రానిక్స్ పరిశ్రమలకు సంబంధించి పెట్టుబడులను ఆకర్షించడమే నూతన విధానం లక్ష్యమన్నారు. ఎలక్ట్రానిక్స్ పరికరాల దిగుమతులు తగ్గించటం, దేశీయంగా ఉత్పత్తి పెంపు, ఎగుమతులే లక్ష్యంగా నూతన విధానానికి రూపకల్పన చేసినట్లు, గత ఏడాది దేశంలో 70 బిలియన్ డాలర్ల విలువైన ఎలక్ట్రానిక్స్ సర్క్యూట్ బోర్డులు దిగుమతి అయ్యాయని, ఈ రంగంలో భారీ డిమాండ్ ఉందని అధికారులు ఈ సందర్భంగా సిఎం దృష్టికి తీసుకువచ్చారు. ఈ పరిశ్రమల ఏర్పాటుతోపాటు ఉత్పత్తికి అనువైన ఎకో సిస్టంను ఏర్పాటు చేయాల్సిందిగా సిఎం అధికారులకు సూచించారు. వంద బిలియన్ డాలర్ల మేర పెట్టుబడులను ఎలక్ట్రానిక్స్ రంగంలో ఆకర్షించేలా కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు. ప్రస్తుతం ఈ రంగం బెంగళూరు, చెన్నై వంటి నగరాల్లో భూమి లభ్యత సమస్య తీవ్రంగా ఉందని రాష్ట్రానికి ఇది సానుకూల అంశమని చెప్పారు. విశాఖ, అమరావతి, తిరుపతి నగరాల్లో ఐటి కంపెనీల విస్తృతమైన అవకాశాలు ఉన్నాయని సిఎం స్పష్టం చేశారు. ఈ ప్రాంతాల్లో 500 ఐటి కంపెనీలకు కేటాయించడంతో ఒకేసారి ఎక్కువ మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. కో వర్కింగ్ స్పేస్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. భవిష్యత్ అవసరాలకు తగినట్లుగా యువతకు నైపుణ్యాలను పెంచాల్సి ఉందని, విద్యారంగంలోనూ కొత్త పాఠ్యాంశాలను జోడించాలని సిఎం ఆదేశించారు. నాలెడ్జి ఎకానమీలో రాష్ట్రం నెంబర్ వన్‌గా ఉండాలన్నదే తమ లక్ష్యమని తెలిపారు.

ప్రభుత్వం గుర్తించిన భూములు
పేదగిరిజనులకే దక్కాలి

- ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు అర్జున్‌దొర డిమాండ్


ప్రభుత్వం గుర్తించిన భూముల్లో జెండాలు పాతిన గిరిజన రైతులు

ప్రజాశక్తి- ఎటపాక (అల్లూరి జిల్లా)

పోలవరం ముంపు భూములుగా ప్రభుత్వం గుర్తించి నష్టపరిహారం పొందిన భూస్వామ్యులు తిరిగి వాటిని రైతులకు కౌలుకు ఇస్తున్నారని ఆ భూములు పేద గిరిజనులకే దక్కాలని ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు కాక అర్జున్‌దొర స్పష్టం చేశారు.సోమవారం గిరిజన సంఘం ఆధ్వర్యంలో గిరిజనులు సదరు భూముల్లో జెండాలు పాతారు. 2007లో పోలవరం ప్రాజెక్టు ముంపు భూములుగా ప్రభుత్వం గుర్తించి లక్షా 15వేలు నష్టపరిహారం భూస్వాములు పొందారన్నారు.

ప్రభుత్వ రికార్డుల్లో అవి పోలవరం భూములుగా ఉన్నప్పటికీ గత 18 సంవత్సరాలుగా జమీందారులు పెత్తనం సాగిస్తున్నారని తెలిపారు. వాటిని స్థానిక చిన్న,సన్నకారు రైతులకు కౌలుకు ఇస్తూ తమ పబ్బం గడుపుకుంటున్నారని అన్నారు. భూపోరాటానికి స్థానిక గిరిజన రైతులు కూడా మద్దతుగా నిలవాలని గిరిజన సంఘం నేతలు కోరారు. ప్రభుత్వభూములను కౌలుకి ఇస్తూ లక్షల రూపాయలు ఆర్జిస్తున్న భూస్వాములపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గిరిజన సంఘం మండల కార్యదర్శి ఇరప అజయ్, నాయకులు సొందె రామారావు, సోయం వీరమ్మ తదితరులు పాల్గొన్నారు.

'నిమిష ప్రియ' మధ్యవర్తిపై మృతుడి కుటుంబం ఆరోపణలు

న్యూఢిల్లీ : యెమెన్‌లో ఉరిశిక్ష విధించబడిన కేరళ నర్సు నిమిష ప్రియ వివాదం రోజుకో కొత్త మలుపు తిరుగుతోంది. ఈ కేసులో మధ్యవర్తిగా వ్యవరిస్తున్న మీడియా కార్యకర్త శామ్యూల్ జెరోమ్‌పై మృతుడి కుటుంబం తీవ్ర ఆరోపణలు చేసింది. నిమిష ప్రియ పేరుతో సేకరిస్తున్న నిధులను జెరోమ్ దుర్వినియోగం చేస్తున్నాడని మృతుడు తలాల్ అబ్దో మహదీ సోదరుడు అబ్దుల్ ఫతా మహదీ ఆరోపించాడు. న్యాయవాదిగా చెప్పుకునే జెరోమ్ నిమిష ప్రియ పేరుతో క్రౌడ్ ఫండింగ్ ద్వారా దాదాపు 40 వేల డాలర్లు సేకరించాడని, మధ్యవర్తిత్వం పేరుతో వ్యాపారం చేస్తున్నాడని మహదీ ఆరోపించారు. మధ్యవర్తిత్వం పేరుతో జెరోమ్ వ్యాపారం చేస్తున్నాడని విమర్శించారు. నిమిష ప్రియకు యెమెన్‌లోని కోర్టు ఉరిశిక్ష విధించిన సంగతి తెలిసిందే. నిమిష ప్రియను కాపాడాలని కేరళ ప్రభుత్వం పలుమార్లు కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ నేపథ్యంలో ఈ నెల 16న అమలు చేయాల్సిన ఉరిశిక్ష భారత ప్రభుత్వ జోక్యంతో వాయిదా పడింది. నిమిష ప్రియను రక్షించడానికి మృతుడి కుటుంబంతో చర్చలు జరుగుతున్న సమయంలో ఇలాంటి ఆరోపణలు రావడం గమనార్హం.

ఓటమి భయంతోనే ఓట్ల తొలగింపు

- బీహార్ అసెంబ్లీలో ప్రతిపక్షాల నిరసన
- ఎస్ఐఆర్, క్షీణిస్తున్న శాంతిభద్రతలపై ఆగ్రహం



పాట్నా : ఓటమి భయంతోనే ఓట్లను తొలగిస్తున్నారంటూ ప్రతిపక్షాలు బీహార్ అసెంబ్లీలో ఆందోళన నిర్వహించాయి. బీహార్‌లో వర్షాకాల అసెంబ్లీ సమావేశాలు సోమవారం ప్రారంభమయ్యాయి. రాష్ట్రంలో కొనసాగుతున్న ఎలక్టోరల్ రోల్స్ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్), క్షీణిస్తున్న శాంతిభద్రతలపై ప్రతిపక్షాలు ఆందోళన నిర్వహించాయి. ఓటమి భయంతోనే ఓట్లను తొలగిస్తున్నారని నినాదాలు చేస్తూ... సభ లోపల, బయట సభ్యులు నిరసన తెలిపారు. దీంతో, సభను మంగళవారానికి వాయిదా వేశారు. షెడ్యూల్ ప్రకారం ఈ నెల 25 వరకూ సమావేశాలు జరగనున్నాయి. ఈ ఏడాది అక్టోబర్ - నవంబర్ నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న బీహార్‌లో ఇవే చివరి అసెంబ్లీ సమావేశాలు. సోమవారం సభకు ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ హాజరయ్యారు. సభ ప్రారంభమైన తరువాత ముందుగా ఇటీవల మరణించిన సభ్యులకు నివాళులర్పించారు. రాష్ట్రంలో ఎస్ఐఆర్ పేరుతో ప్రజల ఓట్లను తొలగిస్తున్నారంటూ ప్రతిపక్ష సభ్యులు ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేయడం ప్రారంభించారు. సిపిఐ (ఎంఎల్) సభ్యులు నల్లదుస్తులు, చేతులకు బ్యాండ్లు ధరించారు. కొంతమంది సభ్యులు వెల్‌లోకి దూసుకెళ్లి నిరసన తెలిపారు. నిరసనల మధ్యే ఉపముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి 2025-2026 సంవత్సరానికి అనుబంధ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు.

చర్చకు అనుమతించాల్సిందే : తేజస్వియాదవ్

ఆర్‌జెడి నాయకులు తేజస్వి యాదవ్ మాట్లాడుతూ 'సోమవారం సభ వాయిదా తరువాత ఇతర ప్రతిపక్ష నాయకులతో కలిసి స్పీకర్‌తో సమావేశమయ్యాం. ఎస్ఐఆర్‌పై చర్చకు అనుమతించాలని కోరాం' అని తెలిపారు. ఎస్ఐఆర్‌పై సిపిఐ (ఎంఎల్) శాసన సభా పక్ష నేత మెహబూబ్ ఆలం సభ వెలుపల మీడియాతో మాట్లాడుతూ 'రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఘోరంగా ఓడిపోతామనే భయంతోనే ఎన్‌డిఎ ఇచ్చిన ఆదేశాలతో ఎన్నికల కమిషన్ భారీ ఎత్తున ఓట్లను తొలగిస్తుంది. దీనికి వ్యతిరేకంగా సడక్ సే సదన్ తక్ (వీధి నుంచి సభ వరకూ) పేరుతో పోరాటం చేస్తాం' అని తెలిపారు. బీహార్ పిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్యే రాజేష్ కుమార్ మాట్లాడుతూ 'ఎస్ఐఆర్ పేరుతో పేదలను ఓటర్ల జాబితా నుంచి తొలగిస్తున్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు కుప్పకూలిపోయాయి. నేరస్థులు రోడ్లపై స్వేచ్ఛగా తిరుగుతున్నారు' అని విమర్శించారు.

ఓ నిరుపేద ధీనగాథ..!

- 2020 నుంచి 'కుబేర' అక్రమాలు
- ఇంటి పనిచేసే వారి పేరు మీద రుణాలు
- బ్యాంకర్ల నుంచి ఫోన్లు రావడంతో ఖంగుతింటున్న బాధితులు


చిన్నారితో తనుజా

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

నెల్లూరు యాక్సెస్ బ్యాంకులో కుబేర బ్యాచ్ చేసిన అక్రమాలు, అవినీతి బయటకొస్తుంటే బాధితులు కన్నీరుమున్నీరు అవుతున్నారు. 2020 నాటి నుంచే ఈ బ్యాచ్ ఇలాంటి అక్రమాలకు పాల్పడినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం రూ.20 కోట్లు చెబుతుండగా పరిస్థితి చూస్తే రాష్ట్ర వ్యాపితంగా వందల కోట్లు మింగేశారు. "ప్రజాశక్తి" ఈ వ్యవహారాన్ని బయటకు తీసుకువచ్చింది. ఓ నిరుపేద మహిళ పరిస్థితి ప్రతి ఒక్కరీ హృదయాలను కదిలిస్తోంది.

ఒంగోలు దళితవాడకు చెందిన మోక తనుజా కాకినాడ వీరవనం గ్రామానికి చెందిన మోబీష్‌తో ఏడు సంవత్సరాల క్రితం వివాహం జరిగింది.ఉన్న ఊర్లో జీవించలేక 2021లో నెల్లూరుకు వలస వచ్చారు. నగరంలోని వనంతోపు సెంటర్‌లో అద్దె ఇంట్లో నివాసముండగా, ఆ సమయంలో అక్కడ జాలె వాసుదేవనాయుడు మోబీస్‌కు సెక్యూరిటీ గార్డు ఉద్యోగం ఇప్పించారు. ఈ పరిచయంతో తనూజకు ఓ టీ దుకాణంలో పనికి కుదిర్చారు. కుటుంబ పరిస్థితులు బాగ లేకపోవడంతో డబ్బులు కావాలని వాసుదేవనాయుడును కోరగా.. బ్యాంక్ నుంచి అప్పు ఇప్పిస్తానని ఆధార్‌కార్డు, బ్యాంక్ బుక్ తీసుకున్నారు. రెండు లక్షల రూపాయలు ఇచ్చాడు. ప్రతి నెలా రూ.20వేలు చొప్పున మొత్తం చెల్లించింది. భర్తకు ఆరోగ్యం సరిగా లేకపోవడంతో మళ్లీ రూ.మూడు లక్షలు కావాలని కోరగా... బ్యాంక్ రుణమని చెప్పి ఇచ్చారు. ప్రతి నెలా రూ.25 వేల చొప్పున ఆ మొత్తం చెల్లించారు.

ఇటీవల కాలంలో బ్యాంక్ నుంచి ఆమెకు తరచూ ఫోన్లు రావడంతో ఖంగుతిన్నారు. నగరంలోని ఆర్‌టిసి యాక్సెస్ బ్యాంక్ అధికారులు నుంచి ఫోన్ రావడంతో బ్యాంక్‌కు వెళ్లింది. మీరు స్టాఫ్‌వేర్ ఉద్యోగినే కదా మీ పేరు మీద మా బ్యాంక్‌లో రూ.35 లక్షలు రుణం తీసుకున్నారని బాంబు పేల్చారు. తనకు ఏమీ తెలియదని, తాను అక్కడక్కడా పాచిపని చేసుకుంటానని, వాసుదేవనాయుడు నాకు డబ్బులిస్తే తిరిగి ఇచ్చేనని చెప్పినా బ్యాంక్ అధికారులు ఒప్పుకోలేదు. మీరే చెల్లించాలంటూ బెదిరింపులకు దిగారు. ఇంటికొచ్చిన ఆమెకు చెన్నై యాక్సెస్ బ్యాంక్ నుంచి మరో ఫోన్ వచ్చింది. మీ పేరుపై మా బ్యాంక్‌లో రూ. 65 లక్షలు రుణం తీసుకున్నారని, ఎప్పుడు చెల్లిస్తారని ఆరా తీశారు. జగ్గయ్యపేట బ్యాంక్ నుంచి మరో రూ.45 లక్షలు బకాయి ఉన్నట్లు అధికారులు ఫోన్ చేశారు. దీంతో ఒక్కసారిగా ఆ కుటుంబం నివ్వెరపోయింది. తనకు తెలియకుండా ఇంత డబ్బులు ఏం చేశావంటూ భర్త మోబీస్ భార్య తనూజతో గొడవ పడి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. తనకు బ్యాంక్ ఎక్కడుందో తెలియదని, మా కుటుంబాన్ని చిన్నాభిన్నం చేశారని ఆమె వాపోయారు.

ఘాట్ రోడ్డులో తప్పిన పెను ప్రమాదం

ప్రజాశక్తి- అనంతగిరి (అల్లూరి జిల్లా)

అనంతగిరి ఘాట్ రోడ్డు లో బస్సు, బొలెరా ఢీకొన్న ఘటనలో పెను ప్రమాదం తప్పింది. సోమవారం అనంతగిరి నుండి ఎస్ కోటకు వెళ్తున్న బొలెరా. విజయనగరం జిల్లా ఎస్.కోట ఆర్టీసీ డిపోకు చెందిన పల్లె వెలుగు బస్సు డమ్ము కు ఘాట్ రోడ్ సమీపంలో ఢీకొన్నాయి.ఈ ఘటనలో ఎవరికి ఎటువంటి ప్రమాదాలు జరగక పోవడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. బస్సు ఎడమవైపు ఉన్న రక్షణ గోడకు ఢీ కొట్టి ఆగింది. మరి కొంచెం ముందుకు వెళ్లి ఉన్నట్లయితే లోయలోకి దూసుకుపోయేది.

అరకు కాఫీకి మరింత ప్రోత్సాహం

ప్రజాశక్తి- అనంతగిరి (అల్లూరి జిల్లా)

ప్రపంచ దేశాలకు పేరుగాంచిన అరకు కాఫీని మరింత ప్రోత్సహించేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆ దిశగా చర్యలు చేపట్టాయని కేంద్ర కాఫీ బోర్డు డిప్యూటీ డైరెక్టర్ సి ఎస్ ఆర్ .మురళీధర, కాఫీ బోర్డ్ అసిస్టెంట్ ఆఫీసర్ వి. రమేష్ లు పేర్కొన్నారు. ఈ మేరకు నూతనంగా కేంద్ర కాఫీ బోర్డు డిప్యూటీ డైరెక్టర్గా ఎన్నికైన శెట్టి. రాజును కోనపురం పంచాయతీ గ్రామం తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి బొకేసి సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అల్లూరి జిల్లా ఏజెన్సీ ప్రాంతంలో కాఫీ పంట దిగుబడి విస్తారంగా చేపట్టేందుకు ప్రభుత్వం ముందుకు వచ్చిందన్నారు.. గ్రామాలలో రైతులను గుర్తించి కాఫీ పంట దిగుబడి తెచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. దిగుబడితోపాటు మార్కెటింగ్ ఎగుమతులు మరింత పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం దృష్టి పెట్టిందన్నారు. కాఫీ సాగు మరింత విస్తరణకు గుర్తించేందుకు పంచాయతీ గ్రామాలలో రైతులతో నేరుగా సమావేశాలు ఏర్పాటు చేసి కమిటీలు నియమించడానికి సర్యాలు తీసుకుంటామన్నారు. కాఫీ బోర్డు డిప్యూటీ డైరెక్టర్గా నూతనంగా ఎన్నికైన రాజు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తమకు గుర్తించి కాఫీ బోర్డులో సభ్యునిగా ఎన్నిక పట్ల ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

కోట మృతి సినీ పరిశ్రమకు తీరనిలోటు : మోహన్‌బాబు



'కోట శ్రీనివాసరావు నాకు అత్యంత ఆప్తుడు. ఆయన మరణం తీవ్ర దిగ్భ్రాంతి కల్గించింది. కన్నప్ప రిలీజ్ రోజు ఫోన్ చేసి.. సినిమా చాలా బాగుంది. విష్ణుకు మంచి పేరు వచ్చింది అని నాతో చెప్పారు. 1987లో 'వీరప్రతాప్' అనే సినిమాలో మాంత్రికుడుగా మెయిన్ విలన్‌గా నా బ్యానర్‌లో అవకాశం ఇచ్చాను. మేం కలిసి చాలా సినిమాల్లో నటించాం. ఏ పాత్రనైనా అవలీలగా పోషించగలిగిన గొప్ప నటుడు కోట. విలన్‌గా, కమెడియన్‌గా, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా విభిన్న పాత్రల్లో నటించారు. ఏ డైలాగ్ నైనా అవలీలగా చెప్పగలిగే గొప్ప నటుడు. మా కుటుంబానికి అత్యంత సన్నిహితులు. ఆయన మరణం నా కుటుంబానికే కాకుండా సినిమా పరిశ్రమకు తీరని లోటు. ఆయన అకాల మరణం చెందిన రోజున నేను హైదరాబాద్‌లో లేను. అందుకే ఈరోజు వచ్చి కోట శ్రీనివాసరావు కుటుంబాన్ని పరామర్శించా' అని సినీ ప్రముఖులు డాక్టర్ మంచు మోహన్‌బాబు అన్నారు. సీనియర్ నటుడు కోట శ్రీనివాసరావు కుటుంబాన్ని ఆయన సోమవారం పరామర్శించారు. కోట శ్రీనివాసరావుతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. కోట శ్రీనివాసరావు చిత్ర పటానికి పూలమాలలు వేసి, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.



'థాంక్యూ డియర్' అలరిస్తుంది : మంచు మనోజ్

'థాంక్యూ డియర్' చిత్రం నుండి నా ద్వారా తొలి పాటను విడుదల చేయడం చాలా సంతోషకరంగా ఉంది. తమ్ముడు ధనుష్ రఘుముద్రికి ఆల్ ద బెస్ట్. నాన్నగారి దగ్గర నుండి మీ కుటుంబం మాకు ఎంతో సన్నిహితులు. డైరెక్టర్, ప్రొడ్యూసర్; మ్యూజిక్ డైరెక్టర్ ఇంకా ఇతర చిత్ర బృందం అందరికీ ధన్యవాదాలు. ఈ చిత్రం గొప్ప విజయం సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా' అని కథానాయకుడు మంచు మనోజ్ అన్నారు. తోట శ్రీకాంత్‌కుమార్ రచన దర్శకత్వంలో పప్పు బాలాజీ రెడ్డి నిర్మాతగా మహాలక్ష్మి ప్రొడక్షన్స్ బ్యానర్‌పై త్వరలో ప్రేక్షకుల ముందుకు రానున్న చిత్రం 'థాంక్యూ డియర్'. ధనుష్ రఘుముద్రి, హెబ్బా పటేల్, రేఖా నిరోషా ముఖ్యపాత్రలో కనిపిస్తూ వీర శంకర్, నాగ మహేష్; రవి ప్రకాష్; ఛత్రపతి శేఖర్, బలగం సుజాత, సంక్రాంతి ఫేమ్ శ్రీనివాస్ నాయుడు తదితరులు కీలకపాత్రలు పోషించనున్నారు. సుభాష్ ఆనంద్ సంగీతం. పిఎల్‌కె రెడ్డి డిఒపి. దర్శకుడు వివి వినాయక్ ఈ సినిమా షూటింగ్‌ను ప్రారంభించారు. సోమవారం నాడు ఈ చిత్రంలోని తొలి గీతం 'చిక్కక చిక్కిన గుమ్మ'ను మంచు మనోజ్ ఆవిష్కరించారు. నిర్మాత బాలాజీ రెడ్డి స్వయంగా ఈ పాటను రాయగా శ్రీచరణ్ ఆలపించారు.

సిరీస్ గెలిచేదెవరో..?

- నేడు భారత్-ఇంగ్లండ్ మహిళల మధ్య చివరి వన్డే
- సా. 5.30గం॥ల నుంచి



లండన్: భారత్-ఇంగ్లండ్ మహిళల మధ్య మూడో, చివరి వన్డే ఛెస్టర్-లే-స్ట్రీట్ వేదికగా మంగళవారం జరగనుంది. ఇరుజట్ల మధ్య మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా జరిగిన తొలి రెండు వన్డేల్లో ఇరుజట్లు ఒక్కో మ్యాచ్‌లో గెలిచి సమంగా నిలిచాయి. తొలి వన్డేలో హర్మన్‌ప్రీత్ సేన ... పరుగులతో విజయం సాధించగా.. రెండో వన్డేలో అనూహ్యంగా 8వికెట్ల తేడాతో పరాజయాన్ని చవిచూసింది. ఈ క్రమంలో చివరి వన్డే ప్రాధాన్యత సంతరించుకుంది. వర్షం కారణంగా 29 ఓవర్లకు కుదించిన ఆ మ్యాచ్‌లో భారతజట్టు 8వికెట్ల నష్టానికి 143పరుగులు చేయగా.. ఆ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో మళ్లీ వర్షం కురవడంతో 24 ఓవర్లలకు 115పరుగులుగా నిర్దేశించారు. కానీ ఇంగ్లండ్ మహిళలు కేవలం 21 ఓవర్లలోనే ఆ లక్ష్యాన్ని ఛేదించారు. రెండో వన్డేలో ఇంగ్లండ్ జట్టులో బ్యూమౌంట్ రాణించగా.. భారతజట్టులో దీప్తి శర్మ అద్భుత బ్యాటింగ్‌తో అలరించింది.

ఈ పర్యటనలో భాగంగా భారత మహిళలజట్టు తొలుత జరిగిన ఐదు టి20ల సిరీస్‌ను 3-2తో చేజిక్కించుకని రికార్డుపుటల్లోకెక్కగా.. ఆ రికార్డును మరింత పదిలం చేసుకోవాలంటే వన్డే సిరీస్‌ను నెగ్గాల్సిందే. ఈ క్రమంలో హర్మన్ ప్రీత్ సేన ఇక సిరీస్‌పై గురి పెట్టింది. బౌలింగ్, బ్యాటింగ్ విభాగాల్లో దుర్భేధ్య ఫామ్‌లో ఉండడం భారత్‌కు కలిసిరానుండగా.. ఆతిథ్య జట్టుకు ఈ మ్యాచ్ గెలుపు తప్పనిసరి. కనీసం వన్డే సిరీస్‌నైనా చేజిక్కించుకొని పరువును కాపాడుకోవాలని ఆ జట్టు చూస్తోంది.

జట్లు(అంచనా)..

ఇండియా మహిళలు: హర్మన్ ప్రీత్(కెప్టెన్), మంధాన, షెఫాలీ, హర్లీన్ డియోల్, రోడ్రిగ్స్, అమన్‌జ్యోత్, రీచా (వికెట్ కీపర్), దీప్తి, స్నేహ్ రాణా, శ్రీ చరణి, అరుంధతి

ఇంగ్లండ్ మహిళలు : నాట్ స్కీవర్(కెప్టెన్), కాప్సే, డంక్లే, బ్యూమౌంట్, దేవిడ్సన్ రిచర్డ్స్, చార్లీ డీన్, ఎమీ జోన్స్(వికెట్ కీపర్), అర్లాట్, కేట్ క్రాస్, లారెన్ బెల్, ఫైల్లర్/ఎక్లేస్టోన్.

అక్రమ కేసులపై పోరాడతాం

- పోలీసుల విచారణకు మాజీ మంత్రులు అంబటి, రజని హాజరు

ప్రజాశక్తి సత్తెనపల్లి రూరల్ (పల్నాడు జిల్లా)

మాజీ సిఎం వైఎస్ జగన్ గత నెల 18న పల్నాడు జిల్లా సత్తెనపల్లి పర్యటన సందర్భంగా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారన్న అభియోగాలపై నమోదు అయిన కేసులో మాజీ మంత్రులు అంబటి రాంబాబు, విడదల రజని సత్తెనపల్లిలో సోమవారం పోలీసుల విచారణకు వేర్వేరుగా హాజరయ్యారు. జగన్ పర్యటనలో పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్లను తొలగించినందుకు అంబటి రాంబాబుపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఆయనను రూరల్ పోలీసులు విచారించారు. పట్టణ, రూరల్ పోలీసు స్టేషన్లలో విచారణకు విడదల రజని హాజరయ్యారు. అనంతరం వీరిద్దరు మీడియాతో మాట్లాడుతూ.. మాజీ ముఖ్యమంత్రి పర్యటనకు కూడా ఆంక్షలు పెడుతున్న ప్రభుత్వాన్ని ఎప్పుడూ చూడలేదన్నారు. సూపర్ సిక్స్ అంటూ మాయమాటలు చెప్పి ప్రజలను చంద్రబాబు మోసం చేశారని విమర్శించారు. మిథున్ రెడ్డిపై తప్పుడు కేసు పెట్టి అరెస్టు చేశారని విమర్శించారు.

రాజకీయ పోరాటాలు మీకెందుకు?

- అధికార దుర్వినియోగానికి పాల్పడొద్దు
- ఇడిపై సుప్రీంకోర్టు ఆగ్రహం



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి)పై సర్వోన్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. రాజకీయ ప్రయోజనాల కోసం అధికార దుర్వినియోగానికి పాల్పడవద్దని హెచ్చరించింది. మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ముడా) కేసులో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య సతీమణి బిఎం పార్వతికి జారీ చేసిన సమన్లను కర్ణాటక హైకోర్టు రద్దు చేసింది. హైకోర్టు ఆదేశాలను ఇడి సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. ఈ పిటిషన్‌ను సోమవారం సిజెఐ జస్టిస్ బిఆర్ గవారు, జస్టిస్ కె వినోద్ చంద్రన్‌తో కూడిన ధర్మాసనం విచారించింది. ఇడి దాఖలు చేసిన పిటిషన్‌ను తిరస్కరిస్తూ ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ కేసును విచారించడం ఏమాత్రం ఇష్టం లేదని ధర్మాసనం స్పష్టం చేసింది. ఇడిని ఎందుకు రాజకీయ పోరాటాలకు ఉపయోగిస్తున్నారంటూ ఘాటుగా ప్రశ్నించింది. రాజకీయ యుద్ధాలను ఓటర్ల ముందు జరగనివ్వాలని అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్‌వి రాజుతో సిజెఐ అన్నారు. 'మిస్టర్ రాజు దయచేసి మమ్మల్ని నోరు తెరవమని ఒత్తిడి చేయకండి. లేకపోతే మేం ఇడి గురించి కొన్ని కఠినమైన వ్యాఖ్యలు చేయాల్సి వస్తుంది. నాకు మహారాష్ట్రలో కొంత అనుభవం ఉంది. మీరు దేశవ్యాప్తంగా ఈ పద్ధతిని కొనసాగించారు. ఓటర్ల ముందు ఈ రాజకీయ యుద్ధాలు జరగనివ్వండి. మిమ్మల్ని (ఇడి) ఎందుకు.. ఉపయోగిస్తున్నారు? సింగిల్ జడ్జి అనుసరించిన నిర్ణయంలో ఎలాంటి లోపాలు కనిపించడం లేదు. విచిత్రమైన వాస్తవాలు, పరిస్థితుల్లో దాన్ని తోసిపుచ్చుతున్నాం' అంటూ ధర్మాసనం స్పష్టం చేసింది.

ఇడి రాజకీయ పాత్రపై ఆగ్రహం

ట్రయల్ కోర్టు తీర్పును హైకోర్టు సింగిల్ జడ్జి సమర్థించారని, అంటే ఈ కేసులో ఇప్పటికే రెండు స్థాయిల్లో తీర్పులు వచ్చాయని, వాటిని ఇడి తిరగరాసే ప్రయత్నం చేయడం అనవసరమని ధర్మాసనం స్పష్టం చేసింది. దీంతో తమ పిటిషన్‌ను వెనక్కి తీసుకుంటామని ఇడి తరపున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్‌వి రాజు ధర్మాసనానికి తెలిపారు. దీంతో పిటిషన్‌ను కొట్టేస్తున్నట్టు సిజెఐ ప్రకటించారు.

ముడా కేసు ఏంటి?

మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ముడా) 14 ప్లాట్ల కేటాయింపులో అవకతవకలు జరిగాయన్నది ఇడి ఆరోపణగా ఉంది. మనీలాండరింగ్ విచారణలో భాగంగా సిద్ధరామయ్య భార్య పార్వతి, రాష్ట్ర మంత్రి బి సురేష్‌కు ఇడి సమన్లు జారీ చేసింది. భూముల లావాదేవీల ద్వారా అధికార దుర్వినియోగం, అక్రమ ప్రయోజనాలు పొందారని ఇడి అనుమానిస్తోంది. ఇడి సమన్లను ఈ ఏడాది మార్చిలో కర్ణాటక హైకోర్టు కొట్టేసింది. పిఎంఎల్‌ఏ కింద ప్రొసీడింగ్స్ అవసరమైన సాక్ష్యాలు, లీగల్ గ్రౌండ్స్ లేవని కోర్టు ఆ తీర్పులో పేర్కొంది.

రాజకీయ ప్రయోజనాల్లేవు, భూములు సరెండర్ చేశాం

హైకోర్టు ముందు విచారణలో పార్వతి తమ వాదనను వినిపించారు. స్వచ్ఛందంగా 14 భూములను తాను వదులుకున్నానని, తాను ఎలాంటి నేరపూరిత ప్రయోజనాలు పొందలేదని పేర్కొన్నారు. ఆమె లీగల్ టీమ్ సైతం ఎలాంటి అక్రమాలు జరగలేదని, ఇడి సమన్లు నిరాధారమని కోర్టుకు విన్నవించింది. ఈ అభిప్రాయాలతో హైకోర్టు ఏకీభవించింది. హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టు సైతం సమర్థించింది. సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పులో ఎలాంటి తప్పిదం కనిపించడం లేదని పేర్కొంటూ ఇడి పిటిషన్‌ను సిజెఐ కొట్టివేశారు.

ముంబయి రైళ్లలో పేలుళ్ల కేసులో దోషులంతా నిర్దోషులే

- బాంబే హైకోర్ట్ తీర్పు
- ఐదుగురి మరణశిక్ష ధ్రువీకరణకు 'నో'
- ప్రాథమిక సాక్ష్యాధారాలు సమర్పించలేకపోయిన ప్రాసిక్యూషన్

ముంబయి : 2006 జూలై 11న ముంబయి లోకల్ రైళ్లలో జరిగిన పేలుళ్లకు సంబంధించిన కేసులో దోషులుగా తేలి జైలు జీవితం గడుపుతున్న ఉన్న మొత్తం 12 మందినీ బాంబే హైకోర్ట్ సోమవారం నిర్దోషులుగా ప్రకటించింది. వారిలో ఐదుగురికి మోకా ట్రయల్ కోర్టు 2015 సెప్టెంబర్ 30న విధించిన మరణశిక్షను ధృవీకరించేందుకు నిరాకరించింది. మిగిలిన ఏడుగురు నిందితులకు విధించిన జీవిత ఖైదు శిక్షను కూడా రద్దు చేసింది. నిందితులకు వ్యతిరేకంగా ప్రాథమిక సాక్ష్యాధారాలు సమర్పించడంలో ప్రాసిక్యూషన్ విఫలమైందని తెలిపింది. ఘటనలో ఎలాంటి పేలుడు పదార్థాలను ఉపయోగించారో ప్రాసిక్యూషన్ చెప్పలేకపోయిందని వ్యాఖ్యానించింది. ఘటన జరిగిన 19 సంవత్సరాల నుంచి నిందితులు జైలులోనే ఉన్నారు.

చిత్రహింసలు...నేరాన్ని అంగీకరించాలంటూ బలవంతం

ట్రయల్ కోర్టు గతంలో నిందితుడు వాహిద్ షేక్‌ను నిర్దోషిగా విడిచిపెట్టింది. అప్పటికే ఆయన తొమ్మిది సంవత్సరాలు జైలు శిక్ష అనుభవించారు. తమను క్రూరంగా హింసించారని, నేరాన్ని అంగీకరించాల్సిందిగా బలవంతం చేశారని నిందితుల పక్షాల డిఫెన్స్ న్యాయవాదులు చేసిన వాదనను అనిల్ కిలోర్, శ్యామ్ చందక్‌తో కూడిన హైకోర్ట్ బెంచ్ అంగీకరించింది. 'ఈ కేసులో నన్నే కాదు. మొత్తం 12 మందినీ ఇరికించారని ఎప్పటి నుంచో చెబుతున్నాం. ఈ రోజు మా నిర్దోషిత్వం నిరూపణ అయింది' అని వాహిద్ 'ది వైర్' పోర్టల్‌కు భావోద్వేగంతో తెలిపారు.

విచారణ తీరుపై అనుమానాలు

నేరాన్ని అంగీకరించేలా తమను చిత్రహింసలకు గురిచేశారని నిరూపించడంలో నిందితులు సఫలీకృతులయ్యారని న్యాయమూర్తులు తెలిపారు. నిందితులను శారీరకంగా, మానసికంగా హింసించారన్న డిఫెన్స్ వాదనతో ఏకీభవించారు. ప్రభుత్వం, దోషులు దాఖలు చేసిన అప్పీళ్లను ముంబయి హైకోర్ట్ గత ఆరు నెలలుగా విచారిస్తోంది. హైకోర్ట్ ఇచ్చిన తీర్పును గమనిస్తే కేసు విచారణలో రాష్ట్ర దర్యాప్తు సంస్థ, ఉగ్రవాద నిరోధక బృందం (ఎటిఎస్) నిర్వహించిన పాత్రపై అనేక తీవ్రమైన ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

ఏం జరిగింది?

2006 జూలై 11న ముంబయిలో వివిధ లోకల్ రైళ్లలో ఏడు బాంబు పేలుడు ఘటనలు చోటుచేసుకున్నాయి. ఈ పేలుళ్లలో 189 మంది మరణించగా, 820 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. నిందితులు ప్రెషర్ కుక్కర్లలో బాంబులు అమర్చి రద్దీగా ఉండే సాయంకాలం వేళ రైళ్లలో పెట్టారని పోలీసులు కేసు నమోదు చేశారు. అప్పట్లో రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం విచారణ నిమిత్తం కేసును ఎటిఎస్‌కు అప్పగించింది. కాంగ్రెస్ పాలనలో ఎటిఎస్ దర్యాప్తు జరిపిన అనేక కేసులలో 2006 మాలేగావ్ పేలుడు కేసు కూడా ఒకటి. పోలీసు దళాలు మతపరమైన పక్షపాతంతో వ్యవహరించాయని, ఉగ్రవాద కేసులలో ముస్లిం యువతను అక్రమంగా ఇరికించారని ఆరోపణలు వెల్లువెత్తాయి.

ముస్లింలే లక్ష్యంగా...

ముంబయి పేలుళ్ల కేసులో పోలీసులు, అధికారులు ముస్లింలనే లక్ష్యంగా ఎంచుకున్నట్లు స్పష్టమవుతోంది. ప్రస్తుత కేసులో కమల్ అన్సారీ, మహమ్మద్ ఫైజల్ అతౌర్ రెహ్మాన్ షేక్, ఎహ్తేషామ్ కుతుబుద్దీన్ సిద్దిఖీ, నవీద్ హుస్సేన్ ఖాన్, అసిఫ్ ఖాన్‌లకు ట్రయల్ కోర్టు మరణశిక్ష విధించింది. బాంబులను అమర్చారని, ఉగ్రవాద కార్యకలాపాల కోసం శిక్షణ పొందారని, కుట్రకు పాల్పడ్డారని వారిపై అభియోగాలు మోపారు. ఇక తన్వీర్ అహ్మద్ మహమ్మద్ ఇబ్రహీం అన్సారీ, మహమ్మద్ మజీద్ మహమ్మద్ షఫీ, షేక్ మహమ్మద్ అలీ ఆలం షేక్, మహమ్మద్ సాజిద్ మార్గబ్ అన్సారీ, ముజామిల్ రెహమాన్ షేక్, సుహైల్ మెహమూద్ షేక్, జమీర్ అహ్మద్ లతియుర్ రెహమాన్ షేక్‌లకు జీవిత ఖైదు శిక్ష పడింది. విచారణ సమయంలో వీరిలో ఏ ఒక్కరికీ బెయిల్ లభించలేదు. కోవిడ్ సమయంలో కుటుంబ సభ్యులను కోల్పోయినా బెయిల్ నిరాకరించారు. ఇప్పుడు హైకోర్ట్ వారందరినీ సాధారణ 'వ్యక్తిగత గుర్తింపు (పిఆర్)' బాండ్‌పై విడుదల చేసింది.

13న 'కార్పొరేట్స్ క్విట్ ఇండియా డే'

- ట్రాక్టర్, మోటార్ వాహనాల పరేడ్
- ట్రంప్, మోడీ దిష్టిబొమ్మలు దగ్ధం
- 15 నుంచి జాతీయ ప్రచారం
- నవంబరు 26న భారీ కార్మిక, రైతు నిరసన
- సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఆగస్టు 13న 'కార్పొరేట్స్ క్విట్ ఇండియా డే'గా నిర్వహించనున్నట్లు సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) పిలుపునిచ్చింది. రైతులు ట్రాక్టర్, మోటారు వాహన కవాతులు, నిరసన ప్రదర్శనలు నిర్వహించాలని, అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ దిష్టిబొమ్మలను దగ్ధం చేస్తూ 'కార్పొరేట్స్ క్విట్ ఇండియా' నినాదాన్ని మార్మోగించాలని కోరింది. ఢిల్లీలో నిర్వహించిన ఎస్‌కెఎం సర్వసభ్య సమావేశానికి 12 రాష్ట్రాలకు చెందిన 37 రైతు సంఘాల నుండి 106 మంది ప్రతినిధులు హాజరయ్యారు. అధ్యక్షత వర్గంగా అశోక్ ధావలే, దర్శన్ పాల్, యుధ్వీర్ సింగ్, ఆశిష్ మిటల్, బడగలపుర నాగేంద్ర, సునీలం, రావుల వెంకయ్య, పురుషోత్తం శర్మ, సత్యవాన్ వ్యవహరించారు. ఎఐకెఎస్ సీనియర్ నేత హన్నన్ మొల్లా స్వాగతం పలికారు. రాజన్ క్షీరసాగర్ అజెండాను వివరించారు. అశోక్ ధావలే ముగింపు ప్రసంగం చేశారు. జులై 9న కార్మిక సమ్మె విజయవంతం కావడంతో కార్మిక సంఘాల ఉద్యమ నాయకత్వాన్ని, కార్మిక వర్గాన్ని ఎస్‌కెఎం జనరల్ బాడీ అభినందించింది. ఈ విజయం పాలక వర్గాల ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టడానికి మొత్తం శ్రామిక ప్రజలు సిద్ధంగా ఉన్నారనే విశ్వాసాన్ని సమాజంలోని ప్రజాస్వామ్య వర్గాల్లో నింపిందని పేర్కొంది. మోడీ ప్రభుత్వం విదేశీ వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టిఎ)పై సంతకం చేయడానికి అమెరికా సామ్రాజ్యవాద ఆదేశాలకు లొంగిపోతోందని అశోక్ ధావలే విమర్శించారు. వ్యవసాయం, పాడి, ఆహార మార్కెట్ రంగాలకు ద్వారాలు తెరవడంతో ఇది మొత్తం ప్రజల, దేశ ప్రయోజనాలను దెబ్బతీస్తుందని తెలిపారు. ఎఫ్‌టిఎ 2025 ఆగస్టు ఒకటి నాటికి అమల్లోకి రానుందని, బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం అమెరికా ఒత్తిళ్లను అంగీకరించి, జిఎం ఆహారాలు, ఆహార మార్కెట్లలో ఎంఎన్‌సి చొరబాటుతో సహా ఆహారం, పాల వస్తువుల దిగుమతులను పెంచడానికి తీసుకున్న చర్యలను నిరసిస్తూ సామూహిక ఆందోళనలు చేపట్టాలని సూచించారు.

ఎస్‌కెఎం నిర్ణయాలు

పంజాబ్‌లోని అన్ని జిల్లాల్లో ఈ నెల 30న ట్రాక్టర్ ర్యాలీలు, ఆగస్టు 24న భారీ మహాపంచాయత్ నిర్వహించనున్నాయి.

అదానీ గ్రూప్ బొగ్గు గనుల కోసం తమ భూమిని బలవంతంగా సేకరించడాన్ని నిరసిస్తున్న సింగ్రౌలి గిరిజన రైతుల రైతులకు ఎస్‌కెఎం జనరల్ బాడీ పూర్తి సంఘీభావం తెలిపింది.

2020–21 చారిత్రాత్మక రైతుల పోరాటం 5వ వార్షికోత్సవం సందర్భంగా న్యూఢిల్లీతో పాటు రాష్ట్ర రాజధానుల్లో భారీ కార్మిక, రైతు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించడానికి ఎస్‌కెఎం ట్రేడ్ యూనియన్ ఉద్యమం, వ్యవసాయ కార్మికుల ఉద్యమంతో సమన్వయం చేసుకుంటుంది.

ఆగస్టు 15 నుండి నవంబర్ 26 వరకు కార్పొరేట్ – మత శక్తులకు వ్యతిరేకంగా జాతీయ ప్రచారం. కార్మిక – రైతు ఐక్యత, హిందూ – ముస్లిం ఐక్యత అనే రెండు స్తంభాల ఆధారంగా వివిధ మతాలు, విశ్వాసాల లౌకిక ఐక్యతకు, మొత్తం శ్రామిక ప్రజల వర్గ ఐక్యతకు దారితీస్తుంది.

డిమాండ్లు

1. వ్యవసాయ రంగాన్ని / ఆహార ధాన్యాల ఉత్పత్తిని, పాడి రంగాన్ని దెబ్బతీసే ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం, చౌక దిగుమతులను తిరస్కరించడం.
2. సమాఖ్య హక్కులను బలహీనపరిచే, ప్రభుత్వ వ్యవసాయ మార్కెట్లను కార్పొరేట్ స్వాధీనం చేసుకోవడాన్ని ప్రోత్సహించే కార్పొరేట్ అనుకూల ఎన్‌పిఎఫ్ఎఎంను రద్దు చేయాలి.
3. అన్ని పంటలకు సి2ప్లస్50 శాతం కనీస మద్దతు ధర ఇవ్వాలి.
4. రైతు ఆత్మహత్యలను నివారించడానికి రైతులు, వ్యవసాయ కార్మికులకు సమగ్ర రుణ మాఫీ చేయాలి.
5. విచక్షణారహితంగా భూసేకరణ, భూ సమీకరణ పథకాలు, పారిశ్రామిక నమూనా టౌన్‌షిప్‌లు ఆపాలి. భూసేకరణ చట్టం 2013ను అమలు చేయాలి.
6. విద్యుత్‌ను ప్రైవేటీకరించకూడదు. స్మార్ట్ మీటర్లను బిగించొద్దు. అన్ని గ్రామీణ గృహాలకు 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను అందించాలి.

ఎఐఐఇఎ ఉపాధ్యక్షులు బి.సాన్యాల్ ఇక లేరు



న్యూఢిల్లీ : ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఎఐఐఇఎ) ఉపాధ్యక్షులు బి. సాన్యాల్ సోమవారం ఉదయం రాయ్‌పూర్‌లో తుదిశ్వాస విడిచారు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న సాన్యాల్ ఇక్కడి ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సాన్యాల్‌కు భార్య, కుమార్తె ఉన్నారు. సాన్యాల్ ఆకస్మిక మృతిపై ఎఐఐఇఎ ప్రగాఢ సంతాపం తెలియజేసింది. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపింది. సాన్యాల్ లేని లోటు పూడ్చలేనిదని పేర్కొంది. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. సాన్యాల్ ఎఐఐఇఎ సీనియర్ ఆఫీస్ బేరర్ మాత్రమే కాదని, ఒక మార్గదర్శక శక్తిగా, అవిశ్రాంత పోరాట యోధుడిగా, కార్మిక వర్గానికి నిస్వార్థ సేవ చేశారని పేర్కొంది. సాన్యాల్ ఎఐఐఇఎ జాయింట్ సెక్రటరీ, ఉపాధ్యక్షులనే కాకుండా సిజెడ్ఐఇఎ, ఆర్‌డిఐఇయు రాయ్‌పూర్ జనరల్ సెక్రటరీగానూ బాధ్యతలు నిర్వర్తించారని గుర్తు చేసింది. సాన్యాల్ బొగ్గు కార్మికుల ఉద్యమంతోపాటు అసంఘటిత కార్మికుల పోరాటాలకు మార్గదర్శకం వహించారని పేర్కొంది. అనేక ఏళ్లపాటు సిఐటియు ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర కార్యదర్శిగా కొనసాగారని తెలిపింది. దేశంలోని ప్రగతిశీల, ప్రజాస్వామ్య ఉద్యమంతో చాలా దగ్గరగా పనిచేశారని పేర్కొంది. ఆయన ఆదర్శాలు, పనితీరు, విశ్వాసాల వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లాలనే సంకల్పాన్ని పునరుద్ఘాటిస్తున్నట్లు ఎఐఐఇఎ స్పష్టం చేసింది.

ఎర్రజెండా ప్రదర్శిస్తే ఐదేళ్ల జైలు

- చెక్ రిపబ్లిక్‌లో కొత్త చట్టం

ప్రాగ్ : చెక్ రిపబ్లిక్ అధ్యక్షుడు పెట్రొ పావెల్ కమ్యూనిస్టు ప్రచారాన్ని నిషేధించారు. దీనికి సంబంధించిన " దేశ క్రిమినల్ కోడ్ చట్టం" పై శుక్రవారం నాడు సంతకం చేశారు. ఇది జనవరి 1వ తేదీ నుండి అమల్లోకి రానుంది. ఈ కొత్త చట్టం ప్రకారం సుత్తీ, కొడవలితో కూడిన ఎర్రజెండాని ప్రదర్శిస్తే 5 సంవత్సరాల జైలు శిక్ష విధిస్తారు. సిద్ధాంత ప్రచారం, బహిరంగ ఆందోళనా కార్యకలాపాలు నిర్వహించడం నేరం. ఇకపై కమ్యూనిస్టులను నాజీలతో సమానంగా పరిగణిస్తామని పెట్రొ ప్రభుత్వం ప్రకటించింది. చెక్ రిపబ్లిక్ దేశం గతంలో చెకోస్లోవేకియాలో భాగంగా ఉండేది. సోవియట్ యూనియన్ విచ్ఛిన్నం తరువాత 1992లో స్లోవేకియా, చెక్ రిపబ్లిక్‌గా విడిపోయాయి. ఇరు దేశాలు 1999వ సంవత్సరంలో నాటో (ఎన్ ఎ టి ఒ), 2004లో యురోపియన్ యూనియన్‌లో చేరాయి. గత రెండు దశాబ్దాల నుండి చెక్ రిపబ్లిక్, పోలాండ్, బాల్టిక్ దేశాల్లో యురోపియన్ యూనియన్ మద్దతుతో కమ్యూనిస్టు వ్యతిరేక ప్రచారాన్ని తీవ్రం చేసాయి. చెక్ రిపబ్లిక్ కమ్యూనిస్టు పార్టీ (బొహేమియా, మొరావియా) నాయకురాలు కేటారినా కొనెచ్నా కొత్త చట్టాన్ని వ్యతిరేకిస్తూ ప్రకటన విడుదల చేశారు. కమ్యూనిస్టు పార్టీని నిషేధించేందుకు విఫల ప్రయత్నంగా ఆమె అభివర్ణించారు. కమ్యూనిస్టులు, నాజీలు సమానమని పేర్కోవడాన్ని ఖండించారు. రెండోవ ప్రపంచ యుద్ధ సమయంలో నాజీ బానిసత్వం నుండి కాపాడిన చరిత్ర కమ్యూనిస్టులదని గుర్తుచేశారు. అధ్యక్షుడు తీసుకున్న అప్రజాస్వామ్య నిర్ణయంపై చట్టపరంగా పోరాడతామని ఈ సందర్భంగా ప్రకటించారు.

బంగ్లాదేశ్‌లో ఘోరం

- పాఠశాల భవనంపై కూలిన సైనిక విమానం
- 19 మంది మృతి, 70 మందికి గాయాలు

ఢాకా : బంగ్లాదేశ్‌లో సోమవారం ఘోర విమాన ప్రమాదం సంభవించింది. ఢాకాలో బంగ్లాదేశ్ వైమానిక దళానికి చెందిన ఒక శిక్షణ విమానం టేకాఫ్ అయిన కొన్ని నిమిషాలకే ఒక పాఠశాల భవనంపై మధ్యాహ్నం 1:06 గంటలకు కూలిపోయింది. ఈ ప్రమాదంలో 19 మంది మరణించారు. 70 మందికి పైగా గాయపడ్డారు. మృతుల్లో ఎక్కువ మంది చిన్నారులేనని అధికారులు, ప్రత్యక్ష సాక్షులు చెప్పారు. ఢాకాలోని ఉత్తర ప్రాంతంలో ఉన్న నాలుగు అంతస్తుల మైల్‌స్టోన్ స్కూల్ అండ్ కాలేజ్‌పై ఎఫ్–7 బిజిఐ అనే శిక్షణా యుద్ధవిమానం కూలిపోయింది. ప్రమాదం జరిగిన వెంటనే అగ్నిమాపక దళాలు, అంబులెన్స్‌లు, వైమానిక దళ హెలికాప్టర్లు సంఘటనా స్థలికి చేరుకున్నాయి. గాయపడిన వారికి కంబైన్డ్ మిలటరీ హాస్పిటల్ (సిఎంహెచ్), ఢాకా మెడికల్ కాలేజ్ హాస్పిటల్, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ బర్న్ అండ్ ప్లాస్టిక్ సర్జరీల్లో చికిత్స అందిస్తున్నారు. గాయపడిన వారిలో ఎనిమిదిమంది పరిస్థితి విషమంగా ఉందని ఆరోగ్య మంత్రిత్వ శాఖ ప్రధాన సలహాదారులు ముహమ్మద్ యూనస్ తెలిపారు. ప్రమాదంపై బంగ్లాదేశ్‌లోని తాత్కాలిక ప్రభుత్వం దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. మంగళవారం ఒక రోజు సంతాప దినంగా ప్రకటించింది.

న్యాయ వ్యవస్థలో విదేశీ జోక్యమా?

- అమెరికాపై లూలా ఆగ్రహం

బ్రసిలియా : మాజీ అధ్యక్షుడు జెయిర్ బోల్సొనారోపై జరుగుతున్న విచారణతో సంబంధమున్న అధికారులపై వీసా నిషేధం విధించాలని అమెరికా తీసుకున్న నిర్ణయాన్ని బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లూలా డి సిల్వా తప్పుపట్టారు. అమెరికా నిర్ణయం ఏకపక్షమని, నిరాధారమని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ న్యాయ వ్యవస్థలో విదేశీ జోక్యాన్ని అంగీకరించే ప్రశ్నే లేదని స్పష్టం చేశారు. దేశాల మధ్య పరస్పర గౌరవం, సార్వభౌమత్వానికి సంబంధించిన ప్రాథమిక సూత్రాలను అమెరికా చర్య ఉల్లంఘిస్తోందని ఆయన ఓ ప్రకటనలో విమర్శించారు. బోల్సొనారోపై విచారణ జరుపుతున్న బ్రెజిల్ సుప్రీంకోర్టు న్యాయమూర్తి అలెగ్జాండర్ డి మొరాయస్, ఆయన కుటుంబం, కొందరు కోర్టు అధికారులపై అమెరికా ప్రభుత్వం మూడు రోజుల క్రితం వీసా ఆంక్షలు విధించింది. దీంతో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, బ్రెజిల్ ప్రభుత్వం మధ్య ఉద్రిక్తతలు పెరిగాయి. 2022 అధ్యక్ష ఎన్నికలలో పరాజయం పాలైన ట్రంప్ సన్నిహితుడు బోల్సొనారో తిరుగుబాటుకు కుట్ర పన్నారన్న అభియోగాలపై సెర్చ్ వారంట్లు, ఆంక్షల ఆదేశాలు జారీ చేయాలని సుప్రీంకోర్టు నిర్ణయించింది. ఈ నిర్ణయంపై ఆగ్రహం వ్యక్తం చేసిన ట్రంప్ ఏకంగా బ్రెజిల్ న్యాయవ్యవస్థలోనే తలదూర్చారు. సుప్రీంకోర్టులోని 11 మంది న్యాయమూర్తులలో ఏడుగురిపై, మరికొందరు అధికారులపై అమెరికా వీసా ఆంక్షలు విధించింది.

ఎఫ్‌డిసికి ఎఎం రత్నం పేరు సిఫార్సు చేశా : పవన్‌కళ్యాణ్



'ఆంధ్రప్రదేశ్ చలన చిత్ర పరిశ్రమ అభివృద్ధి సంస్థ (ఎఫ్‌డిసి) ఛైర్మన్ పదవికి టాలీవుడ్ అగ్ర నిర్మాత, దర్శకుడు ఎఎం రత్నం పేరును సిఫార్సు చేశా. ఈ విషయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి కూడా తీసుకెళ్లా. త్వరలోనే ఆయన ఎపి ఫిల్మ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టబోతున్నారు. ఆయన హయాంలో తెలుగు చిత్ర పరిశ్రమ మరింతగా అభివృద్ధి చెందుతుందనే నమ్మకం నాకుంది. అందుకే ఆయన పేరు సిఫార్సు చేశా. నా సినిమాకు పనిచేసిన నిర్మాత అని కాదు.. ఇలాంటి వ్యక్తి ఉంటే సినీ పరిశ్రమ బాగుంటుందని. సినిమాని ఎలా ప్రమోట్ చేసుకోవాలో నాకు తెలియదు. పని చేయడమే తెలుసు. నేను అనుకోకుండా నటుడిని, సాంకేతిక నిపుణుడిని అయ్యాను. అజ్ఞాతవాసి సినిమాలో త్రివిక్రమ్ ఒక మాట రాశారు. 'ఒక చిన్నపాటి సౌకర్యం కోసం ఒక యుద్ధమే చేయాల్సి వస్తుంది' అని. అలాంటిది ఒక సినిమా చేయడమంటే ఎన్ని యుద్ధాలు చేయాలి. ఆర్థికంగా కావొచ్చు. సృజనాత్మకంగా కావచ్చు. నేను సినిమాల్లోకి రాకముందు ఎ.ఎం. రత్నం గారి లాంటి వ్యక్తి నా నిర్మాత అయితే బాగుండు అనుకునే వాడిని. ప్రాంతీయ సినిమాని జాతీయ స్థాయికి తీసుకెళ్లిన వ్యక్తాయన.

తమిళ సినిమాలను తెలుగులో విడుదల చేసి, స్ట్రయిట్ సినిమాల స్థాయిలో ఆడించి సత్తా చూపించిన వ్యక్తి. ఫిల్మ్ ఇండస్ట్రీ క్రియేటివ్ పొటెన్షియాలిటీ పెంచిన వ్యక్తి. ఈ సినిమా చాలా ఒడిదుడుకులు, రెండు కరోనా పరిస్థితులు, క్రియేటివ్‌గా ఇంకొంత ఇబ్బందులు ఎదుర్కొంది. ఏమి చేసినా, ఎన్ని ఎదురైనా సినిమా బాగా రావాలని అనుకుంటాం. ఈ సినిమాకి ప్రత్యేకించి ఎ.ఎం.రత్నం గారి తపన చూశా. నేను రాజకీయాల్లోకి వెళ్ళిపోయి.. దర్శకత్వానికి, క్రియేటివ్ పార్ట్‌కి దూరమైన తర్వాత కూడా ఎఎం రత్నం కోరటంతో కాదనలేకపోయా. ఒక్క క్లైమాక్స్‌కే దాదాపు 57 రోజులు షూట్ చేయాల్సి వచ్చింది. మే నెలలో మండుటెండలో షూట్ చేశాం. నేను ఎప్పుడో నేర్చుకున్న మార్షల్ ఆర్ట్స్ ఇప్పుడు ఈ సినిమాకి పనికొచ్చాయి. కొరియోగ్రాఫర్స్‌తో కూర్చొని క్లైమాక్స్‌ను ప్రత్యేకంగా రూపొందించాం. సినిమా కథ విషయానికి వస్తే కృష్ణానది తీరంలో కొల్లూరులో దొరికిన కోహినూర్ వజ్రం.. హైదరాబాద్ సుల్తాన్ల దగ్గరకు ఎలా వచ్చింది? ఆ తర్వాత ప్రయాణం ఎలా జరిగింది? ఈ నేపథ్యంలో జరిగే కథ ఉంది. దీనికి పునాది వేసింది క్రిష్ జాగర్లమూడి. నేను ఖుషి సినిమా చేస్తున్న సమయంలో జ్యోతికృష్ణ లండన్‌లో ఫిల్మ్ మేకింగ్ కోర్స్ చేశారు. ఆయనతో మాట్లాడుతుంటే సెన్సిబుల్ డైరెక్టర్ అనిపించింది. కీరవాణి మంచి సంగీతాన్ని అందించారు. నిధి అగర్వాల్ సినిమా ప్రమోషన్ బాధ్యతను తీసుకున్నారు. మనోజ్ పరమహంస కృషి చాలా బాగుంది. 'హరిహర వీరమల్లు' సినిమాను ఆదరించాలని ప్రేక్షకులను కోరుతున్నా' అని పవన్ కళ్యాణ్ అన్నారు. పవన్‌కళ్యాణ్ కథానాయకుడిగా, నిధి అగర్వాల్ కథానాయికిగా నటించిన చిత్రం 'హరిహర వీరమల్లు' సినిమా ఈనెల 24న విడుదల కానుంది. హైదరాబాద్‌లో సోమవారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో పవన్‌కళ్యాణ్, నిధి అగర్వాల్, ఎఎంరత్నం, ఎఎం జ్యోతికృష్ణ తదితరులు మాట్లాడారు.

ఆ నాటి ప్రేమ నేడేది?

- ట్రంప్ సుంకాలపై దక్షిణ కొరియాలో ఆగ్రహం

సియోల్ : దక్షిణ కొరియా ప్రజలకు అమెరికా అంటే ఎంతో ఇష్టం. వాషింగ్టన్‌లో పర్యటించాలని వారు తహతహలాడేవారు. దక్షిణ కొరియా ఉత్పత్తులపై ఆగస్ట్ 1వ తేదీ నుంచి 25 శాతం సుంకం విధిస్తానంటూ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చేస్తున్న హెచ్చరికలతో ఇప్పుడు సీన్ రివర్స్ అయింది. 'అమెరికా సంస్కృతి అంటే మాకు ఎంతో ఇష్టం. దాని ఆర్థిక వ్యవస్థ ఎంతో బలమైనది. ఇప్పుడు అమెరికా భౌగోళిక రాజకీయ సమతూకానికి ముప్పు కలిగిస్తోంది' అని దక్షిణ కొరియా వాసి సిడ్నీ సిమ్ అనే వ్యక్తి విమర్శించారు. ఆయన కొన్ని సంవత్సరాల క్రితం బిజినెస్ వీసాపై అమెరికా వెళ్లి వచ్చారు.

అమెరికా, దక్షిణ కొరియా మధ్య దీర్ఘకాలంగా బంధం కొనసాగుతోంది. ఆసియాలో అమెరికాకు దక్షిణ కొరియా అత్యంత సన్నిహిత భాగస్వామి. ఉత్తర కొరియా వ్యతిరేక కార్యకలాపాల నిమిత్తం 28,000 మంది అమెరికా సైనికులకు ఆతిథ్యం ఇస్తోంది. ఇతర దేశాల కంటే అమెరికాలోనే ప్రవాస దక్షిణ కొరియా వాసులు ఎక్కువ మంది నివసిస్తున్నారు. ట్రంప్ 'అమెరికా ఫస్ట్' అజెండా కారణంగా ద్వైపాక్షిక సంబంధాలకు విఘాతం ఏర్పడింది. ఈ వారం ప్రారంభంలో ప్యూ రిసెర్చ్ సెంటర్ నిర్వహించిన సర్వేలో 61 శాతం మంది దక్షిణ కొరియన్లు అమెరికా పట్ల సానుకూలత వ్యక్తం చేశారు. గత సంవత్సరం జరిపిన సర్వేలో ఈ సానుకూలత 77 శాతం ఉండడం గమనార్హం.

అమెరికాతో వచ్చే నెల 1వ తేదీ నాటికి వాణిజ్య ఒప్పందం కుదరని పక్షంలో దక్షిణ కొరియా తీవ్ర ఒడుదుడుకులను ఎదుర్కొనే అవకాశం ఉంది. ఎలక్ట్రానిక్స్, నౌకలు, కార్లు, జనరేటర్లను ఎక్కువగా ఉత్పత్తి చేస్తున్న దక్షిణ కొరియా తన ఎగుమతుల ద్వారా జిడిపిలో 40 శాతానికి పైగా పొందుతోంది. ట్రంప్ తన టారిఫ్ హెచ్చరికలపై దక్షిణ కొరియా అధ్యక్షుడు లీ జే–మయుంగ్‌కు లేఖ రాయడంతో పాటు ఆ దేశంపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. దక్షిణ కొరియాలోని తమ దళాలకు సియోల్ పెద్దగా చేస్తున్నది ఏమీ లేదని విమర్శించారు. అమెరికాతో గడువు నాటికి ఒప్పందం కుదిరే అవకాశమేమీ లేదని దక్షిణ కొరియా తేల్చి చెప్పింది.

ప్రతిపక్షాల నిరసనలతో అట్టుడికిన పార్లమెంటు

(మొదటి పేజీ తరువాయి)

ఉంటే ప్రతిపక్ష ఎంపిలు సభలో నిరసన తెలపడం సరికాదని అన్నారు.

ప్రతిపక్ష నేతగా పార్లమెంట్లో మాట్లాడే అవకాశం ఇవ్వట్లేదు : రాహుల్ గాంధీ

లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేతగా ఉన్నప్పటికీ తనను మాట్లాడనివ్వట్లేదని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ విమర్శించారు. ఈ సమావేశాల్లో అధికార పక్షం పక్షపాతంతో వ్యవహరిస్తోందని అన్నారు. రక్షణశాఖ మంత్రి, ప్రభుత్వంలోని ఇతర మంత్రులకు మాట్లాడటానికి అనుమతినిచ్చి, ప్రధాన ప్రతిపక్ష నేతగా ఉన్న తనకు, ఇతర ప్రతిపక్షాలకు అనుమతించకపోవడం శోచనీయమని అన్నారు. పార్లమెంటు సమావేశాల్లో ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరిస్తోందని అన్నారు. ఆపరేషన్ సిందూర్‌పై చర్చించేందుకు సిద్ధమేనని పార్లమెంటరీ వ్యవహారాలశాఖ మంత్రి కిరణ్ రిజిజు చెప్పడాన్ని కాంగ్రెస్ ఎంపి ప్రియాంక గాంధీ వాద్రా ప్రస్తావిస్తూ.. వాళ్లు చర్చించడానికి సిద్ధంగా ఉన్నప్పుడు ప్రతిపక్ష నేతను కూడా మాట్లాడనీయాలని, ఆయన మాట్లాడేందుకు లేచినప్పుడు అనుమతించాల్సి ఉంటుందని అన్నారు.

రాజ్యసభలో తీవ్ర గందరగోళం

రాజ్యసభలో కూడా తీవ్ర గందరగోళం నెలకొంది. ఆపరేషన్ సిందూర్‌పై చర్చించాలని ప్రతిపక్ష ఎంపిలు డిమాండ్ చేశారు. రాజ్యసభలో ప్రతిపక్షనేత మల్లికార్జున ఖర్గే ఆపరేషన్ సిందూర్, పహల్గాం ఉగ్రదాడి అంశాన్ని లేవనెత్తారు. పహల్గాం ఉగ్రవాద దాడి నిందితులను ఇంకా పట్టుకోలేదన్నారు. ఆపరేషన్ సిందూర్ తదితర అంశాలపై అన్ని పార్టీలు ఐక్యంగా ప్రభుత్వానికి మద్దతు తెలిపాయని, దాడితోపాటు ఆ తరువాత జరిగిన ఘటనలపై సమాచారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం భద్రత విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిందని, దీన్ని లెఫ్టినెంట్ గవర్నర్ స్వయంగా అంగీకరించారని గుర్తు చేశారు. చాలామంది సీనియర్ సైనిక అధికారులు సైతం అనేక విషయాలను వెల్లడించారన్నారు. ప్రభుత్వం ఈ విషయంలో సమాచారం ఇవ్వాలన్నారు. తన మధ్యవర్తిత్వంతోనే కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిందని, అమెరికా అధ్యక్షులు ట్రంప్ 24 సార్లు చెప్పారని, వేరే దేశానికి చెందిన వ్యక్తి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం దేశానికే అవమానకరమన్నారు. సభా నాయకులు జెపి నడ్డా మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం తరువాత ఇప్పటి వరకు ప్రధాన మంత్రి నాయకత్వంలో ఆపరేషన్ సిందూర్‌లో జరిగినట్లుగా ఇలాంటి ఆపరేషన్ జరగలేదన్నారు. ఆపరేషన్ సిందూర్‌పై చర్చ కోసం సభలో నోటీసు ఇచ్చారని, ప్రభుత్వం చర్చిస్తుందని, ప్రతి ప్రశ్నకూ సమాధానం ఇస్తామని ఆయన పేర్కొన్నారు.

జస్టిస్ యశ్వంత్ వర్మపై అభిశంసనకు 200 మంది సంతకాలు

అలహాబాద్ హైకోర్టు జస్టిస్ యశ్వంత్ వర్మపై వేటుకు రంగం సిద్ధమైంది. భారీగా నోట్ల కట్టలు పట్టుబడిన కేసులో విచారణ ఎదుర్కొంటున్న ఆయనపై అభిశంసన తీర్మానానికి మద్దతు ఇస్తూ పార్టీలకతీతంగా ఇరు సభల్లోని 200 మంది సంతకాలు చేశారు. అనంతరం ఆ పత్రాన్ని లోక్‌సభ స్పీకరు ఓం బిర్లాకు అందజేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 124, 217, 218 కింద జస్టిస్ యశ్వంత్ వర్మపై ఎంపిలు అభిశంసన తీర్మానాన్ని సభలో ప్రవేశ పెట్టారు. ఈ తీర్మానానికి బిజెపి, కాంగ్రెస్, జెడియు, సిపిఎం, ఎన్‌సిపి తదితర పార్టీల ఎంపిలతో పాటు వివిధ పార్టీల సభ్యులు కూడా మద్దతు తెలిపారు. అభిశంసన తీర్మానంపై సంతకాలు చేసిన వారిలో రవిశంకర్ ప్రసాద్, రాహుల్ గాంధీ, సుప్రియా సూలే, కెసి వేణుగోపాల్, కె రాధాకృష్ణన్ తదితరులు ఉన్నారు. రాజ్యసభలోనూ జస్టిస్ వర్మను తొలగించాలని తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఆయనను తొలగించాలని ఉప రాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖర్‌ను 50 మంది సభ్యులు కోరారు.

మన పిల్లలను నేలపై పడుకోబెడతామా?

(మొదటి పేజీ తరువాయి)

నిర్దిష్ట ప్రతిపాదనలతో సిఎస్ వ్యక్తిగతంగా విచారణకు రావాలని గతంలో ఆదేశించింది. ఆన్‌లైన్‌లో సిఎస్ దయానంద్ విచారణకు హాజరయ్యారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధికారుల నివేదికలను చూస్తే హాస్టల్స్ ఎలా ఉన్నాయో అర్థమవుతుందని సిఎస్‌ను ఉద్దేశించి చెప్పింది. నర్సీపట్నంలోని ఓ సంక్షేమ హాస్టల్‌లో 228 మంది విద్యార్థినులుంటే ఒక్క మరుగుదొడ్డి మాత్రమే ఉందని గుర్తు చేసింది. విజయనగరం జిల్లాలోని అంధుల పాఠశాలలో 33 మంది విద్యార్థులుంటే, వారి సహాయ పోస్టులన్నీ ఖాళీగా ఉన్నాయని చెప్పింది. సిఎస్ స్థాయి అధికారి కదిలితేనే పరిస్థితుల్లో మార్పు వస్తుందని చెప్పింది. దీనిపై సిఎస్ విజయానంద్ స్పందిస్తూ, హాస్టల్స్‌లోని పరిస్థితులపై సమీక్ష నిర్వహించామని, కొత్త బిల్డింగ్స్ నిర్మిస్తామని, మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కొన్నిచోట్ల పనులు ప్రారంభమయ్యాయని, రెండేళ్లలో చేయబోయే పనులపై నివేదిక ఇస్తామని తెలిపారు.



పోరాట యోధుడు.. సమర్ధ నేత

పొలిట్‌బ్యూరో నివాళి

న్యూఢిల్లీ : కమ్యూనిస్టు ఉద్యమ యోధులు, సిపిఎం అగ్ర నేత కామ్రేడ్ వి.ఎస్.అచ్యుతానందన్ మృతికి సిపిఎం పొలిట్‌బ్యూరో తీవ్ర విచారాన్ని వ్యక్తం చేసింది. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. "విఎస్‌గా అందరికీ చిరపరిచితులైన అచ్యుతానందన్ సుదీర్ఘకాలంగా అస్వస్థతతో బాధపడుతూ సోమవారం మధ్యాహ్నం 3.20 గంటలకు కన్నుమూశారు. 101 ఏళ్ల ఆయన పొలిట్‌బ్యూరో మాజీ సభ్యులు. సమర్ధవంతమైన నాయకుడిగా పేరొందిన అచ్యుతానందన్ కేరళలో అనేక పోరాటాలకు నాయకత్వం వహించారు. అస్పిన్‌వాల్ కంపెనీలో పనిచేస్తున్న సమయంలో కొబ్బరి పీచు కార్మికులందరినీ సంఘటితపరిచిన నేత అచ్యుతానందన్.

1940లో 17 ఏళ్ల వయసులో ఆయన కమ్యూనిస్టు పార్టీలో చేరారు. కుట్టనాడ్‌లో భూస్వాముల చేతిలో భయంకరమైన దోపిడీకి గురవుతున్న వ్యవసాయ కార్మికుల మధ్య వుంటూ వారితో కలిసి పనిచేసే బాధ్యతలను ఆయనకు కృష్ణ పిళ్ళై అప్పగించారు. ట్రావెన్‌కోర్ దివాన్‌కు వ్యతిరేకంగా పున్నప్ర–వాయలార్ పోరాట సమయంలో విఎస్ అజ్ఞాతంలోకి వెళ్లాల్సి వచ్చింది. అరెస్టయిన తర్వాత కస్టడీలో ఆయన తీవ్ర వేధింపులను ఎదుర్కొన్నారు. 1956లో ఐక్య కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కమిటీకి విఎస్ ఎన్నికయ్యారు. 1958లో జాతీయ కౌన్సిల్‌కు ఎన్నికయ్యారు. భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్)ను ఏర్పాటు చేయడానికి నేషనల్ కౌన్సిల్‌ను వీడి బయటకు వచ్చిన 32 మంది సభ్యుల్లో అచ్యుతానందన్ చివరి వారు. 1980 నుంచి 1991 వరకు సిపిఎం కేరళ రాష్ట్ర కార్యదర్శిగా ఆయన పనిచేశారు. 1964లో పార్టీ కేంద్ర కమిటీకి ఎన్నికయ్యారు. 1985లో పొలిట్‌బ్యూరో సభ్యులయ్యారు. వృద్ధాప్యం కారణంగా 2022లో కేంద్ర కమిటీ నుంచి రిలీవ్ అయిన అచ్యుతానందన్ ఆ తర్వాత కేంద్ర కమిటీ ప్రత్యేక ఆహ్వానితులుగా వున్నారు.

కేరళ అసెంబ్లీకి విఎస్ ఏడుసార్లు ఎన్నికయ్యారు. ప్రతిపక్ష నేతగా రెండుసార్లు పనిచేశారు. 2006 నుండి 2011 వరకు ముఖ్యమంత్రిగా వున్నారు. ముఖ్యమంత్రిగా ఆయన హయాంలో శ్రమ జీవుల సంక్షేమం కోసం అనేక చట్టపరమైన, పాలనాపరమైన చర్యలు తీసుకున్నారు. పార్టీతో ఆయనకు గల ఎనిమిదన్నర దశాబ్దాల సుదీర్ఘ అనుబంధంలో, కేరళలో కమ్యూనిస్టు ఉద్యమం సుస్థిరంగా వృద్ధి చెందిన క్రమాన్ని విఎస్ చూశారు. విఎస్ నేరుగా ప్రజలతో మాట్లాడడంలో దిట్ట. నిరాడంబరమైన జీవనశైలికి, సామాజిక న్యాయం పట్ల అచంచలమైన నిబద్ధతకు పేరొందిన విఎస్ కేరళ రాజకీయాల్లో తనదైన చెరగని ముద్ర వేశారు. ఆయన మృతి, పార్టీకి, కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటు." అని పొలిట్‌బ్యూరో పేర్కొంది. విఎస్ అచ్యుతానందన్ మృతికి సంతాపసూచకంగా పొలిట్‌బ్యూరో అరుణ పతాకాన్ని అవనతం చేసింది. విఎస్ భార్య, కుమారుడు, కుమార్తెలకు సానుభూతిని తెలియజేసింది.

ఆయన ప్రజా జీవితం గొప్పది

ప్రజాశక్తి – అమరావతి బ్యూరో

కేరళ మాజీ ముఖ్యమంత్రి, సిపిఎం పొలిట్‌బ్యూరో మాజీ సభ్యులు విఎస్ అచ్యుతానందన్ మృతి పట్ల గవర్నరు ఎస్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు తదితరులు సంతాపం వ్యక్తం చేశారు. దశాబ్దాల ప్రజా జీవితంలో ఆయన కేరళ ప్రజల మనసుల్లో నిలిచిపోయారని గవర్నరు పేర్కొన్నారు.

ప్రజా జీవితంలో 8 దశాబ్దాలు : ముఖ్యమంత్రి చంద్రబాబు

కేరళ మాజీ సిఎం అచ్యుతానందన్ మృతి పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంతాపం వ్యక్తం చేశారు. అచ్యుతానందన్ ఎనిమిది దశాబ్దాలపాటు సుదీర్ఘ రాజకీయ జీవితం గడిపారని, ప్రజల పట్ల, ఆదర్శాల పట్ల ఆయనకున్న నిబద్ధతకు అదే నిదర్శనమని తెలిపారు. అచ్యుతానందన్ కుటుంబ సభ్యులకు సానుభూతి ప్రకటించారు.

ప్రతి దశలోనూ ప్రజాపక్షం వహించారు : పవన్ కల్యాణ్

రాజకీయ కురువృద్ధులు, కేరళ మాజీ సిఎం విఎస్ అచ్యుతానందన్ కార్మిక హక్కుల పోరాటం నుండి రాజకీయ జీవితంలోకి వచ్చిన ప్రతి దశలోనూ ప్రజాపక్షం వహించారని డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ అన్నారు. ఆయన తుదిశ్వాస విడిచారని తెలిసి చింతించానని పేర్కొన్నారు. నిరాడంబర జీవితం గడిపిన నేతగా అచ్యుతానందన్ ప్రజలకు గుర్తుండిపోతారన్నారు.

ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోతారు : మాజీ సిఎం జగన్

అచ్యుతానందన్ మరణంతో కేరళ రాజకీయ రంగం ఒక గొప్ప నాయకుడిని కోల్పోయిందని మాజీ సిఎం, వైసిపి అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంతాపం ప్రకటించారు. ఆయన ధైర్యం, నిబద్ధత, ప్రజల పట్ల ప్రేమ ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని తెలిపారు.

అచ్యుతానందన్ పోరాటాలు చిరస్మరణీయం: బివి రాఘవులు

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

దేశ కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రలో తనదంటూ ఒక ముద్ర వేసిన నేత విఎస్ అచ్యుతానందన్ అని సిపిఎం పొలిట్ బ్యూరోసభ్యులు బివి రాఘవులు అన్నారు. ఆయన ఆదర్శాలను పాటిస్తూ పార్టీని ముందుకు తీసుకెళ్లడమే నిజమైన నివాళి అని చెప్పారు. తెలంగాణలోని పలు చోట్ల అచ్యుతానందన్ సంస్మరణ సభ నిర్వహించారు. ఈ నేపథ్యంలో బివి రాఘవులు మాట్లాడుతూ కేరళలో పేద ప్రజలకు భూములను పంచారనీ, పది సెంట్ల ఇంటి స్థలాలను ఇచ్చారని వివరించారు. కేరళలో కమ్యూనిస్టులతో పాటు అని పార్టీల, సామాజిక తరగతుల వారితోనూ గౌరవింపబడ్డ, మన్ననలు అందుకున్న మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. కేరళలో కమ్యూనిస్టు విముక్తి ఉద్యమాన్ని ఆనాడు ఇందిరాగాంధీ తీసుకొస్తే... సమైక్య కేరళ నిర్మాణంలో ఆయన పాత్ర మరువలేనిదన్నారు. అచ్యుతానందన్ మృతికి సిపిఎం మాజీ ఎమ్మెల్యే పాటూరు రామయ్య, పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి వెంకట్, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి సాగర్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకట్రాములు, రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్ ఆంజనేయులు సంతాపం తెలిపారు.

కేరళ మాజీ ముఖ్యమంత్రి అచ్యుతానందన్ మృతికి సంతాపం తెలిపిన వారిలో.. ఎపిరైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వి.కృష్ణయ్య, కె.ప్రభాకర్‌రెడ్డి, ప్రజానాట్యమండలి అధ్యక్ష,కార్యదర్శులు పి.మంగరాజు, ఎస్ అనిల్‌కుమార్, కెవిపిఎస్ అధ్యక్ష, కార్యదర్శులు ఓ నల్లప్ప, అంద్ర మాల్యాద్రి, సిఐటియు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎవి నాగేశ్వరరావు, సిహెచ్ నరిశింగరావు, ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర కమిటీ, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు దడాల సుబ్బారావు, వి.వెంకటేశ్వర్లు, ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి ఉన్నారు.

సేవాస్ఫూర్తికి నిలువెత్తు రూపం

ప్రముఖుల నివాళులు

కేరళ మాజీ ముఖ్యమంత్రి, సిపిఐ (ఎం) సీనియర్ నేత అచ్యుతానందన్ మృతి పట్ల ప్రధాని మోడీ సహా పలువురు నేతలు, ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. సూత్రబద్ధమైన రాజకీయాలకు, ప్రజాసేవా స్ఫూర్తికి ఆయన నిలువెత్తు ప్రతిరూపమని కొనియాడారు. సమాజంలో వెనుకబడిన వర్గాల, నిరుపేదల జీవితాల అభ్యున్నతి కోసం తన జీవితాంతం కృషి చేసిన పోరాట యోధుడని ఘనంగా నివాళులు అర్పించారు. కేరళ రాజకీయ చరిత్ర నుంచి ఆయనను వేరు చేసి చూడలేమని పేర్కొన్నారు.

రాజకీయ దక్షత కలిగిన నేత : రాజ్‌నాథ్ సింగ్

అచ్యుతానందన్ రాజకీయ దక్షత కలిగిన నేత అని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కొనియాడారు. ప్రజా, సామాజిక ప్రయోజనాల కోసం తన జీవితాన్ని అంకితం చేసిన వ్యక్తని పేర్కొన్నారు.

నిరంతర పోరాట యోధుడు : ఎం.వి.గోవిందన్

విఎస్.అచ్యుతానందన్ నిరంతర పోరాట యోధుడని సిపిఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శి ఎంవి.గోవిందన్ పేర్కొన్నారు. వి.ఎస్ మృతికి ఆయన సంతాపం ప్రకటించారు. అట్టడుగు వర్గాల ఉద్యమాన్ని బలోపేతం చేసిన పోరాట యోధుడని అన్నారు. కేరళలోని లెక్కలేనన్ని పోరాటాలను నడిపించిన దఢ సంకల్పం ఆయనదని గుర్తు చేసుకున్నారు. కేరళతో పాటు భారతదేశంలో కమ్యూనిస్టు పార్టీని ముందుకు తీసుకువెళ్లడంలో ఆయన ప్రత్యేక పాత్ర పోషించారని అన్నారు. ఏ సమాజానికైనా స్ఫూర్తినిచ్చే శక్తి కామ్రేడ్ వి.ఎస్ అని ఆయన ఘనంగా నివాళులర్పించారు.

ప్రతిపక్ష పాత్రకు వన్నె : కేరళ ప్రతిపక్ష నేత సతీశన్

ప్రజా ప్రయోజనాల కోసం పోరు సల్పేందుకు రాళ్ళు, ముళ్ళతో నిండిన దారిలో నడిచిన నేత మాజీ ముఖ్యమంత్రి వి.ఎస్.అచ్యుతానందన్ అని ప్రతిపక్ష నేత వి.డి.సతీశన్ నివాళులు అర్పించారు. ప్రతిఘటన, న్యాయం కోసం పోరాటాలకు మారుపేరుగా ఆయన నిలిచారన్నారు. ప్రతిపక్ష నేతగా, ముఖ్యమంత్రిగా అచ్యుతానందన్, కేరళ ప్రజా జీవితంలో అత్యున్నతమైన స్థానం సంపాదించుకున్నారని కొనియాడారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో ప్రతిపక్ష పాత్రకు కొత్తదైన, తిరుగులేని సామాజిక రాజకీయ కోణాన్ని జోడించారని వ్యాఖ్యానించారు.

అచ్యుతానందన్ గొప్ప పరిపాలనా దక్షుడని, ప్రజా సేవకుడని కేరళ పిసిసి అధ్యక్షుడు సన్నీ జోసఫ్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రిగా, ప్రతిపక్ష నేతగా ఆయన అందించిన సేవలు ఎంతో విలువైనవని చెప్పారు. కాంగ్రెస్ సీనియర్ నేత రమేష్ చెన్నితాలా కూడా అచ్యుతానందన్‌కు నివాళులు అర్పించారు. ఆర్ఎంపి నాయకుడు కె.కె. రెమా, ముస్లింలీగ్ నేత పి.కె.కన్హలికుట్టి కూడా అచ్యుతానందన్ మృతికి సంతాపం తెలిపారు.

మేరునగ ధీరుడు : కేరళ గవర్నర్ అర్లేకర్

కేరళ మాజీ ముఖ్యమంత్రి అచ్యుతానందన్ మృతికి రాష్ట్ర గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు. భారత రాజకీయాల్లో మేరునగధీరుడైన కామ్రేడ్ విఎస్ కమ్యూనిస్టు ఉద్యమ యోధుల్లో ఒకరని, ఆయన మృతితో భారతదేశంలో వామపక్ష రాజకీయ చరిత్రలో ఒక శకం ముగిసిందని వ్యాఖ్యానించారు.

సూత్రబద్ధ రాజకీయాలకు స్ఫూర్తి : తమిళనాడు సిఎం స్టాలిన్

ప్రజల ఆదరాభిమానాలు చూరగొన్న ప్రియతమ నేత, జీవితాంతం కమ్యూనిస్టుగా గడిపిన కామ్రేడ్ అచ్యుతానందన్ సూత్రబద్ధ రాజకీయాలకు, ప్రజా సేవా స్ఫూర్తికి నిలువెత్తు రూపమని తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ కొనియాడారు.

ఒరిస్సా సిఎం సంతాపం : అచ్యుతానందన్ మృతి పట్ల ఒరిస్సా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి విచారం వ్యక్తం చేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కాంక్షించారు.

కె.కవిత సంతాపం : అచ్యుతానందన్ మృతికి బిఆర్ఎస్ నేత కె.కవిత సంతాపాన్ని వ్యక్తం చేశారు. ప్రజలకు సేవలందించడం కోసం ఆయన చూపిన అచంచలమైన నిబద్ధత ఎప్పటికీ గుర్తుండిపోతుందని వ్యాఖ్యానించారు.

అచ్యుతానందన్ మృతికి మాజీ ఎమ్మెల్యే పాటూరు రామయ్య సంతాపం తెలిపారు.

శతాధిక ఉద్యమాల సమరశీలి

తిరువనంతపురం : నూట రెండేళ్ల నిండు జీవితం గడిపిన విఎస్ ఎనిమిదిన్నర దశాబ్దాలకు పైగా ఉద్యమ జీవితానికే అంకితమయ్యారు. కేరళలో కమ్యూనిస్టు ఉద్యమ అభివృద్ధిలో ఆటుపోట్లన్నింటినీ దగ్గరగా చూసిన యోధుడాయన. పక్షవాతం, వయోభారంతో వచ్చిన ఇతర అనారోగ్య సమస్యల కారణంగా క్రియాశీల రాజకీయాల నుంచి విరమించుకుని విశ్రాంతి తీసుకుంటున్నారు. విఎస్‌గా అందరికీ సుపరిచితుడైన వెళిక్కకథ శంకరన్ అచ్యుతానందన్ కేరళ అసెంబ్లీకి ఏడుసార్లు ఎన్నికయ్యారు.

ప్రస్తుతం సిపిఎం రాష్ట్ర కమిటీలో ప్రత్యేక ఆహ్వానితులుగా వున్న విఎస్ ఒక పర్యాయం ముఖ్యమంత్రిగా (2006–2011), మూడు పర్యాయాలు ప్రతిపక్ష నాయకునిగా వ్యవహరించారు. 1980–91 మధ్య సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శిగా పనిచేశారు.

అవినీతికి, అణచివేతకు వ్యతిరేకంగా ఆయన రాజీపడని రీతిలో నిలిచారు. 1956లో కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడయ్యారు. 1957లో అలప్పుజ జిల్లా కార్యదర్శిగా ఎన్నికయ్యారు. 1958లో పార్టీ జాతీయ కౌన్సిల్ సభ్యుడయ్యారు. కమ్యూనిస్టు ఉద్యమంలో రివిజనిస్టు ధోరణులకు వ్యతిరేకంగా 1964లో ఉమ్మడి పార్టీ జాతీయ కౌన్సిల్ సమావేశాన్ని బహిష్కరించిన 32 మంది కౌన్సిల్ సభ్యుల్లో విఎస్ ఒకరు. కేరళకు చెందిన ఏడుగురిలో ఒకరు. వి.ఎస్ మరణంతో ఇప్పుడు ఆ తరం అంతా నిష్క్రమించినట్లైంది. 1964లో కోల్‌కతాలో జరిగిన పార్టీ మహాసభలో కేంద్ర కమిటీకి మొదటిసారి ఎన్నికయ్యారు. 1985లో పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడయ్యారు. 2016లో అధికారంలోకి వచ్చిన ఎల్‌డిఎఫ్ ప్రభుత్వంలో పాలనాపరమైన సంస్కరణల కమిషన్ చైర్మన్‌గా నియమితులయ్యారు.

గొప్ప నిర్మాణ దక్షుడు

వి.ఎస్ గొప్ప నిర్మాణ దక్షుడు. వివిధ పోరాటాలకు స్వయంగా నాయకత్వం వహించారు. 1920 అక్టోబరు 20న అలప్పుజా జిల్లాలోని పున్నప్ర వెంటలాతర కుటుంబంలో పున్నప్ర వెళిక్కకథ అయ్యన్ శంకరన్, అక్కమ్మ అలియాస్ కార్తియాని దంపతులకు రెండవ కుమారుడుగా విఎస్ జన్మించారు. ఆయన విద్యాభ్యాసమంతా పున్నప్ర పరవూర్ ప్రభుత్వ పాఠశాలలోనూ, కలార్‌కోడ్ పాఠశాలలోనూ సాగింది. ఆయనకు నాలుగేళ్ళ వయస్సులోనే తల్లి మశూచితో చనిపోయారు. ఏడవ తరగతిలో వుండగా తండ్రి చనిపోయారు. దాంతో ఆయన చదువుకు స్వస్తి పలికి, తన అన్న నడుపుతున్న టైలర్ షాపులోనే సహాయకునిగా చేరాడు. ఆ తరువాత అస్పిన్వాల్ కంపెనీలో కోయిర్ (కొబ్బరి పీచు) కార్మికుడిగా చేరారు. మూడేళ్ల పాటు ఆ కంపెనీలో పనిచేసి, కొబ్బరి పీచు కార్మికులందరినీ సంఘటితపరిచారు.

17 ఏళ్ల వయసు నుంచే ఉద్యమంలో ..

అచ్యుతానందన్ 17 ఏళ్ల వయసులో కమ్యూనిస్టు పార్టీలో చేరారు. కేరళలో కమ్యూనిస్టు ఉద్యమ వ్యవస్థాపకుడు పి.కృష్ణ పిళ్ళైను కలుసుకున్న తరువాత ఆయన జీవితం పెద్ద మలుపు తిరిగింది. విఎస్‌లోని సమర్ధతను, నిర్వహణా నైపుణ్యాలను గమనించిన కృష్ణపిళ్ళై కుట్టనాడ్‌లో భూస్వాముల చేతిలో భయంకర దోపిడీకి గురవుతున్న వ్యవసాయ కార్మికుల మధ్య వుంటూ వారిని సంఘటితం చేస్తూ, పార్టీని అభివృద్ధి పరిచే బాధ్యత అప్పగించారు. విఎస్ ఆ పనిని సమర్ధవంతంగా నిర్వహించారు. 1943లో కోజికోడ్‌లో జరిగిన కమ్యూనిస్టు పార్టీ మహాసభలో అలప్పుజ నుంచి ప్రతినిధిగా పాల్గొన్నారు. ట్రావెన్కూర్ దివాన్ సిపి రామస్వామి అయ్యర్‌కు వ్యతిరేకంగా పున్నప్ర–వాయలార్ తిరుగుబాటు సమయంలో పార్టీ ఆదేశాల మేరకు ఆయన అజ్ఞాతంలోకి వెళ్లారు. కొట్టాయంలోని పూంజార్‌లో వుండగా, ఆయనను పోలీసులు అరెస్టు చేశారు. కస్టడీలో చిత్ర హింసలకు గురి చేశారు. వి.ఎస్. చనిపోయాడనుకుని అడవిలో పడేసి వారు వెళ్లిపోయారు. ఆయన కొన ఊపిరితో ఉన్నట్టు సహచరులు గమనించి, కొట్టాయంలో ఆస్పత్రిలో చేర్చారు. ఆ ఘటన తరువాత ఆయన రాజ్య పీడనకు, దుర్మార్గాలకు వ్యతిరేకంగా మరింత పట్టుదలతో పాల్గొన్నారు. జీవితాంతం అదే స్ఫూర్తిని కొనసాగిస్తూ నిజమైన పోరాట యోధుడుగా, ప్రజా నాయకుడుగా నిలబడ్డారు.

సిపిఎం రాష్ట్ర కమిటీ సంతాపం

ప్రజాశక్తి – అమరావతి బ్యూరో

కేరళ మాజీ ముఖ్యమంత్రి, సిపిఎం పొలిట్‌బ్యూరో పూర్వ సభ్యులు విఎస్ అచ్యుతానందన్ మృతి పట్ల సిపిఎం రాష్ట్ర కమిటీ సంతాపం తెలిపింది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు సోమవారం ప్రకటన విడుదల చేశారు. అచ్యుతానందన్ కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. పార్టీ కార్యాలయాలపై జెండాను అవనతం చేయాలని అన్ని కమిటీలకూ సూచించారు. ముఖ్యమంత్రిగా ఆయన పాలనలో కేరళ ప్రజల సంక్షేమానికి అనేక చర్యలు చేపట్టారని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన అఖిల భారత మహాసభల్లో పాల్గొన్నారని తెలిపారు. వివిధ సందర్భాల్లో ప్రజా సంఘాల కార్యక్రమాలు, బహిరంగ సభల్లోనూ పాల్గొన్నారని వివరించారు.

ఎనిమిది దశాబ్దాల కమ్యూనిస్టు ఉద్యమంలో విఎస్ అచ్యుతానందన్ కేరళ ఉద్యమానికి కీలకమైన మనిషిగా ప్రత్యక్షంగా పాల్గొన్న నాయకుడిగా ఉన్నారని వివరించారు. ప్రజల్లో మంచి పేరున్న నాయకులని, నిరాడంబర జీవి, సామాజిక న్యాయం పట్ల కట్టుబడిన వ్యక్తని తెలిపారు. ఆయన మృతి పార్టీ ఉద్యమానికి, ప్రజలకు తీరని నష్టమని పేర్కొన్నారు.



అచ్యుతానందన్ కన్నుమూత !

మొదటిపేజి తరువాయి

చెందిన వేలాదిమంది ప్రజలు తమ ప్రియతమ నేతకు నివాళులు అర్పిస్తున్నారు. మంగళవారం ఉదయం 9గంటలకు దర్బార్ హాల్‌కు ఆయన భౌతిక కాయాన్ని తీసుకువెళతారు. మధ్యాహ్నం అలప్పుజ సిపిఎం జిల్లా కమిటీ కార్యాలయానికి తీసుకువెళతారు. అలప్పుజలోని వాలియా చుడుకాడ్ వద్ద ఆయన అంత్యక్రియలు జరుగుతాయి.

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి ఎం.వి.గోవిందన్ ఈ మృతి వార్తను ప్రకటించారు. ఆయన తుది శ్వాస విడిచేందుకు ముందుగానే ముఖ్యమంత్రి పినరయి విజయన్‌తో సహా సీనియన్ నేతలు పలువురు ఆస్పత్రికి వెళ్ళి వి.ఎస్‌ను చూసి వచ్చారు. ఆ సమయంలో అచ్యుతానందన్ భార్య కె.వసుమతి, పిల్లలు వి.ఎ.అరుణ్ కుమార్, డాక్టర్ వి.ఆశాలు కూడా అక్కడే వున్నారు.



విఎస్ అచ్యుతానందన్ కేరళ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న దృశ్యం (ఫైల్‌ఫొటో)



సెమీస్‌కు దివ్య

టైబ్రేకర్‌లో హారికపై గెలుపు

బటుమి(జార్జియా): భారత్‌కు చెందిన మరో గ్రాండ్‌మాస్టర్ దివ్య దేశ్‌ముఖ్ ఫిడే మహిళల ప్రపంచకప్ సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. ద్రోణవల్లి హారిక–దివ్య దేశ్ ముఖ్‌ల మధ్య ఎజరిగిన తొలి రెండు గేమ్‌లు డ్రా కావడంతో ఫలితం కోసం టైబ్రేకర్ నిర్వహించారు. సోమవారం జరిగిన టై బ్రేకర్‌లో దివ్య ఉత్కంఠపోరులో హారికను చిత్తుచేసింది. 19ఏళ్ల దివ్య తనకంటే సీనియర్ అయిన హారికను ఓడించడం విశేషం. దీంతో ఈ టోర్నమెంట్‌లో భారత్ తరఫున సెమీస్‌కు చేరిన రెండో మహిళా గ్రాండ్‌మాస్టర్‌గా దివ్య నిలిచింది. సెమీస్‌లో దివ్య చైనాకు చెందిన టాన్ జోంగీతో తలపడనుంది. ఈ టోర్నీలో 2023లో భారత్‌నుంచి ద్రోణవల్లి హారిక క్వార్టర్‌ఫైనల్ వరకు మాత్రమే చేరుకోగలిగింది.

చరిత్ర సృష్టించిన కోనేరు హంపి

భారత స్టార్ మహిళా గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి చరిత్ర సృష్టించింది. ఫిడే మహిళల ప్రపంచకప్ సెమీఫైనల్లోకి దూసుకెళ్లి తొలి గ్రాండ్‌మాస్టర్‌గా నిలిచింది. చైనాకు చెందిన యాక్సిన్ సాంగ్‌తో జరిగిన క్వార్టర్ ఫైనల్లో నల్లపావులతో ఆడుతూ తొలి గేమ్‌ను గెలిచిన హంపి.. ఆ తర్వాత జరిగిన క్లాసికల్ గేమ్‌ను డ్రాగా ముగించింది. దీంతో 1.5–0.5 పాయింట్ల తేడాతో విజయం సాధించింది.



టీమిండియాకు గాయాల బెడద

- టెస్ట్ సిరీస్‌కు నితీశ్‌రెడ్డి, నాల్గో టెస్ట్‌కు అర్ష్‌దీప్ దూరం
- పంత్ ఫిట్‌నెస్‌పై ఉత్కంఠ
- వర్క్‌లోడ్‌తో బుమ్రా కూడా..

మాంచెస్టర్: నాల్గో టెస్ట్ ప్రారంభానికి ముందు టీమిండియాకు గాయాల బెడద వెంటాడుతోంది. మూడో టెస్ట్‌లో తీవ్రంగా గాయపడిన వికెట్ కీపర్ రిషబ్ పంత్ ఫిట్‌నెస్‌పై ఎలాంటి ప్రకటన రాకున్నా.. తాజాగా ఆల్‌రౌండర్, తెలుగు కుర్రాడు నితీష్ కుమార్ రెడ్డి, ఎడమచేతి వాటం పేసర్ అర్ష్‌దీప్ గాయాల బారిన పడ్డారు. ఇక వర్క్‌లోడ్‌తో జస్ప్రీత్ బుమ్రా మూడు టెస్ట్‌లకు మాత్రమే అందుబాటులో ఉంటాడని బిసిసిఐ ఈ పర్యటనకు ముందే ప్రకటించింది. దీంతో నాల్గో టెస్ట్‌కు ముందు ఇద్దరు స్టార్ ప్లేయర్లు గాయాలతో, మరో ఇద్దరి ఎంపికపై ఉత్కంఠ నెలకొంది. బుమ్రాను నాల్గో టెస్ట్‌కు ఎంపిక చేస్తే.. ఐదో టెస్ట్‌కు తప్పనిసరిగా బెంచ్‌కే పరిమితమయ్యే పరిస్థితి. దీంతో జట్టు మేనేజ్‌మెంట్‌కు ఇది పెద్ద తలనొప్పిగా మారింది. దీంతో ఫిట్‌గా ఉన్న ఆటగాళ్లతోనే బెకెన్‌హామ్ టెస్ట్‌కు టీమిండియా బరిలోకి దిగే ఛాన్స్ ఉంది. నితీశ్ కుమార్ రెడ్డి ఆదివారం నెట్స్‌లో ప్రాక్టీస్ చేస్తుండగా మోకాలికి తీవ్ర గాయమైందని, దీంతో నాల్గో టెస్ట్‌కు మాత్రమే విశ్రాంతినిస్తున్నట్లు బిసిసిఐ తొలుత ప్రకటించింది. కానీ గాయం తీవ్రత దృష్ట్యా అతడు సిరీస్ మొత్తానికి దూరమైనట్లు సోమవారం మరో ప్రకటన విడుదల చేసింది. జిమ్‌లో నితీశ్ ప్రాక్టీస్ చేస్తుండగా ఎడమ కాలికి తీవ్ర గాయమైంది. దీంతో అతడు సిరీస్ మొత్తానికి దూరమయ్యాడు. అతడు భారత్‌కు తిరుగు పయనమయ్యాడని పేర్కొంది. అలాగే ఎడమచేతి వాటం పేసర్ అర్ష్‌దీప్ కూడా గాయంతో నాల్గో టెస్ట్‌కు దూరమయ్యాడు. బెకెన్‌హామ్‌లో అతడు నెట్స్‌లో ప్రాక్టీస్ చేస్తుండగా అతడి ఎడమచేతి బొటన వ్రేలికి గాయమైంది. దీంతో అతడు నాల్గో టెస్ట్‌కూ అందుబాటులో ఉండడని తాజాగా పేర్కొంది.

నాల్గో టెస్ట్‌లో గెలిస్తేనే...

ఐదు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్‌లో 1–2తో వెనుకబడిన టీమిండియా ఓల్డ్ ట్రఫోర్డ్ టెస్ట్ మ్యాచ్‌లో గెలిస్తేనే సిరీస్ రేసులో నిలువనుంది. ఈ మైదానంలో గత తొమ్మిది మ్యాచుల్లో ఒక్క దాంట్లోనూ ఇండియా గెలిచిన దాఖలాలు లేవు. నాలుగు టెస్టుల్లో ఇంగ్లండ్ జట్టు జయకేతనం ఎగురవేయగా.. భారత్ నాలుగింటిని డ్రా చేసుకుంది. ఈ నేపథ్యంలో లార్డ్స్ ఓటమి నుంచి తేరుకొని శుభ్‌మన్ గిల్ సేన రాణిస్తే తప్ప సిరీస్ రేసులో నిలవడం కష్టం. రాహుల్ ద్రవిడ్ సారథ్యంలో 2007లో ఇంగ్లండ్ గడ్డపై చివరిసారిగా భారత జట్టు టెస్టు సిరీస్ గెలిచింది. ఆ తర్వాత ఎంఎస్ ధోనీ, విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ.. ఇలా ఎందరో కెప్టెన్లు మారినా పరాజయమే పలకరించింది. కానీ, గత రికార్డులను చెరిపేస్తూ.. బర్మింగ్‌హామ్‌లో చరిత్రాత్మక విజయంతో రికార్డులు నెలకొల్పిన గిల్ బృందం చేజేతులా లార్డ్స్‌లో ఓడిపోయింది. ప్రస్తుతం టెస్టు సిరీస్‌లో 2–1తో వెనబడిన టీమిండియాకు ఓల్డ్ ట్రఫోర్డ్ మ్యాచ్ చావోరేవో లాంటిది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68